అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సోమవారం 8-5-2023 | సమగ్ర తెలుగు దినపత్రిక | www.navatelangana.com

సంపుటి : 9 | సంచిక : 76 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 10 పేజీలు | వెల : 6.50





బ్రిజ్ భూషణ్ ను జైలుకు పంపండి

డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ రాజీనామా చేయాలి : హన్నన్ మొల్లా

- రెజ్లర్లకు రైతు నేతల మద్దతు
- భారీ స్థాయిలో పోలీసు బలగాలు
- టిక్రీ సరిహద్దు వద్ద రైతులను అడ్డుకున్న పోలీసులు
- బారికేడ్లను నెట్టుకొని జంతర్ మంతర్‌కు చేరుకున్న మహిళా రైతులు

నవతెలంగాణ ..న్యూఢిల్లీ బ్యూరో

లైగింక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను 15 రోజుల్లోగా అరెస్టు చేయాలి. లేకపోతే తాము దేశవ్యాప్తంగా ఆందోళన చేపడతామని రైతు నేతలు హెచ్చరించారు. మహిళా రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు సంయుక్త కిసాన్ మోర్చ(ఎస్కేఎం) ఆధ్వర్యంలో రైతు సంఘాలు మద్దతు పలికాయి. ఢిల్లీ సరిహద్దుల్లో మోహరించిన భారీ పోలీసు బలగాలను దాటుకుని ఎస్కేఎం నేతలు రాకేశ్ తికాయత్, దర్శన్ పాల్, హన్నన్ మొల్లా, జోగేంద్ర సింగ్ ఉగ్రహాన్, అరబ్ సింగ్ అష్లీవత్ తదితర నేతలు జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న రెజ్లర్లను కలిశారు.

పంజాబ్, హర్యానా, ఉత్తర ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన వేలాది మంది రైతులు, మహిళా రైతులతో కలిసి రైతు నేతలు మహిళా రెజ్లర్లకు సంఘీభావం ప్రకటించారు. హర్యానాలోని వివిధ 'ఖాప్‌ల' ప్రతినిధులు కూడా మహిళా రెజ్లర్లకు తమ మద్దతు తెలిపారు.

కొనసాగుతున్న ఆందోళన..

బ్రిజ్ భూషణ్ ను అరెస్టు చేయాలనీ, బాధిత రెజ్లర్లకు న్యాయం చేయాలని రోడ్డెక్కిన రెజ్లర్లు, ఆదివారం కూడా తమ ఆందోళనను కొనసాగించారు. గత 15 రోజులుగా జరుగుతున్న ఈ ఆందోళన రోజు రోజుకూ ఉధృతమవు తోంది. ఆదివారం రైతులు వచ్చి మద్దతు తెలిపి, అండగా ఉంటామని హామీ ఇవ్వడంతో రెజ్లర్లలో ఆత్మ విశ్వాసం మరింత పెరిగింది. రైతుల రావడంతో జంతర్ మంతర్ వద్ద భారీ సంఖ్యలో పోలీస్ బలగాలు మోహరించాయి. హర్యానా..9లో

గుజరాత్‌లో 41 వేల మంది మహిళల అదృశ్యం

మోడీ,అమిత్ షా సొంత రాష్ట్రంలో అంతుచిక్కని మిస్టరీ



దేశానికే ఆదర్శం గుజరాత్. ఆ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి చూసి నేర్చుకొమ్మని ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా గొప్పగా చెబుతుంటారు. కానీ గుజరాత్‌లో పేదలకు,మహిళలకు ఎలాంటి భద్రత,రక్షణ లేదని జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్సీఆర్‌బీ) నివేదిక చెబుతోంది. కేరళ ఫైల్స్ పేరిట తీసిన సినిమాలో 32 వేల మంది మహిళల్ని సిరియాకు తీసుకెళ్లినట్టు అబద్ధపు ప్రచారాన్ని బీజేపీ ఎన్నికల అస్త్రంగా వాడుకుంటుంటే..కేంద్ర ప్రభుత్వ సంస్థ విడుదల చేసిన రిపోర్టులో 41 వేల మంది మహిళలు గాయబ్ అయినా..కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవటంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అహ్మదాబాద్ : ఐదేండ్ల కాలంలో గుజరాత్‌లో 41 వేల మందికి పైగా మహిళలు అదృశ్యమయ్యారు. జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్సీఆర్‌బీ) అందించిన వివరాల ప్రకారం 2016లో 7,105, 2017లో 7,712, 2018లో 9,246, 2019లో 9,268, 2020లో 8.290 మంది మహిళల ఆచూకీ తెలీకుండా పోయింది. దీంతో ఐదేండ్లలో అదృశ్యమైన మహిళల సంఖ్య 41,621కి చేరింది. రాష్ట్ర ప్రభుత్వం 2021లో అసెంబ్లీలో చేసిన ప్రకటన ప్రకారం 2019-2020లో అహ్మదాబాద్, వడోదరలోనే ...9లో



మతోన్మాద కోరల్లో దేశం

బీజేపీని గద్దెదించాల్సిందే... మేడే స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలు

నవతెలంగాణ-భూపాలపల్లి

దేశ ప్రజలను మోసం చేసి గద్దెనెక్కి తినే తిండి మీద, కట్టుకునే బట్ట మీద లక్షల కోట్ల రూపాయల పన్నులు వేస్తూ మోయలేని భారాలు మోపుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఇక గద్దె దించాల్సిందేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్ కాలనీ అంగడి మైదానంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన మేడే వారోత్సవాల ముగింపు సభ జరిగింది. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు అధ్యక్షతన వహించారు ముందుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని హనుమాన్ దేవాలయం నుంచి గణేష్ చౌక్, అంబేద్కర్ సెంటర్ మీదుగా సుభాష్ కాలనీ క్రీడా మైదానంలో జరిగే బహిరంగ సభకు ప్రజలు భారీ ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో తమ్మినేని మాటాడుతూ... మేడే స్ఫూర్తితో ఉద్యమాలు జరగాలని, శ్రమజీవుల రాజ్యాన్ని స్థాపించాలని అన్నారు. జిల్లా కేంద్రంలో వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని గద్దెనెక్కిందని, ఇపుడు వాటి ఊసే లేదని విమర్శిం చారు. దేశం నేడు మతోన్మాద కోరల్లో చిక్కుకుందన్నారు. రాజ్యాంగ విలువలకు ...2లో

వేసుకున్న గుడిసెలకు పట్టాలివ్వాలి : భూపాలపల్లిలో సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

హిందూ, ముస్లిం, క్రైస్తవుల మధ్య సెంటిమెంట్లు రెచ్చగొట్టి ఎన్నికల్లో మరోసారి లబ్ది పొందేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. బీజేపీ పాలనకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలి. దేశంలో మోడీ, అమిత్ షా నేతృత్వంలో కార్పొరేట్ కంపెనీలకు లక్షలకోట్ల రూపాయలు కట్టబెడుతూ ప్రజలపై భారాలు మోపుతున్నారు. ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అమ్మేస్తున్నారు. మానవాభివృద్ధి ,ఆకలి సూచికలో మన దేశం అట్టడుగు స్థానంలో ఉన్నది. లక్షల కోట్ల నల్లధనం తీసుకొచ్చి ప్రతి కుటుంబానికి రూ.15లక్షలు ఖాతాలో వేస్తామన్న హామీ అటకెక్కింది. దేశ వినాశనానికి పాల్పడుతున్న బీజేపీని ఓడించాలి.
- తమ్మినేని

కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే..

- బీసీ జనగణన ఎందుకు చేయటం లేదు
- తెలంగాణలో పాగా వేయాలి : 'తెలంగాణ భరోసా' సభలో బీఎస్పీ అధినేత్రి మాయావతి
- సీఎం అభ్యర్థిగా ప్రవీణ్‌కుమార్ ప్రకటన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందేనని బీఎస్పీ అధినేత్రి మాయావతి విమర్శించారు.ఆ రెండు పార్టీలతో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన 'తెలంగాణ భరోసా సభ'కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాయావతి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ...2లో

యువ సంఘర్షణ సభ

నేడు సరూర్‌నగర్ స్టేడియంలో యూత్ డిక్లరేషన్‌పై ప్రియాంకగాంధీ ప్రకటన

- భారీ జనసమీకరణకు ఏర్పాట్లు




నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ తలపెట్టిన యువ సంఘర్షణ సభను సోమవారం నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియం లో నిర్వహించనున్న ఈ సభకు ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకగాంధీ హాజరుకానున్నా రు. ఈ సందర్భంగా యూత్ డిక్లరేషన్ పేరుతో నిరుద్యోగులకు భరోసా పత్రాన్ని విడుదల చేయనున్నారు. ప్రియాంక తొలిసారి రాష్ట్రానికి రానుండటంతో పార్టీ ఆ సంఘర్షణ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఆయా నియోజకవర్గాలకు ఇంచార్జిలను నియమించి భారీ జనసమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రియాంకగాంధీ తొలుత ఎల్బీనగర్ చౌరస్తాకు చేరుకుంటారు. అక్కడ తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి విగ్రహానికి నివాళులర్పిస్తారు. అక్కడి నుంచి నేరుగా సరూర్‌నగర్ స్టేడియానికి చేరుకుంటారు. అనంతరం యువ సంఘర్షణ సభలో ప్రసంగిస్తారు. వివిధ కారణాలతో మరణించిన పార్టీ కార్యకర్తలకు కాంగ్రెస్ కల్పించిన బీమా సౌకర్యాన్ని బాధితులకు అందించనున్నారు.

జనగణన జరిగేనా ?

నేటికీ కాలం చెల్లిన లెక్కలే ఆధారం



న్యూఢిల్లీ : కులగణన జరిపే అధికారం రాష్ట్రానికి లేదంటూ ఇటీవల పాట్నా హైకోర్టు ఇచ్చిన తీర్పు నితీశ్ కుమార్ ప్రభుత్వానికి ఎదురు దెబ్బగా భావించవచ్చు. ఎందుకంటే రూ. 115 కోట్ల వ్యయంతో జనవరి 7న బీహార్ ప్రభుత్వం ఈ బృహత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే కులగణన చేసే అధికారం ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. దేశంలో కులాలపై సర్వే జరపడం 1931 జనాభా లెక్కల సేకరణతోనే ప్రారంభమైంది. కులగణన సంగతి అటుంచితే జనాభా లెక్కల సేకరణను కూడా ఏ కారణం చేతనో కేంద్రం జరపడం లేదు. 2021లో జనాభా లెక్కలు సేకరించాల్సి ఉండగా ఆ పని నేటికీ జరగకపోవడంతో దేశం ఇప్పటికీ 2011 లెక్కల పైనే ఆధారపడాల్సి వస్తోంది.

ప్రతి పదేండ్లకు ఒకసారి జనాభా లెక్కలు సేకరించే ప్రక్రియను 1881లో ప్రారంభించారు. ఇప్పటి వరకూ అది వాయిదా పడలేదు. జాప్యం కూడా జరగలేదు. జనగణన కోసం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా కార్యాలయాన్ని (ఓఆర్‌జీఐ) ప్రారంభించారు. జనగణన అనేది పెద్ద ఎత్తున చేపట్టే కసరత్తు. ఇరవై నుండి ముప్పై లక్షల మంది ఎన్యూమరేటర్లు గడపగడపకూ వెళ్లి వ్యక్తిగత, కుటుంబ సమాచారాన్ని సేకరిస్తారు. విద్య, అక్షరాస్యత స్థాయి, గృహవసతి, సంతానం, సౌకర్యాలు, వలస, భాష, ప్రాంతం, కులం...ఇలా అనేక వివరాలు తెలుసుకుంటారు. ప్రజల అవసరాలు తెలుసుకోవడానికి, ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవడానికి ఈ వివరాలు చాలా అవసరం.

2021 జనగణనకు సంబంధించి 2019లో ప్రణాళికలు రూపొందించారు. రూ. 8,754 కోట్ల బడ్జెట్‌ను సైతం కేటాయించారు. మొట్టమొదటిసారిగా డిజిటల్ పద్ధతిలో సమాచార సేకరణ జరపాలని నిర్ణయించారు. అయితే కోవిడ్ కారణంగా ఈ ప్రక్రియను నిరవధికంగా వాయిదా వేశారు. అనంతరం 2022 డిసెంబర్ 31 తర్వాత పని మొదలు పెట్టాలని భావించారు. ఈ తేదీని మరోసారి పొడిగించి ఈ సంవత్సరం జూలై 1వ తేదీగా నిర్ణయించారు. అయితే 2024 లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యేంత వరకూ పని మొదలు పెట్టే అవకాశాలు కన్పించడం లేదు.

అసలు శాస్త్రీయ సమాచారం అంటేనే ఈ పాలకులకు కంపరంగా ఉంటోంది. ఓబీసీల సంఖ్య, మైనారిటీలలో సంతానోత్పత్తి రేటు వంటి అంశాలపై బీజేపీ వాదనలు వాస్తవానికి భిన్నంగా ఉన్నాయి. జనగణన చేస్తే ఆర్థికాభివృద్ధి విషయంలో ఆ పార్టీ నేతలు చెబుతున్న మాటలలో డొల్లతనం బయటపడుతుంది. పేదరిక నిర్మూలనపై శాస్త్రీయమైన సమాచారమేదీ ...9లో



ఓటమి భయంతో బీజేపీ నాయకుల బెదిరింపులు

టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి 9లో..

- కర్నాటక బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిపై ఫిర్యాదు

ఆస్తి పంచివ్వలేదని..

తల్లి మృతదేహాన్ని తీసుకెళ్లని కూతుర్లు



- కామారెడ్డిలో అమానవీయ ఘటన 3లో..

పుట్ట పాడులో ఎన్‌కౌంటర్

ఇద్దరు మావోస్టులు మృతి

- బూటకపు ఎన్‌కౌంటర్ :మావోయిస్టు నేత ఆజాద్


వివరాలు 9లో..

అప్పుల ఊబిలో కర్నాటక

ప్రతి ఓటరు పైనా రూ. 1.2 కోట్ల రుణ భారం

- సంక్షేమానికి అరకొర కేటాయింపులే
- 10న తేలనున్న బీజేపీ ప్రభుత్వ భవితవ్యం



బెంగళూరు : కర్నాటకలో ఇప్పటి వరకూ అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టేసింది. ఈ నెల 10న జరగబోయే అసెంబ్లీ ఎన్నికలలో ఆ పార్టీకి ఓటమి తప్పదని పలు ఒపీనియన్ పోల్స్ అంచనా వేయడానికి బహుశా ఇది కూడా ఒక కారణం కావచ్చు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు సైతం ఈ వాదనకు బలం చేకూరుస్తున్నాయి. కర్నాటకలో బీజేపీ తిరిగి అధికారంలోకి రావడం కష్టమేనని మెజారిటీ సర్వేలు తేల్చేశాయి. దేశంలో ఆర్థికంగా పటిష్టంగా ఉన్న రాష్ట్రాలలో కర్నాటకది నాలుగో స్థానం. ఆధునిక పరిశ్రమలకు కూడా అది కేంద్ర స్థానంగా కొనసాగుతోంది. అయినప్పటికీ గత నాలుగేండ్లలో ...9లో

నేటితో కర్నాటక ప్రచారానికి తెర 2లో..

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

ప్రపంచ గమనం



అవినీతికి ఆలవాలంగా మారిన అమెరికా న్యాయ వ్యవస్థ!

నెల్లూరు నరసింహారావు

అమెరికా న్యాయవ్యవస్థ అవినీతిమయం అయిందని గత వారం రోజులుగా వెల్లడౌతున్న వాస్తవాలు తెలియజేస్తున్నాయి. ముందుగా అత్యంత అవినీతిపరులైన జస్టిస్ క్లారెన్స్ థామస్, ఆయన భార్య వర్జీనియా జిన్నీ థామస్ చుట్టూ తిరిగిన ఈ కుంభకోణం ఆ తరువాత ప్రధాన న్యాయమూర్తితో పాటు యావత్ సుప్రీం కోర్టును ఆవహించింది. ప్రజాస్వామ్య, కార్మికవర్గ వ్యతిరేకి అయిన క్లారెన్స్ థామస్ రిపబ్లికన్ పార్టీకి చెందిన బిలియనైర్ హర్లాన్ క్రో నుంచి లక్షలాది డాలర్ల విలువైన 'బహుమతుల'ను అందుకున్నట్టు పరిశోధక జర్నలిజం వెబ్ సైట్ "ప్రొపబ్లికా" అనేక డాక్యుమెంట్లను ప్రచురించింది. ఈ హర్లాన్ క్రో హిట్లర్, నాజీల జ్ఞాపికలను సేకరించి తన టెక్సాస్ భవనంలో ప్రదర్శిస్తుంటాడు. అంతేకాదు తనకు మార్క్సిజం అంటే భయమంటాడు.

రెండు దశాబ్దాలపాటు థామస్, అతని భార్య చేసిన విహార యాత్రల వ్యయాన్ని హర్లాన్ క్రో భరించాడు. వీటిని థామస్ తన ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లలోగానీ, మరెక్కడా కూడా ప్రకటించలేదు. ఫెడరల్ కోర్టులను ప్రగతినిరోధకులతో నింపటానికి ఇతనికి ఫాసిస్టు మేధావులు, కార్పొరేట్ పెట్టుబడిదారులు, మితవాద రాజకీయ నాయకులు సహకరించే వారు.1991లో హైకోర్టులో చేరిన తరువాత థామస్ అనేక అప్రజాస్వామిక, కార్పొరేట్ అనుకూల తీర్పులను ఇవ్వటం జరిగింది. ఈ తీర్పుల్లో 2000వ సంవత్సరంలో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఫ్లోరిడా ఓట్లను తిరిగిలెక్కించకుండా చేసి ఓడిపోయిన బుష్‌ను గెలిచేలా చేసిన "బుష్ వర్సెస్ గోర్" కేసు (5అనుకూలం 4ప్రతికూలం) తీర్పుకూడా ఉంది.

థామస్ భాగస్వామ్యంతో ఇచ్చిన తీర్పుల్లో ఎన్నికల ప్రచారానికి కార్పొరేట్ కంపెనీలు ఇచ్చే డొనేషన్లకు పరిమితిని ఎత్తివేసిన "సిటిజెన్ యునైటెడ్ వర్సెస్ ఎఫ్ఇసి" కేసు, మహిళలు ఎబార్షన్ చేయించుకోవటానికి రాజ్యాంగం ఇచ్చిన హక్కును రద్దు చేసిన "డాబ్స్ వర్సెస్ జాక్సన్ విమెన్ హెల్త్" కేసులు కూడా ఉన్నాయి. 2020 అధ్యక్ష ఎన్నికల తీర్పును బైడెన్‌కు వ్యతిరేకంగా మలచటానికి చేసిన ప్రయత్నంలో థామస్ భార్య జిన్నీ భాగస్వామి అయినప్పటికీ ఆ కేసును విచారిస్తున్న బెంచ్ నుంచి వైదొలగటానికి (రెక్యూస్) ఆయన తిరస్కరించాడు. ఇలా అనేక ఆర్థిక అవకతవకలకు థామస్, అతని భార్య జిన్నీ పాల్పడినట్టు "ప్రొపబ్లికా" వెబ్ సైట్ అనేక డాక్యుమెంట్లను ప్రచురించింది. వీళ్ళ అవినీతిని గురించి వాషిగ్టన్ పోస్ట్ కూడా నిర్ధారించటమే కాకుండా అనేక కొత్త విషయాలను కూడా రాసింది.

అయితే అవినీతి, అప్రకటితంగా బహు మతులను అందుకోవటం, ఇతరుల డబ్బుతో విహారయాత్రలు చేయటం, ఉపన్యాసాలను లాభసాటిగా మార్చటం, సంపన్నులతో ఆర్థిక లావాదేవీలను కలిగివుండటం థామస్‌కి, రిపబ్లికన్లకు మాత్రమే పరిమితం కాలేదు. ఇటీవల కాలంలో అనేక విషయాలు బయటకు వచ్చాయి. వాటిలో కొన్ని ఇలా ఉన్నాయి: 2017లో హైకోర్టుకు ప్రమోట్ అయ్యాక ట్రంప్ చేత నియమింపబడిన నీల్ గోర్సచ్ తన ఆస్తిని ఒక లా ఫర్మ్ సిఈఓకి అమ్మటం జరిగింది. ఆ ఫర్మ్ కేసులు కోర్టు ముందున్నవిషయం అందరికీ తెలుసు. కానీ ఈ ఆస్తి అమ్మకం గురించి ఎక్కడా వెల్లడించలేదు. 2007-2014 సంవత్సరాల మధ్యకాలంలో ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ భార్య జేన్ రాబర్ట్స్ ఖరీదైన లాయర్లను నియమించి ప్రముఖ లా ఫర్మ్‌లా నుంచి 10.3మిలియన్ డాలర్ల కమిషన్లను అందుకుంది. ఆ లా ఫర్మ్‌లాలో కనీసం ఒక కేసును ప్రధాన న్యాయమూర్తి భార్యకు వేల డాలర్లను సమర్పించిన తరువాత ఆ లా ఫర్మ్‌లాలో ఒక ఫర్మ్ వాదించటం జరిగింది. ఈ సమాచారాన్ని ఒక ప్రజావేగు(విజిల్ బ్లోయర్) వెల్లడించాడు తప్ప ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ వెల్లడించలేదు.

అలాగే 2004-2018 సంవత్సరాల మధ్యకాలంలో డెమోక్రాటిక్ పార్టీకి చెందిన జస్టిస్ స్టీఫెన్ బ్రేయర్ ఐరోపా, జపాన్, ఇండియా, హవాయ్‌లకు అనేకసార్లు చేసిన విహారయాత్రలకు అయిన వ్యయాన్ని ఇతరులు భరించారు. అటువంటి విహారయాత్రలలో ఒకదాని వ్యయాన్ని ఒక ప్రయివేటు ఈక్విటీ పెట్టుబడిదారు డేవిడ్ రూబెన్ స్టైన్ భరించాడు. కొన్ని విహారయాత్రల వ్యయాన్ని అమెరికాలో అత్యంత ధనవంతుల జాబితాలోవున్నప్రిట్జ్ కర్ కుటుంబం భరించింది. 2018లో దివంగత జస్టిస్ రుత్ బాడర్ గిన్స్ బర్గ్ చేసిన ఇజ్రాయిల్ యాత్రకు అయిన వ్యయాన్ని కోర్టుముందు వ్యాపార సంబంధిత కేసున్న ఇజ్రాయిలీ బిలియనీర్ మోరిస్ ఖాన్ భరించాడు.

ఇలా చెప్పుకుంటూపోతే అమెరికా న్యాయ వ్యవస్థలో జరిగిన అవినీతి కథలకు అంతే ఉండదు. కార్పొరేట్ క్యాష్, రాజకీయ పలుకుబడి, ఫెడరల్ న్యాయ వ్యవస్థ మధ్యగల అవినాభావసంబంధం గురించి పాలక వర్గాలకు, కార్పొరేట్ మీడియాకు బాగా తెలుసు. ఇప్పటిదాకా ఈ అక్రమ సంబంధం గురించి సాధారణ ప్రజలకు తెలియకుండా చేశారు. ప్రస్తుతం ఐరోపాలో జరుగుతున్న ఉక్రెయిన్ యుద్ధం, ఒక మాజీ అధ్యక్షుడి తిరుగుబాటుతో డీలాపడిన రాజకీయ వ్యవస్థ, ఆర్థిక సంక్షోభం, ప్రజలకు చుక్కలు చూపుతున్న ధరల పెరుగుదల, అమెరికాలోను, అంతర్జాతీయంగాను చెలరేగుతున్న కార్మికవర్గ తిరుగుబాట్లతో సతమతమౌతున్న పాలక వర్గాలకు అవినీతిలో కూరుకుపోయి పరువుపోగొట్టుకుంటున్న సుప్రీంకోర్టు వ్యవహారం మరింత తలపోటుకు కారణమౌతోంది. "చట్ట పాలన"ను కాపాడే సంస్థగా ఒకప్పుడు ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న సుప్రీం కోర్టును ఒక తాజా ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం నేడు కేవలం 25శాతం ప్రజలు మాత్రమే గౌరవిస్తున్నారు. అధ్యక్ష, కాంగ్రెస్(అమెరికా శాసన వ్యవస్థ)వ్యవస్థలలాగానే సుప్రీం కోర్టు కూడా ప్రజల దృష్టిలో రోజురోజుకూ చులకనైపోతోందని ఈ మధ్య కాలంలో న్యూయార్క్ టైమ్స్ తన విచారాన్ని వ్యక్తం చేసింది.

అమెరికా న్యాయ వ్యవస్థలో ప్రజల ప్రమేయం లేకుండా జీవితకాలం పదవిలో కొనసాగే న్యాయమూర్తుల అవినీతి ప్రజల ప్రజాస్వామిక, సామాజిక హక్కులపైన దాడిగా పరిణమిస్తోంది. నిజానికి ఇది పెట్టుబడిదారీ వ్యవస్థలో పాలక వర్గ ఆధిపత్యాన్ని కొనసాగేలాచేసే ఏర్పాటులో భాగమే. దీన్ని విడిగా సంస్కరించటం దుస్సాధ్యం. సమాజ విప్లవీకరణతో మాత్రమే మిగిలిన వాటితోపాటుగా న్యాయ వ్యవస్థ కూడా పునఃనిర్మించబడుతుందని చెప్పనక్కరలేదనుకుంటా.

ప్రాజెక్టుల నిర్మాణాల్లో లోపాలు

ఆయకట్టుకు చేరని నీళ్లు

- మారుతున్న అంచనాలు
- ప్రజాధనం వృధా
- రీడిజైన్లతోనూ ఆర్థికంగా నష్టమే

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాల్లో లోపాల మూలంగా ఆయకట్టు లక్ష్యం నెరవేరడం లేదు. ప్రభుత్వాల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల ధనదాహంతో విలువైన ప్రజాధనం వృధా అవుతున్నది. ఆనక సామాన్య ప్రజలపైనే ఆర్థిక భారాలు పడుతున్నాయి. సాగునీటి ప్రాజెక్టులను సంపూర్ణంగా నిర్మించని ఫలితంగా ఆశించిన ప్రయోజనాలు నెరవేరడం లేదు. పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) ప్రకారం ప్రాజెక్టులు కడితే ఆర్థిక నష్టాలు ఉండవనేది సాగునీటిరంగ నిపుణుల మాట. రాష్ట్రంలోని దాదాపు అన్నీ ప్రాజెక్టుల నిర్మాణాలు ప్రభుత్వాలు, వర్కింగ్ ఏజెన్సీలతో కుదుర్చుకున్న డీపీఆర్ ఒప్పందం(అగ్రిమెంట్) ప్రకారం లేవు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మాణ పరిధిలోని ఆయకట్టు చివరి ఎకరం వరకు తడవడం లేదు. దీంతో ప్రాజెక్టుల లక్ష్యాలు ఎక్కడవేసిన గొంగడి అక్కడేలా ఉంది.

సంపూర్ణ ప్రాజెక్టు అంటే..

పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) తయారైనప్పటి నుంచి నిర్ణయించిన రేట్లనే అమలుచేయాలి. నిర్ణీత కాలంలో పూర్తి చేయాలి. అప్పుడే అది సమగ్ర ప్రాజెక్టు అవుతుంది. కానీ భూసేకరణ జరగలేదనీ, బిల్లులు ఇవ్వడం లేదంటూ కాంట్రాక్టర్లు అదనపు నిధుల కొరకు వెంపర్లాడుతూ అంచనాల సవరణ(రివైజ్డ్ ఎస్టిమేట్లు) పేరుతో డీపీఆర్‌లో ఉన్న మొత్తం కంటే నాలుగైదు రెట్లు పెంచిన సందర్భాలూ ఎన్నో. ఈ తరహా ప్రాజెక్టులు రాష్ట్రంలో ఎక్కువగానే ఉన్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రూ.40.15 కోట్లతో ప్రారంభించి రూ.3000 కోట్లు వ్యయం చేసినా మొదటి దశ పూర్తికాలేదు. కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, శ్రీరాంసాగర్ రెండోదశ తదితర భారీ ప్రాజెక్టులు ఆ కోవలోకే వస్తాయి. అలాగే ఆసీఫాబాద్‌ను ఆనుకుని ఉన్న జగన్నాధపురం ప్రాజెక్టు రూ. 60 కోట్లతో చేపట్టి రెండు దశాబ్దాలు దాటింది. ఇప్పటివరకు దానికి రూ. 250 కోట్లు ఖర్చుపెట్టినా పూర్తికాకపోవడం గమనార్హం.

ఇవి తప్పనిసరి..

మామూలుగా ప్రాజెక్టుల నిర్మాణాలు జరగాలంటే నాలుగు రకాల అనుమతులు తప్పనిసరి. కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ), అటవీశాఖ, పర్యావరణం, సాంకేతిక అనుమతులు తప్పకుండా తీసుకోవాల్సి ఉంటుంది. వీటిలో ఏదీ సరిగ్గా లేకపోయినా ప్రాజెక్టు నిర్మించడానికి వీలుండదు. ప్రభు త్వాలు ముందు, వెనకా అనుమతులు తీసుకుని నిర్మాణం చేపడు తుంటాయి.



ఎవరెవరు.. ఎంతెంత

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచే నిర్మాణంలో ఉన్నాయి. ఆయా రాజకీయ పార్టీల పరిపాలనాకాలంలో శ్రీకారం చుట్టారు. టీడీపీ ప్రభుత్వ పాలనలో రూ. 17 వేల కోట్లు ఖర్చుపెట్టగా, కాంగ్రెస్ హయాంలో రూ.92 వేల కోట్లు వ్యయం చేసినట్టు అధికారిక సమాచారం. ఇకపోతే గత ఏనిమిదేండ్లుగా బీఆర్ఎస్ సర్కారు సాగునీటి పథకాలపై రూ. 1.5 లక్షల కోట్లకుపైగానే వెచ్చించింది. అయినా రాష్ట్రంలో ఏ ఒక్క ప్రాజె క్టూ సంపూర్ణంగా నిర్మా ణం జరగలేదని సాగునీటి రంగ నిపుణులు అంటు న్నారు.

రివిట్‌మెంట్ పనులే కీలకం

ప్రాజెక్టు పూర్తికావడమంటే ఆ ప్రాజెక్టు డిజైన్‌లో చెప్పినట్టుగా రివిట్‌మెంటుతోపాటు కాలువల లైనింగ్ పనులూ జరగాలి. లైనింగ్ కోసం పూర్తిస్థాయి పరిమాణంతో కూడిన సిమెంట్ పనులు జరగకపోతే ప్రాజెక్టు ఆయకట్టుకు న్యాయం జరగదు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తే కేవలం 50 క్యూసెక్కులు మాత్రమే కాలువ చివరి ఆయకట్టుకు చేరుతుంది. నీరు భారీగా వృధా అవడమేగాక, సహజంగానే ఆయకట్టుకూ తీవ్ర నష్టం జరుగుతున్నది. బ్రాంచ్ కెనాళ్లు, రివిట్‌మెంటు, లైనింగ్ పనులు పెండింగ్‌లో ఉంటూనే ఉన్నాయి. కాలువల్లో చెట్లు, చెత్తాచెదారం పేరుకుపోయి నీళ్లు భూమిలోకి ఇంకిపోతున్నాయి. అలాగే అవి నీటి ప్రవాహానికి ఆటంకంగా తయారవుతున్నాయి. ప్రాజెక్టు పూర్తయిందని చెప్పాలంటే కాలువల నిర్మాణమే అత్యంత ముఖ్యం. ఆ పనులను వదిలేసి ప్రభుత్వాలు మాత్రం ప్రాజెక్టులు పూర్తయ్యాయని చెబుతుంటాయి. తద్వారా నష్టమే తప్ప లాభం జరగదు.



డీపీఆర్లను మార్చేస్తారు..

రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా వర్కింగ్ ఏజెన్సీలు మారతాయి. డీపీఆర్లనూ సవరిస్తారు. డీపీఆర్‌ను మార్చకపోతే పాత కాంట్రాక్టర్లనే కొనసాగించాల్సి వస్తుంది. పాతవారిని తొలగించాలంటే ప్రాజెక్టును రీడిజైన్ చేయాలి. అందులో మార్పులు చేస్తూ కొత్త డీపీఆర్‌ను సర్కారు తయారుచేసి, ఆ మేరకు నిర్మాణ ప్రణాళిక రూపొందించుకోవాలి. నేటి ప్రభుత్వాలు అదే చేస్తున్నాయి. తద్వారా ప్రజాధనం వృధా అవుతున్నది. అవసరం ఉన్నా, లేకున్నా డీపీఆర్లల్లో మార్పులు చేస్తూ తమ రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకునే పనిలో ప్రభుత్వాలు ఉంటున్నాయి. ఆ నేపథ్యంలో ప్రజలపై ఆర్థిక భారాలు తప్ప, మరే ఇతర లాభం లేదని సాగునీటిరంగ నిపుణులు సారంపల్లి మల్లారెడ్డి చెప్పారు.

సర్కారు చేయాల్సినవి

రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్‌ను కచ్చితంగా అమలు చేయాలి. సత్వరమే నిర్మాణం చేపట్టాలి. డీపీఆర్ ప్రకారం సమయానుకూలంగా పూర్తిచేయించాలి. ఎలాంటి పరిస్థితుల్లో నూ అగ్రిమెంట్ పొడిగించరాదు. పనిచేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలి. ప్రజాధనం వృధా కాకుండా ప్రాజెక్టులను నిర్మించాలి. కాగా రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులు ఇప్పుడు అసంపూర్ణంగానే ఉండటం అందరికి తెలిసిందే. ప్రాజెక్టులకు కేటాయించిన నిధులు బడ్జెట్‌లో స్పష్టంగా చూపించాలి. పారదర్శకత ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. నిధుల నిర్వహణ విషయంలో పారదర్శకత అవసరం.

ప్రాజెక్టుల జీవిత కాలం 25 ఏండ్లు..

డీపీఆర్‌లలో సాంకేతిక విషయాలను ఎప్పటికప్పుడు మార్చడం వలన సవరణ అంచనాలు భారీగా పెరిగి ఆర్థికభారంతోపాటు నిర్మాణమూ ఆలస్యమవుతుంది. సాంకేతిక అంశాలను పరిశీలించినప్పుడు కాస్ట్-బెనిఫిట్ రేషియో 1:4 లేదా 1:5కు మించరాదు. అంటే ఏదైనా ప్రాజెక్టుపై పెట్టిన పెట్టుబడి కనీసం నాలుగైదు సంవత్సరాల్లో తిరిగి రాబట్టుకోవాల్సి ఉంటుంది. కానీ నేడు నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల్లో రెండు దశాబ్దాలు గడిచినా సర్కారుకు పెట్టిన పెట్టుబడి తిరిగిరావడం లేదు. శ్రీరాంసాగర్, జూరాల, నాగార్జునసాగర్ మినహా మిగిలిన అన్నీ ఎత్తిపోతల(లిఫ్ట్ ఇరిగేషన్)పథకాలే కావడం తెలిసిందే. ఈ ప్రాజెక్టుల జీవితకాలం 25 సంవత్సరాలు మాత్రమే. ఆలోపుగానీ, ఆ తర్వాతగానీ పంపులు, పైపులు మార్చాల్సి ఉంటుంది. రివిట్‌మెంట్, లైనింగ్ పనులకు మరమ్మతులు కచ్చితంగా చేయాల్సిందే. లేకపోతే ఆ పథకం ప్రయోజనాలు పూర్తిస్థాయిలో వినియోగదారులకు చేరవు. కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా ప్రాజెక్టులకు 70 శాతం లైనింగ్ పనులను గత ప్రభుత్వాలు పూర్తిచేయగా, ప్రస్తుత ప్రభుత్వం పంపులు బిగించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎనిమిది లక్షల ఆయకట్టుకుగాను నాలుగు లక్షల ఎకరాలకే కాలువలు ఉన్నాయి. ఆదిలాబాద్ మధ్యతరహా ప్రాజెక్టులకు బ్రాంచ్ కెనాళ్ల ద్వారా పంట కాలువలకు నీటి సరఫరా వ్యవస్థ లేదు. శ్రీరాంసాగర్ రెండో దశ కాలువల లైనింగ్ పనులు పూర్తికాక తుంగలు మొలిచాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నెదర్లాండ్స్ ప్రభుత్వ సహకారంతో నిర్మించిన చిన్న పథకాలైన బెక్కెం లిఫ్ట్, గూడెం, బొడబండ, జతాపూర్, కొడూరు, గోపాలపురం, చలపాడు, చిన్నమర్రూర్ ప్రాజెక్టులకు పట్టినగతే ఈ లిఫ్ట్ పథకాలకూ పడుతుంది.

కార్మిక హక్కులను కాలరాస్తూ
ఉద్యమాలను ఆపలేరు

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య

- పలు జిల్లాల్లో ముగిసిన మేడే వారోత్సవాలు



నవతెలంగాణ-భువనగిరి

కార్మిక హక్కులను కాలరాస్తూ ఉద్యమాలను ఆపలేరని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య ప్రభుత్వాలను హెచ్చరించారు. ఆదివారం 137వ మేడే వారోత్సవాల ముగింపు సందర్భంగా పలు జిల్లాల్లో సభలు నిర్వహించారు. యాద్రాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని ప్రిన్స్‌చౌరస్తా వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దాసరి పాండు అధ్యక్షతన జరిగిన సభలో వీరయ్య పాల్గొని మాట్లాడారు. 137 ఏండ్ల కిందటే కార్మికుల ఎనిమిదిగంటల పని దినాన్ని సాధించడం కోసం, కార్మికులు హక్కుల కోసం పోరాడి ప్రాణాలను సైతం అర్పించారే తప్ప వెనకడుగు వేయలేదన్నారు. ఆ అమరవీరుల స్ఫూర్తితో నేడు కార్మిక ఐక్యఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కులం, మతం పేరుతో కార్మికుల మధ్య భావోద్వేగాలను రెచ్చగొడుతూ కార్మికవర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తూ ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలను ప్రభుత్వాలు పొందుతున్నారని తెలిపారు. కార్మిక వర్గం ఇది గ్రహించిన రోజు ప్రభుత్వాలు కుప్పకూలుతాయని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెట్టడంతో పాటు నిత్యం పెంచుతున్న నిత్యావసర ధరలు పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతున్నారన్నారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్‌కోడ్‌లను కేంద్రం తీసుకువచ్చిందని, ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలుగా చేసిందని విమర్శించారు. దేశం మొత్తం కరోనాతో అతలాకుతలమైతే మోడీ ప్రభుత్వం మాత్రం పారిశ్రామిక వేత్తలకు ఊడిగం చేస్తూ రూ.70 వేలకోట్లు పారిశ్రామికవేత్తలకు రద్దు చేసిందన్నారు. మేడే వారోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన వివిధ క్రీడల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. బహిరంగ సభలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ పాషా, గొరిగే సోములు, తదితరులు పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం అమరవరంలో జరిగిన మేడే కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి హాజరయ్యారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి పలు చోట్ల జెండాను ఎగురవేశారు.

సీఐటీయూ మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా సంఘం కార్యాలయం నుంచి ఈసీఐఎల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.

అనంతరం చౌరస్తాలో సభ నిర్వహించారు. ఈ సభకు సీఐటీయూ మేడ్చల్ జిల్లా కార్యదర్శి జె చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా సీనియర్ నాయకులు కోమటి రవి, పీఎస్ఎన్ మూర్తి, జిల్లా సహాయ కార్యదర్శి జీ శ్రీనివాసులు ప్రసంగించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని అన్నానగర్ అమరవీరుల స్థూపం వద్ద అంబేద్కర్ సంఘం సెంట్రింగ్ యూనియన్ జెండా ఏర్పాటు చేశారు.

అనంతరం మేడే వారోత్సవాల కార్యక్రమాలు నిర్వహించారు. కార్మికులకు. పిల్లలకు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

నేటితో కర్నాటక ప్రచారానికి తెర

- పూర్వ వైభవం కోసం కాంగ్రెస్ ఆరాటం
- అధికారం నిలుపుకునేందుకు బీజేపీ తంటాలు
- మోడీ పైనే కమలనాథుల ఆశలు



బెంగళూరు : కర్నాటకలో ఎన్నికల ప్రచారం చివరి దశకు చేరింది. నేటితో ప్రచారానికి తెర పడుతుంది. మరోవైపు ఓటర్లను ఆకట్టుకునేందుకు తెర వెనుక ప్రయత్నాలు ప్రారంభమవుతున్నాయి. ఈ ఎన్నికలలో ఎలాగైనా గెలిచి పూర్వవైభవం సంపాదించాలని కాంగ్రెస్ విశ్వప్రయత్నం చేస్తుంటే అధికారాన్ని నిలబెట్టుకునేందుకు బీజేపీ తంటాలు పడుతోంది. చివరి నిమిషంలో అందివచ్చే ఏ అవకాశాన్నీ ప్రధాన పార్టీలు వదులుకోవడం లేదు. గతంలో కంటే ఇప్పుడు తన విజయావకాశాలు మెరుగుపడ్డాయని బీజేపీ భావిస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా వంటి నేతల ప్రచారం తమకు ఓట్లను కురిపిస్తుందని ఆ పార్టీ ఆశిస్తోంది. ముఖ్యంగా మోడీ పైనే కమలనాథులు ఆశలు పెట్టుకున్నారు. బెంగళూరులో శనివారం మోడీ 26 కిలోమీటర్ల మేర రోడ్‌షో నిర్వహించారు. ఆదివారం కూడా ఇది కొనసాగింది. 28 అసెంబ్లీ స్థానాలున్న బెంగళూరు నగరంలో మెజారిటీ సీట్లను సొంతం చేసుకునేందుకు బీజేపీ వ్యూహరచన చేస్తోంది. 2018 ఎన్నికలలో బెంగళూరులో ఆ పార్టీ పనితీరు నిరాశాజనకంగానే ఉంది. అందుకే మోడీ ఈ నగరంపై ప్రధానంగా దృష్టి సారించారు. ఆయన నగరంలో మొత్తం 18 సభలలో ప్రసంగించారు.

మరోవైపు కాంగ్రెస్, జేడీ (ఎస్) కూడా ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. కాంగ్రెస్ అగ్రనేతలందరూ రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఆ పార్టీ నేతలు ప్రధాని మోడీపై విమర్శనాస్త్రాలు సంధిస్తూ దుందుడుకుగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కర్నాటకకు చెందిన వాడు కావడంతో రాష్ట్ర రాజకీయాలు ఆయనకు బాగా తెలుసు. అందుకే ఆయన ప్రచార సారధిగా పార్టీని ముందుకు నడిపిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు జరుగుతున్న ఈ ఎన్నికలు ఆయనకు చాలా కీలకం. తన సొంత ప్రాంతమైన కల్యాణ్ కర్నాటక పైన ఆయన ఎక్కువగా దృష్టి కేంద్రీకరిస్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికలలో ఈ ప్రాంతంలోని ఎంపీ స్థానాలన్నింటినీ బీజేపీ గెలుచుకుంది. ఖర్గే కూడా పరాజయం పాలయ్యారు. దీంతో ఈసారి ఎలాగైనా పార్టీని అక్కడ మెజారిటీ స్థానాల్లో గెలిపించాలని ఖర్గే కృతనిశ్చయంతో ఉన్నారు.

ఇక మరో కాంగ్రెస్ నేత, మాజీ సీఎం, ప్రస్తుతం ముఖ్యమంత్రి పదవిని ఆశిస్తున్న సిద్ధరామయ్య తాను పోటీ చేస్తున్న వరుణ స్థానానికే పరిమితమయ్యారు. ఆయనకు పోటీగా బీజేపీ లింగాయత్ నాయకుడు, మంత్రి వి.సోమన్నను బరిలో దింపడంతో పోటీ ఆసక్తిదాయకంగా మారింది.

ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు హోరాహోరీగా తలపడుతుంటే జనతాదళ్ (ఎస్) కూడా తనేమీ తక్కువ కాదన్నట్లు ప్రచారంలో దూసుకుపోతోంది. ఆ పార్టీ తరపున మాజీ ప్రధాని దేవెగౌడ రోజుకు మూడు నాలుగు సభలలో ప్రసంగిస్తున్నారు. ఆయన కుమారుడు, మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం చెమటోడుస్తున్నారు. పాత మైసూరు ప్రాంతానికే పరిమితమైన తన పార్టీని ఇతర ప్రాంతాలకూ విస్తరించేందుకు కృషి చేస్తున్నారు. కుమారస్వామి తదుపరి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆ పార్టీ నాయకులు ఆశాభావంతో ఉన్నారు. ఏదేమైనా వీరందరి భవితవ్యాన్ని 5.21 కోట్ల కర్నాటక ఓటర్లు ఈ నెల 10న ఈవీఎంలలో నిక్షిప్తం చేయబోతున్నారు.

కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే..

(మొదటిపేజీ తరువాయి)

బీసీ జనగణన ఎందుకు చేయటం లేదో చెప్పాలని ప్రశ్నించారు. కాన్షీరామ్ పోరాట మార్గంలో బీఎస్పీ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని చెప్పారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పాగా వేయాలనీ, రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకోవాలని ఆయా శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీల కోసం అంబేద్కర్ రిజర్వేషన్లు తెచ్చినా.. వాటి అభివృద్ధి ఫలాలు ఇంకా ఆయా వర్గాల చెంతకు చేరలేదన్నారు. వారి కోసం మరిన్ని చట్టాలు తేవాలంటూ నాడు న్యాయ శాఖ మంత్రిగా ఉన్న అంబేద్కర్ భావించారనీ, ఆయన సూచనలను అప్పటి ప్రధాని నెహ్రూ లక్ష్య పెట్టలేదని తెలిపారు. జ్యోతిబా పూలే, అంబేద్కర్, నారాయణగురు చూపిన బాటలో పయనిద్దామని పిలుపునిచ్చారు. వారందరూ బడుగు, బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేశానని మాయావతి చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి బీఎస్పీ సంపూర్ణ మద్దతినిచ్చిందని గుర్తు చేశారు. బీఎస్పీ ఎస్సీల కోసమే కాదనీ, సబ్బండ వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తున్నదని తెలిపారు. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లో ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపామన్నారు. రాష్ట్రంలో దళితులకు మూడెకరాల భూమి పంపిణీ చేస్తామని చెప్పి, సీఎం కేసీఆర్ మాట తప్పారని విమర్శించారు. తెలంగాణకు చెందిన జి.కష్ణయ్య అనే ఐఏఎస్ అధికారి హత్యకు కారణమైన నిందితుడిని బీహార్ ప్రభుత్వం విడుదల చేస్తే కేసీఆర్ మౌనంగా ఉండటమేంటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా తెలంగాణ సీఎం అభ్యర్థిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఆమె ప్రకటించారు.

రైతులను ఆదుకోవటంలో సీఎం విఫలం.. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. అకాల వర్షాల వల్ల రాష్ట్రంలో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వారిని ఆదుకోవటంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని చెప్పారు. రాష్ట్రంలో బీసీ, ఎస్టీ, ఎస్సీలు, మైనార్టీలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. బీసీనని చెప్పుకొంటున్న ప్రధాని మోడీ.. ఆయా కులాలకు ఏం చేశారని ప్రశ్నించారు. తెలంగాణలో బహుజన రాజ్యం ఏర్పడిన తర్వాత రైతు సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. సరూర్‌నగర్ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి బీఎస్పీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఒమ్ని హాస్పిటల్ నుంచి సరూర్‌నగర్ మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాజ్య సభ సభ్యులు రాంజీ గౌతమ్, రాష్ట్ర సమన్వయ కర్త మందా ప్రభాకర్,బీఎస్పీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు పరంజ్యోతి, అధికార ప్రతినిధి సాంబశివగౌడ్, జిల్లాల ఇన్‌ఛార్జిలు మాట్లాడారు.

నిరుద్యోగులకు భరోసా కోసమే సభ

- తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్ రావు ఠాక్రే, సీఎల్పీ నేత మల్లు భట్టి

నవతెలంగాణ- అబ్దుల్లాపూర్ మెట్

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో పాటు పేదల భూములు బీఆర్ఎస్ ప్రభుత్వం లాక్కుందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎవరి భూములు వారికి తిరిగి ఇస్తామని తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్ రావు ఠాక్రే, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా ఆదివారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్ పూర్, గుంతపల్లి లస్కర్‌గూడ, అబ్దుల్లాపూర్ గ్రామాల్లో పాదయాత్ర చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను కాంగ్రెస్ పార్టీ తీర్చిందన్నారు. తెలంగాణ వస్తే చదువుకున్న యవతకు ఉపాధి అవకాశాలు వస్తాయని, నిరుద్యోగ సమస్య పోతుందని అనుకున్నా నేటికి నిరుద్యోగ సమస్య పెచ్చుమీరిందన్నారు. ఒక్కగానొక్క నోటిఫికేషన్ వేసి, దాన్ని మళ్ళీ లీకులు చేసి నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. ఇలాంటి మోసాలను యువత పసిగట్టాలన్నారు. మేధావులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఆవేశానికి, అక్రోశానికి గురైతే విస్ఫోటనం కంటే పెద్ద ప్రమాదమని, నిరుద్యోగ సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మతోన్మాద కోరల్లో దేశం

(మొదటిపేజీ తరువాయి)

తూట్లు పొడిచి మనువాద రాజ్యాంగాన్ని అమలు చేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ జిల్లాలో ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి పట్టాలిచ్చి పక్కా గృహాలు నిర్మించివ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్ వాగ్దానాన్ని అమలు చేయాలని, ఖాళీ స్థలంఉన్న ప్రతి పేదవాడికి 5 లక్షల రూపాయలు. మంజూరు చేయాలని కోరారు. అనంతరం మేడే ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన క్రీడలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జె వెంకటేష్, శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొలం రాజేందర్, వెలిశెట్టి రాజన్న, చెన్నూరి రమేష్, కంపేట రాజన్న, దామెర కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





కౌలుకేది పరిహారం

పెరుగుతున్న కౌలు విస్తీర్ణం..

- పంట నష్టం కౌలుదారుడికి.. పరిహారం భూ యజమానికి..
- డిక్లరేషన్ ఇవ్వడానికి సిద్ధపడని పట్టాదారులు
- రైతు బంధు, రుణమాఫీ, పంట నష్టం అన్నీ వాళ్లకే..
- అమలు కాని భూ ఆధీకృత సాగుదారుల చట్టం

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

'నాలుగు ఎకరాల్ని కౌలుకు తీసుకున్న. ఎకరాకు రూ.15 వేల కౌలు. మూడేండ్లకు రూ.1.80లక్షలు.. పంటల సాగు కోసం పెట్టుబడులు పెట్టాం. అల్లం సాగు లాభసాటిగా ఉందని కేసీఆర్ చెప్పిన మాట నమ్మి ఎకరంలో అల్లం సాగు చేసిన. ఎకరం బొప్పాయి, రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేసినం. పంట చేతికొచ్చే దశలో వడగండ్ల వానలొచ్చి పంటంతా పాడై.. పెట్టుబడి అప్పు మిగిలింది. కౌలు పైసలు సగం ముందే కట్టినం. పంట పాడైంది. ఆదుకునే వారేరి. సర్కారిస్తమంటున్న నష్టపరిహారం మాకివ్వరంట. సాయమంటే వ్యవసాయానికి కానీ..! భూ యజమానికి కదుకదయ్యా..!! ఇదీ.. కోహీర్ మండలంలోని బిలాల్పూర్‌కు చెందిన కౌలు రైతు విట్టల్ కన్నీటి రోధన.

4 ఎకరాల మామిడి తోటను కౌలుకు తీసుకున్నం. ఏడాది పాటు తోట సంరక్షణ, పూత, కాత నిలిచేందుకు, సస్యరక్షణ కోసం లక్షలు పోసి మందులు పిచికారి చేసినం. ఎరువులు, నీరు, పోషణకు పెట్టుబడులు పెట్టినం. యజమానికి సగం కౌలు డబ్బులు ముందే కట్టినం. వడగండ్లు, ఈదురు గాలుల వర్షాలతో చెట్ల కాయలన్నీ నేలపాలయ్యాయి. తోటలో చెట్లకు కాయ మిగల్లే. మొక్కజొన్న పొట్టుపొట్టయింది. కౌలు రైతుకు పెట్టుబడి సాయమిస్తలేరు. బ్యాంకులోళ్లు రుణమియ్యరు. పంట పాడైతే పైసలియ్యకపోతే ఎట్ల..? వ్యవసాయం చేయడమే మేం చేసిన నేరమా..? అంటూ మనియార్‌కు చెందిన మహమూద్ అలీ అనే కౌలు రైతు తన గోషను వ్యక్తం చేశారు.

6502 ఎకరాల్లో పంట నష్టం



ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వడగండ్ల వానల వల్ల వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. వ్యవసాయ అధికారులు ఇప్పటికే పంట నష్టాన్ని అంచనా వేశారు. సంగారెడ్డి జిల్లాలో 5682 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, జొన్న, టమాటా, ఉల్లి, మామిడి పంటలు 33 శాతానికిపైగా దెబ్బతిన్నట్టు గుర్తించారు. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండలంలో అత్యధికంగా 1794.16 ఎకరాల్లో వరి, మామిడి, ఉల్లి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని గుర్తించారు. జహీరాబాద్ మండలంలో 374.46 ఎకరాల్లో, కంగ్టి మండలంలో 341.18 ఎకరాల్లో, ఝరాసంఘం మండలంలో 451.11 ఎకరాల్లో, న్యాల్‌కల్ మండలంలో 206.06 ఎకరాల్లో, సదాశివపేట మండలంలో 183.01 ఎకరాల్లో, ఇలా మరో 10 మండలాల్లో 33 శాతానికిపైగా నష్టపోయినట్టు పంటలను గుర్తించి ఎకరాలకు రూ.10 వేల నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోనూ ఏప్రిల్ చివర్లో కురిసిన వానలకు ఏర్పడిన నష్టాన్ని అంచనా వేస్తున్నారు.

డిక్లరేషన్ ఉంటే పరిహారం

కౌలు రైతులు భూ యజమాని నుంచి సాగుకు డిక్లరేషన్ రాయించుకోవాలి. వలానా సర్వే నెంబర్‌లో వలాన పంట వేశారు. అట్టి పంట వర్షాలకు దెబ్బతిన్నందున నష్టపరిహారం ఇవ్వాలి. కౌలు రైతుకు పరిహారం ఇవ్వడం పట్ల తమకు ఎలాంటి అభ్యంతరం లేదని డిక్లరేషన్‌లో ఉండాలి. అట్టి ప్రతిని వ్యవసాయ శాఖకు అందజేయాలి.

జి.నర్సింహారావు,
జిల్లా వ్యవసాయ అధికారి

కౌలు రైతుకందని సాయం

కోహీర్ మండలంలోని మనియార్ గ్రామంలో మహమూద్ అలీ అనే కౌలు రైతు గ్రామంలో మామిడి తోటను కౌలుకు తీసుకున్నారు. రూ.8 లక్షలు ఖర్చు చేశారు. కాయ చేతికొచ్చే సమయంలో వానలొచ్చి పూర్తిగా కాయరాలిపోయింది. పైసా ఆదాయం వచ్చే పరిస్థితిలేదు. రాలిన కాయల్ని చూసి ఆ రైతు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. అదే విధంగా ఉల్లి, వరి, మొక్కజొన్న, జొన్న పంటలకు కూడా తీవ్రంగా నష్టం వాటిల్లింది. మండలంలో 200 ఎకరాల వరకు మామిడి తోటల్లో కాయరాలిపోయి కౌలు రైతులకు నష్టమేర్పడింది. ఎకరాకు లక్ష రూపాయల కౌలు డబ్బులు చెల్లించి ఏడాది పాటు తోటల్ని సాగు చేసిన రైతుకు పైసా ఆదాయం వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మామిడి తోటల్ని కౌలుదారులే సాగు చేస్తున్నారు. వీరంతా నష్టపోయారు. సంగారెడ్డి జిల్లాలో యాసంగి సీజన్‌లో 3.32 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 3.75 లక్షల మంది రైతులుండగా అందులో 1.50 లక్షల మంది కౌలు రైతులున్నట్టు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాల వల్ల జిల్లాలోని 15 మండలాల్లోని 258 గ్రామాల్లో 33 శాతం పంట నష్టం వాటిల్లినట్టు అధికారులు గుర్తించారు. 3093 మంది రైతులకు చెందిన పంటలు దెబ్బతినగా అందులో 2200 ఎకరాల వరకు కౌలు రైతులకు చెందిన పొలాలున్నాయి. జిల్లాలో కురిసిన అకాల వడగండ్ల వానల వల్ల 5682 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నందున ప్రభుత్వం రూ.56.82 కోట్ల పరిహారం ప్రకటించింది. పంటలు సాగు చేసి నష్టపోయిన కౌలు రైతులకు మాత్రం పైసా సాయమందదు.

అమలుకు నోచని భూ ఆధీకృత సాగుదారుల చట్టం

తెలంగాణ వ్యాప్తంగా 61 లక్షల మంది భూ యజమానులున్నారు. భూమిలేని కౌలుదారులు 21.71 లక్షల మంది ఉన్నట్టు రైతు స్వరాజ్య వేదిక తన సర్వేలో గుర్తించింది. వ్యవసాయం చేసే వారిలో పట్టాదారులతో పాటు కౌలుదారులు కూడా సగం మంది వరకు ఉంటున్నారు. భూమికి కౌలు చెల్లించి పంటలు సాగు చేసి నిలదొక్కుకోవడం కౌలుదారులకు కష్టంగా మారింది. ఉమ్మడి రాష్ట్రంలో 2011లో భూ ఆధీకృత సాగుదారుల చట్టం తెచ్చారు. ఈ చట్టం ద్వారా కౌలు రైతులు రుణ అర్హత కార్డులు పొంది బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్నారు. తెలంగాణ వచ్చాక కౌలు రైతుల్ని గుర్తించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిరాకరిస్తుంది. వ్యవసాయం తప్ప మరో ఆధారంలేని చిన్న, సన్నకారు రైతులతో పాటు అస్సలు భూమిలేని వాళ్లు కౌలు పద్ధతిలో వ్యవసాయం చేస్తున్నారు. ఎకరాలకు రూ.10 నుంచి రూ.30 వేల వరకు కౌలు చెల్లిస్తూ కాగితాల ద్వారా కాకుండా నోటి మాట ద్వారానే ఒప్పందం చేసుకుంటున్నారు. సాగు వ్యయం పెరిగిపోవడం, దిగుబడులకు గిట్టుబాటు ధర రాకపోవడంతో కౌలుదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల దిగుబడులు రాకపోయే సరికి సాగు కోసం చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. జాతీయ నేర గణాంక సంస్థ 2021 లెక్కల ప్రకారం.. తెలంగాణలో 2018లో 900 మంది, 2019లో 491 మంది, 2020లో 466 మంది, 2021లో 352 మంది వ్యవసాయం భారంగా మారి రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో అధిక మంది కౌలుదారులే ఉన్నారు. 2018 నుంచి రైతు బంధు పథకం అమలవుతోంది. ఆ సాయం కౌలుదారుడికి ఇవ్వాలని కోరుతున్నారు.

కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారి ఇద్దరి అరెస్ట్



నవతెలంగాణ-రాజేంద్రనగర్

కల్తీ అల్లం పేస్ట్ తయారు చేస్తున్న పరిశ్రమపై ఎస్ఓటీ పోలీసులు దాడులు చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటేదాన్‌లోని శాంతినగర్‌లో ఫిరోజ్, హాజిల్ అనే ఇద్దరు వ్యక్తులు కొన్నేండ్ల నుంచి గుట్టు చప్పుడు కాకుండా కల్తీ ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు. కల్తీ అల్లం పేస్ట్, మాంగో డ్రింక్ తయారు చేస్తున్నారు. ఈ కల్తీ అల్లం పేస్ట్‌లో ప్రమాదకర ఎసిటిక్ యాసిడ్‌ను ఉపయోగిస్తున్నారు. అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం ఆ పరిశ్రమలపై ఎస్ఓటీ దాడులు నిర్వహించగా పెద్ద ఎత్తున కల్తీ అల్లం పేస్ట్ లభ్యమైంది. ఫిరోజ్, హాజిల్ అదుపులోకి తీసుకొని విచారించగా కల్తీ వ్యాపారం చేస్తున్నట్టు ఒప్పుకున్నారు. వీరిద్దరిని అరెస్టు చేసి మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పండ్ల తోటలోకి వెళ్లిన బాలికను కట్టేసి కొట్టారు

గద్వాల జిల్లాలో ఘటన



నవతెలంగాణ -మల్దకల్

బత్తాయి తోటలో పండ్లకోసమని వెళ్లిన బాలిక ప్రవళికపై దొంగతనం మోపిన తోట యజమాని శ్రీలత.. మండుటెండలో గొలుసులతో బాలికను కట్టి నరకయాతన పెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గద్వాల జిల్లా మల్దకల్ మండలం విఠలాపురం గ్రామంలో శనివారం జరిగిన ఈ ఘటన సోషల్ వీడియాలో హల్‌చల్ చేస్తోంది. కాగా, తోట యాజమాని శ్రీలతపై కేసునమోదు చేయాలని ప్రవళిక తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలిక ప్రవళిక బత్తాయి తోటలోకి వెళ్లగా.. ఆమెను చూసిన తోట యజమాని భార్య శ్రీలత.. ఆమెపై దొంగతనం మోపి గొలుసులతో చెట్టుకు కట్టేసింది. దాహంతో మంచినీళ్లు అడిగినా.. కనికరించకుండా గంటల తరబడి మండుటెండలో నరకయాతన పెట్టింది. విషయం తెలుసుకున్న ప్రవళిక తల్లిదండ్రులు తోటకు వెళ్లి యజమాని కాళ్లావేళ్లా పడ్డా విడిచిపెట్టలేదు. పైగా ఎవరికి చెప్పు కుంటారో చెప్పుకోండంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిం చారు. అంతేకాదు, ఏ పోలీస్‌స్టేషన్‌లో అయినా కేసు పెట్టుకోండి.. మమ్మల్ని ఎవ్వరూ ఏమీచేయలేరంటూ బాలిక తల్లిదండ్రులపై విరుచుపడ్డారు. మీ గొర్రెలు ఈ ఊర్లో ఎలా మేపుకుంటారో చూస్తామని, మీ అంతుచూస్తామంటూ బాలిక తల్లిదండ్రులను బెదిరించారు. ఈ సంఘటన సోషల్ మీడియాలో హల్‌చల్ కావడంతో తోట యాజమాని బాలిక తల్లిదండ్రులతో బేరసారాలకు ప్రయత్నాలు చేసినట్టు సమాచారం. కాగా, తోట యజమాని మహేందర్ రెడ్డి భార్యపై బాలిక తల్లిదండ్రులు కేసు నమోదు చేశారు. ఘటనపై పూర్తి దర్యాప్తు జరిపి న్యాయం చేస్తామని ఏఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

వాటినే కాపీ కొట్టి అమలుచేస్తున్న కేంద్ర ప్రభుత్వం : ఆర్థిక, వైద్యఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



నవ తెలంగాణ-కొండపాక

రాష్ట్ర ప్రభుత్వ పథకాలను కేంద్ర ప్రభుత్వం డిల్లీలో మెచ్చుకుంటూ, వాటిని కాపీ కొట్టి దేశవ్యాప్తంగా అమలుచేస్తున్నారని, మరోపక్క గల్లీల్లో తిడుతున్నారని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రైతుబంధు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలను కాపీ కొట్టారని అన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణలో చేపట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ సమీపంలో పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య కళాశాల భవన నిర్మాణానికి పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, సిద్దిపేట జిల్లా జడ్పీ చైర్ పర్సన్ రోజా రాధా కృష్ణశర్మతో కలిసి ఆదివారం మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొర్రెల పంపిణీ పథకంతో ఒకప్పుడు మాంసం దిగుమతి చేసుకున్న రాష్ట్రం నేడు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకుందన్నారు. మూడు శాతం జనాభా ఉన్న రాష్ట్రానికి 38 శాతం అవార్డులు, దక్షిణ భారతదేశంలోనే అత్యధిక కేంద్ర ప్రభుత్వ అవార్డులు అందుకున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని తెలిపారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఘాట్ నిర్మాణానికి నాటి కాంగ్రెస్ పెద్దలు ఢిల్లీలో అనుమతి ఇవ్వలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాదులో పీవీ ఘాట్ నిర్మించడంతో పాటు వెటర్నరీ విశ్వవిద్యాలయానికి పీవీ నరసింహారావు పేరు పెట్టి గౌరవించుకున్నామన్నారు. కాళోజీ పేరిట హెల్త్ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట హార్టికల్చర్ యూనివర్సిటీలను ఏర్పాటు చేసుకున్నట్టు గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో చెరువులు, రిజర్వాయర్లు జలకళను సంతరించుకున్నాయన్నారు. విద్యకు తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు.

అనంతరం మంత్రి తలసాని మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమైందన్నారు. 2014తో పోలిస్తే నేడు తెలంగాణ పల్లెల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో బీజేపీ నేతలు అబద్దాలు మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణలో మాదిరిగా రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ప్రధాని మోడీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో లేదన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో 3,72,000 మంది మత్స్యకారులకు సభ్యత్వం అందించామని, మరో లక్ష మందికి అందించనున్నట్టు వెల్లడించారు. 18 ఏండ్లు నిండిన మత్స్యకారులకు మెంబర్ షిప్, 18 ఏండ్లు నిండిన గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. మంత్రి హరీశ్‌రావు లాంటి నాయకుడు సిద్దిపేటకు దొరకడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, డీసీసీబీ చైర్మెన్ చిట్టి దేవేందర్ రెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ లక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కొండపాక ఎంపీపీ రాగల సుగుణ దుర్గయ్య, దుద్దెడ సర్పంచ్ ఆరేపల్లి మహదేవ్ గౌడ్, ఎంపీటీసీ గురజాడ బాలాజీ, నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మోడీకి జై కొడితేనే ఇంటికి.. లేకుంటే జైలుకే..

కార్పొరేట్లకు రూ.16 లక్షల కోట్ల రాయితీ

- మోడీని వ్యతిరేకిస్తున్న 18 పార్టీలతో కేసీఆర్ కలవాలి : సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- ఇబ్రహీంపట్నంలో 'ఇంటింటికీ సీపీఐ' ముగింపు సభ



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

దేశంలో మోడీకి జై కొడితే ఇంటికి.. వ్యతిరేకిస్తే జైలుకు అన్న రీతిలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాలన సాగిస్తుందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. అవినీతి సామ్రాజ్యానికి మోడీ నాయకుడిగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. 'బీజేపీ హటావో దేశ్ కి బచావో' పేరుతో 'ఇంటింటికీ సీపీఐ' కార్యక్రమం ముగింపు సభ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఆదివారం నిర్వహించారు. ఈ సభకు నారాయణ హాజరై మాట్లాడారు. బీజేపీ నాయకత్వంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై నిప్పులు చెరిగారు. అన్ని వస్తువులపై జీఎస్టీ విధిస్తూ దండుకుంటున్న మోడీ ప్రభుత్వం పెట్రోలు, డీజిల్‌పై ఎందుకు జీఎస్టీ విధించడం లేదని ప్రశ్నించారు. చివరికి శ్మశానాలపై సైతం జీఎస్టీలు విధిస్తున్నారన్నారు. చెప్పులపై సైతం 18 శాతం జీఎస్టీ వసూలు చేస్తున్నారని చెబుతూ తన కాలు చెప్పును చూపుతూ మోడీ ప్రభుత్వంపై మండిపడ్డారు. బడా కార్పొరేట్లకు రూ.16 లక్షల కోట్ల రాయితీలు కల్పించిందన్నారు. ప్రముఖ ప్రొఫెసర్ సాయిబాబాతో పాటు మోడీ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్న వరవరరావు వంటి వాళ్లను సైతం అక్రమ కేసులు పెట్టి జైల్లో బంధిస్తున్నారని ఆరోపించారు.కోర్టులు బెయిల్ మంజూరు చేసినా ప్రభుత్వం అంగీకరించకపోవడం వల్లనే జైల్లోనే మగ్గుతున్నారని తెలిపారు. కానీ మోడీ మంత్రివర్గంలో 24 మంది మంత్రులపై కిడ్నాప్, మహిళలపై దాడులు, అక్రమ దందాలు చేసిన కేసులు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం మోడీకి వ్యతిరేకంగా నిలుస్తున్నారని అందుకు హర్షిస్తున్నామన్నారు. కానీ దేశవ్యాప్తంగా మోడీకి వ్యతిరేకంగా పనిచేస్తున్న 18 పార్టీలతో కేసీఆర్ ఎందుకు కలిసి రావడం లేదన్నారు.

ఒకే వ్యక్తి మోడీని ఎదురుకోవడం సాధ్యం కాదని, దేశవ్యాప్తంగా మోడీని వ్యతిరేకించే పార్టీలతో కలిసి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రవీంద్ర చారి, మాజీ శాసనసభ్యులు కొండిగారి రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు కావలి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ నుంచి తెలంగాణ విద్యార్థుల తరలింపు

- నేడు శంషాబాద్‌కు చేరుకునే అవకాశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మణిపూర్‌లో చదువుకుంటున్న తెలంగాణ విద్యార్థులను సురక్షితంగా హైదరాబాద్‌కు తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఆదివారం రాత్రిగానీ, సోమవారం ఉదయంగానీ ఇంపాల్ నుంచి ప్రత్యేక విమానంలో వారు బయలుదేరనున్నారు. కలకత్తా మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోనున్నారు. ఇప్పటికే ఢిల్లీకి హర్షవర్ధన్ అనే విద్యార్థి చేరుకున్నాడు. అతడు బస చేసేందుకు తెలంగాణ భవన్‌లో అధికారులు ఏర్పాట్లు చేశారు. తెలంగాణ భవన్‌తో పాటు హైదరాబాద్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. విద్యార్థుల తరలింపుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మణిపూర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. మరో వైపు విద్యార్థుల భద్రతపై మణిపూర్ రాష్ట్ర పోలీసులతో డీజీపీ అంజనీకుమార్ ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్నారు.

ఆస్తి పంచివ్వలేదని.. తల్లి మృతదేహాన్ని తీసుకెళ్లని కూతుర్లు

- కామారెడ్డిలో అమానవీయ ఘటన

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

ప్రస్తుతం సమాజంలో రోజురోజుకూ డబ్బుపై పెరుగుతున్న వ్యామోహం.. కుటుంబ బాంధవ్యాలను చిన్నాభిన్నం చేస్తుంది. ఇన్ని రోజులు తల్లిదండ్రుల బాగోగులు చూడని కొడుకులను చూశాం. తాజాగా ఓ ఇద్దరు కూతుర్లు తమకు ఆస్తి పంపకాలు చేపట్టలేదని తల్లి మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు నిరాకరించిన అమానవీయ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి పట్టణంలోని ఆర్‌బీనగర్‌కు చెందిన కిష్టవ్వ(70)కు ముగ్గురు కుమార్తెలు. ఇటీవల ఒక కూతురు మృతిచెందగా.. ఇద్దరు కూతుర్లు పట్టణంలోనే నివసిస్తున్నారు. కిష్టవ్వ పేరు మీద ఇల్లుతో పాటు బ్యాంక్‌లో రూ.1.15 లక్షలున్నట్టు సమాచారం. ఆమె ఆస్తులకు సంబంధించి సమీప బంధువు నామినీగా ఉన్నారు. అయితే ఆ డబ్బులను తమకు ఇవ్వాలని కొన్ని రోజులుగా ఇద్దరు కూతుర్లు వచ్చి అడిగారు. ఈ విషయంలో కొన్ని రోజులుగా గొడవలు చోటుచేసుకోవడంతో కిష్టవ్వ అనారోగ్యానికి గురైంది. గత నెల 21 నుంచి కామారెడ్డి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతిచెందినట్టు వైద్య సిబ్బంది వారి కూతుర్లకు సమాచారం ఇచ్చారు. ఆమె బతికి ఉన్నప్పుడు బ్యాంక్ డబ్బులు అడిగితే ఇవ్వలేదని, తాము ఆమె మృతదేహాన్ని తీసుకెళ్లబోమని కూతుర్లు తెలిపినట్టు వైద్య సిబ్బంది తెలిపారు.దాంతో సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కూతుర్లు ఉండి కూడా అనాథ శవంగా ఆస్పత్రిలో ఆమె మృతదేహం ఉండటం స్థానికులను చలింపింది. కాగా ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.

డార్విన్ జీవ పరిమాణ సిద్ధాంతంపై వెయ్యి సదస్సులు

- జేవీవీ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు, శ్రీనాథ్
- ముగిసిన జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర 4వ వార్షిక సభలు

నవతెలంగాణ-నల్లగొండ

రాష్ట్రవ్యాప్తంగా డార్విన్ జీవపరిణామ సిద్ధాంత ప్రచారంలో భాగంగా 1000 సదస్సులను నిర్వహించనున్నట్టు జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు, శ్రీనాథ్ తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని మనోరమ హోటల్‌లో రెండు రోజుల పాటు జరిగిన జేవీవీ రాష్ట్ర 4వ వార్షిక సభలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవ శాస్త్రానికి వెన్నెముకైన పరిణామ సిద్ధాంతాన్ని పదవ తరగతి పాఠ్యాంశం నుంచి తొలగించినందుకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా అనేక పాఠశాలలు, కళాశాలల్లో రానున్న రెండు, మూడు నెలల్లో 1000 పైగా సదస్సులు నిర్వహించనున్నట్టు తెలిపారు. సమకాలీన శాస్త్ర అంశాలను విద్యార్థులకు నిరంతరం తెలియజేయడం కోసం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1500 పైగా పాఠశాలల్లో సైన్స్‌క్లబ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు.

తామ చేపట్టిన శాస్త్ర ప్రచార కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాల్సిందిగా శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు, మేధావులను కోరారు. విద్యార్థులతో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నేడు పాలకులు అభివృద్ధి పేరుతో శాస్త్ర పరిశోధనల ఆవిష్కర ణలను దుర్వినియోగం చేస్తున్నారని, దాని ఫలితమే మనం ఎదుర్కొంటున్న అనేక పర్యావరణ సమస్యలని తెలిపారు. రాష్ట్రంలోని నల్లమలలో యురేనియం తవ్వకాలు చేపట్టడం వల్ల జీవరాశులు, జలవనరులు ధ్వంసమవడంతో పాటు ప్రజల ప్రాణాలకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని, వాటిని నిలిపివేయాలని తీర్మానించామన్నారు. మహారాష్ట్ర, బీహార్ లాగా మన రాష్ట్రంలోనూ మూఢనమ్మకాల నిరోధక చట్టం తీసుకురావాలని కోరారు. భవిష్యత్‌లో తాము చేపట్టబోయే అనేక కార్యక్రమాలకు ప్రజలు పూర్తి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వెంకట రమణారెడ్డి, రాష్ట్ర నాయకులు వరప్రసాద్, జిల్లా జిల్లా అధ్యక్షులు వద్దిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ప్రధాన కార్యదర్శి అమరయ్య, తదితరులు పాల్గొన్నారు.

'కోణార్క్'లో సాంకేతిక లోపం

- గంటన్నర పాటు ఇబ్బందులు పడిన ప్రయాణికులు



నవతెలంగాణ-బోనకల్

ఖమ్మం జిల్లా బోనకల్ - మోటమర్రి రైల్వే స్టేషన్ల మధ్యలో గోవిందాపురం(ఏ) గ్రామ సమీపంలో ఇంజన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపంతో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ గంటన్నర పాటు నిలిచిపోయింది. దాంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముంబై నుంచి భువనేశ్వర్ బయలుదేరిన కోణార్క్ ఎక్స్‌ప్రెస్ బోనకల్ రైల్వే స్టేషన్ దాటిన కొద్దిసేపటికి ఉదయం 9.20 గంటల సమీపంలో ఇంజన్‌లో సాంకేతిక లోపం ఏర్పడింది. రైల్వే డ్రైవర్లు బోనకల్, మోటమర్రి రైల్వే స్టేషన్‌లకు సమాచారం అందించారు. మాటమర్రి రైల్వేస్టేషన్‌లో ఉన్న మరో ఇంజన్‌ను తీసుకువచ్చి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు తగిలించారు. అనంతరం 10.52 రైలు కదిలింది. ఈ సమయంలో దిగువ లైన్‌పై (విజయవాడ వైపు వెళ్లే) రాకపోకలు గంటన్నరపాటు నిలిచిపోయాయి.

సిటీ సెంట్రల్‌లో చిన్నారికి ప్రమాదం



నవతెలంగాణ - బంజారాహిల్స్

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 1లో ఉన్న సిటీ సెంట్రల్ మాల్‌లో విషాదం చోటుచేసుకుంది. మాల్‌లోని ప్లే జోన్‌లో మూడేండ్ల చిన్నారి చేయి మిషన్‌లో పెట్టడంతో ఆమె మూడు చేతి వేళ్లు తెగిపోయాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌లోని ఇబ్రహీంనగర్‌కు చెందిన దంపతులు ముగ్గురు పిల్లలను తీసుకుని సిటీ సెంట్రల్ మాల్‌కు వచ్చారు. పిల్లలు ప్లే జోన్‌లో ఆడుకుంటుండగా మెహ్విష్ లుబ్నా అనే 3 ఏండ్ల చిన్నారి ఓ యంత్రంలో చేయి పెట్టడంతో విషన్‌లో వెళ్లు ఇరుక్కొని కుడి చేతి మూడు వేళ్లు తెగిపోయాయి. దాంతో పాపను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ బాలిక 3 వేళ్లను వైద్యులు తొలగించినట్టు తెలిసింది. అనంతరం మాల్ నిర్వాహకులపై చిన్నారి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణం నిర్వాహకుల నిర్లక్ష్యమేనని బాలిక తండ్రి ఆరోపించాడు. సరైన సదుపాయాలు అందుబాటులో లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందన్నాడు.

ప్రశాంతంగా ముగిసిన నీట్

- రాష్ట్రం నుంచి 65 వేల మంది హాజరు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) ప్రశాంతంగా ముగిసింది. దేశవ్యాప్తంగా సుమారు 20.5 లక్షల మంది హాజరుకాగా..మన రాష్ట్రం నుంచి 65 వేల మంది పరీక్ష రాశారు. అల్లర్లు జరుగుతున్న నేపథ్యంలో మణిపూర్‌లో ఈ పరీక్షను వాయిదా వేశారు. మన రాష్ట్రంలో గ్రేటర్ హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, రంగారెడ్డి, వరంగల్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి, గద్వాల, జగిత్యాల, జనగాం, కొత్తగూడెం, మహబూబాబాద్, మంచిర్యాల, మేడ్చల్, నల్లగొండ, నిజామాబాద్, సిద్దిపేట, సూర్యాపేట్ ప్రాంతాలలో పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు. అరగంట ముందు వరకూ విద్యార్థులను హాల్‌లోపలికి అనుమతించారు. ఒకటిన్నర తర్వాత వచ్చిన విద్యార్థులను పరీక్షాకేంద్రాల్లోకి అనుమతించలేదు. ఎగ్జామ్ రాసిన విద్యార్థులు ఈసారి ప్రశ్నాపత్రం మధ్యస్తంగా వచ్చిందనీ, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచే ఎక్కువ ప్రశ్నలు వచ్చాయని తెలిపారు. రాష్ట్రం నుంచి 40 నుంచి 45 వేల మంది అర్హత సాధించే అవకాశం ఉండగా..8 వేలకుపైగా ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి.

నది

నది
ఎప్పుడూ మౌనంగా వుండదు
గలగల మంటూ వుంటుంది

పగలు సూర్యుడూ
రాత్రి చుక్కలూ చంద్రుడూ
నది తో ముచ్చట్లు పెడుతూ వుంటాయి

నది
ఎప్పుడూ నిలకడగా వుండదు
నిరంతరం ప్రవహిస్తూ వుంటుంది

పల్లం జారుడు బండలా
తోసుకెళ్తూ వుంటుంది



చల్లగాలి నది వీపుమీద చరుస్తూ
ముందుకు తోస్తుంది

నిద్ర ఎరుగని నది
తీరాలను ఒరుసుకుంటూ
రాళ్ళనీ రప్పల్నీ వంకల్నీ దొంకల్నీ
దాటుకుంటూ
అలసటనెప్పుడో మర్చిపోయింది

తీరికే లేని నది
తనలో తాను కలవరిస్తూ పలవరిస్తూ
ప్రేమించిన సముద్రుణ్ణి చేరేందుకు
పరుగులు తీస్తూవుంది
కాలం తో పోటీగా నది
కదం తొక్కుతూనే వుంది

- వారాల ఆనంద్,
9440501281

బూడిద పూలు.. కవిగుండెల్లో నిప్పుల సాగు..

కవిత్వంలో నిఖార్సైన అగ్గిసెగలు.. "నిజం" ఇవి నిప్పు కొమ్మలకు పూసిన, వాడని బూడిదపూలు... ఈ కవి ఓ అక్షారాల అగ్గికొమ్మల అడవి.. సామాజిక రుగ్మతలు అణచివేతలు, అసమానతలు తనలో రగిలిన రవ్వలు... భావ సంఘర్షణల రాపిడిలో రాజుకున్న నిప్పుకొమ్మల దహనమిది.. లావా ఎగసి శిలాజమైనట్టు ఈ కవి అంతరంగ అగ్నిఘోష ఇలా కవిత్వ శిల్పంగా మన కళ్లముందుంది.

భాషని ఇంత బలంగా వాడొచ్చా అని ఈ కవి కవిత్వం చదివాక అనిపించింది... వివరణంతా కుల, మత, ప్రాంత రాజకీయ విద్వేషాలతో పాటు సామాన్య జనం లోపల విచ్ఛిన్నమైన మానసిక బంధాలను విప్పి చెప్పడమే, కప్పి చెప్పేదే కవిత్వం అయినప్పుడు విప్పి ఎలా చెబుతారని అడక్కండి. శ్రీరామమూర్తి కవిత్వం చదివాక క్లుప్తత, సరళత, సాంద్రత మీకు బోధపడతాయి. ఒకవైపు సామాజిక స్పృహ మరోవైపు తీరని వ్యధ.

అధివాస్తవికత పాళ్లు ఎక్కువ ఉన్నప్పుడే శిల్పం కొత్త పుంతలు తొక్కుతుందన్నది ఒప్పుకోలేని నిజం... కల్పనను, కొన్ని అల్యూజన్స్ నీ సర్రియలిస్ట్ పంథాలో రాయడం "నిజం" కవి చేసిన మొదటి, చివరి ప్రయత్నం...



శ్రీరామమూర్తి నాకు ఫేస్‌బుక్‌లో పరిచయం, fb గోడల మీద రెండు మాటలు రాసేసి వెళ్ళిపోయి మనల్ని అబ్బుర పరుస్తుంటారు. అయితే ఆయన వయసురీత్యా తన కవిత్వ పలక దిద్దుతున్నప్పటికీ నేనింకా పుట్టానో లేదో తెలీదు కానీ, ఆయన కవిత్వాన్ని చదవడం మాత్రం నేను కవిగా పుట్టాకే జరిగింది...

సమాజపు లోటుపాట్లను, అవకతవకలను, వ్యంగ్యంగా, వాస్తవిక కాల్పనిక సమ్మేళనంతో కవిత్వం రాయడం ఈ నిజం కవి గొప్పతనం... కవిత్వ సిద్ధాంతాల గురించి నేను పెద్దగా చర్చించను గానీ ఈ బూడిద చెట్ల పూల దండలు గుచ్చి మన మెడలో వేసి వెళ్ళిపోతారు కవి..

వాటిని ఆస్వాదించాలంటే కచ్చితంగా మనలో నిజాన్ని ఒప్పుకునే నిజాయితీ, తర్కాన్ని విభేదించలేని మెచ్యూరిటీ, స్వయంకృతాపరాధానికి తల్లడిల్లిన మనసు వుండాలి...

కరోనా కల్లోలమే కాదు, పాలకుల వ్యవస్థల క్రూర రాజకీయ ఎత్తుగడలనీ ఆయన మాటల్లో చెబుతారు... ఇలా చెబుతూనే సుతిమెత్తని సీతాకోక నవ్వుల్ని.. పసిపాపల జోల పాటల్ని.... రంగురంగుల హరివిల్లుల అందాల్ని కూడా హాయిగా చెబుతారు..

మనసు మైల పడి/ అంతస్తుల అడుగు జారి / కింద పడతామని వీధులని మేల్కొలిపే చీపురును ద్వేషించడం మనకెంతో హాయి/ బిక్కు బిక్కు రైళ్లు/ రాజుని మోసి జనాన్ని ద్వేషించే/ వ్యాపారిని ప్రేమించి వ్యాక్సిన్ను చెట్టెక్కించే/ విషవాసల ఆకాశం కింద/ అనాధ విత్తుల పైరులై విరగ పండుతారు/ బూడిద చెట్ల పూలు/ శవాలను మోస్తూ జీవచ్ఛవాలను చూసి/ ఒలుకుతున్న కన్నులతో/ ప్రాణాలరచేత పట్టుకొని/ పరుగులు తీస్తున్న నదులు/ కొంగ రంగస్థలం/ లోపల నుండి గడియలు బిగించుకున్న / లోగిళ్ళు బిగిపిడికిళ్లను కలగంటున్నాయి/ దుఃఖ నదిలో పుష్ప పడవ / సకాలంలో కాపాడలేకపోయిన చేతకానితనానికి/ సమాధి కట్టమని / మరణానికి గౌరవాగౌరవాలుండవని/ గంధపు చెక్కలతో కాల్చినా/ అయ్యేది బూడిద అదేనని/ నిండు నిజాల స్మశాన మీటుతున్నాయి/ కట్టె కాలడం లేదు/ మనుషులను మృత దేహాలు మోస్తున్నాయి/ మధ్య మధ్య దయ్యపు బువ్వ పెడుతున్నాయి/ వల్లకాటి వాగ్మూలం/ ఇలా / వీరదాసు/ నది వీడిన నేల/ అప్పుడే ఎక్కడికి

వలస పోవడం కొన్ని ప్రాణాలకు అతి మామూలు విషయం కానీ కోవిడ్ సమయంలో వలస కార్మికుల దీన గాథ ప్రపంచం మొత్తం చూసింది.. ఎవరు తీర్చలేని, ఎక్కడా పూడ్చలేని నరకయాతన.. ఇప్పటికిప్పుడు ఇంటికి పొమ్మంటే అప్పటికప్పుడు ఇల్లు ఖాళీ చేయడం అంటే బతుకు కిటికిలో నుంచి ఎగిరి ఏ చెట్టుకో పుట్టకో వలస వెళ్ళడమే కాదా... అలాంటి వలస కార్మికుల గాథల్ని అద్భుతంగా చిత్రించారు మూర్తి.. విషధాన్ని వివరణాత్మక ధోరణిలో సాగించడం కూడా ఒక కవిత్వ పటుత్వమే...

ఇలా ఎన్నో కవితలు కరోనా కల్లోల అక్షరీకరణే, అయితే కోవిడ్ వైపరీత్యాలను అక్షరం చేయని కవులు తక్కువే కానీ ఇలా పుస్తకం చేసిన చాలా కొంతమందిలో శ్రీరామమూర్తి ఒకరు..

నేను చూపిన ఈ కవిత్వ పాదాలే కాదు బూడిద చెట్ల పూల పుస్తకపు దారిలో చాలా అడుగులు కరోనా కాలంలో జరిగిన సంఘటలకు చలించిపోయి రాసినవే... సంకలనంలో ఎన్ని వాక్యాలను కోట్ చేసినా ఇంకొకటి మిగిలే ఉంటుంది... కిరసనాయిలు పోసి పుల్లగీసినా అంటుకోడం లేదని వేదన చెందడం.. అరచేత్తో పాచిని తొలగించి తాజా దనాన్ని అద్దే మనిషిని రానియ్యట్లేదని వాపోవడం, దారెప్పుడు ఒకే తను మనస్సుల సంచారి కాదని తత్వాన్ని అవలీలగా చెప్పడం అన్ని శ్రీరామమూర్తి కవిత్వ పరిమళాలే...

కుంచించుకుపోతున్న మానవత్వాన్ని, కురచైపోతున్న మనిషితనాన్ని, ఇమేజెస్‌తో, అల్యూజన్స్‌తో, మెటాఫర్లతో ఇంత సుమధుర కవిత్వం అందించడం నిజంగా కొత్త సృష్టే...

ఒకవైపు ప్రోస్ మరోవైపు పోయెట్రీ.. రెండు పడవల మీద కాళ్ళు పెట్టి పయనం సాగించడం కష్టతరమైనా ఆయనకు చాలా ఇష్టతరమైంది...

మబ్బుల్ని మడత పెట్టి / మోసుకుపోతున్న వాణ్ణి ఆపండి / కిరాయికైనా నాలుగు మంచి చినుకులు / కురిపిస్తాడేమో అడుగుదాం / తరుణోపాయం / ఆటలో వైరానికి మాటలు మానేసిన బంధు స్నేహితుడు, / బడి పంతులు పంపగా / నాన్నతో అవసరం కోసం ఇంటికొచ్చినప్పుడు / ఆప్యాయంగా పలకరిస్తే / ముఖం తిప్పుకున్నప్పటి గాయం / నేటికీ తియ్యగా కబుర్లు చెబుతుంది / తిరిగి అక్కడికే / రేణువై ఎగరడం కంటే స్థాణువై ఉండడమే మంచిది / కొమ్మలు విరిచి కట్టిన చెట్టులా, / రెమ్మలు తుంచేసిన పువ్వులా, / కదలిక ప్రాణాంతకం, / చైతన్యం మృత్యు సంతకం / చావు బాకీ

వలస పోవడం కొన్ని ప్రాణాలకు అతి మామూలు విషయం కానీ కోవిడ్ సమయంలో వలస కార్మికుల దీన గాథ ప్రపంచం మొత్తం చూసింది.. ఎవరు తీర్చలేని, ఎక్కడా పూడ్చలేని నరకయాతన.. ఇప్పటికిప్పుడు ఇంటికి పొమ్మంటే అప్పటికప్పుడు ఇల్లు ఖాళీ చేయడం అంటే బతుకు కిటికిలో నుంచి ఎగిరి ఏ చెట్టుకో పుట్టకో వలస వెళ్ళడమే కాదా... అలాంటి వలస కార్మికుల గాథల్ని అద్భుతంగా చిత్రించారు మూర్తి.. విషధాన్ని వివరణాత్మక ధోరణిలో సాగించడం కూడా ఒక కవిత్వ పటుత్వమే... అలాగే ప్రతి కవిత్వ శీర్షిక చాలా కొత్తగ ఎవరు కాపీ కొట్టలేనిదిగా ఊహించడానికి కూడా వీలు లేనిదిగా ఉంటుంటే ఒక కవి పరమార్థాన్ని చెబుతుంది...

రాత్రి ఆసుపత్రి, / వడిసెల / క్రూర రంగస్థలం / మాటలు దూకే బావి / అది తాకని చోటు రోబోటు

ఫుల్ పోయెట్రీ లా.. పూర్తి సిమిలిలతో అల్లుకున్న పద్యాలు ఇవి... ఒక్క పోలికను చూపడమే కష్టమైన ఈ రోజుల్లో ఇన్ని సిమిలారిటీస్‌తో పోయెట్రీ రాయడం చాలా కష్టతరం.. అస్థిత్వ రోదనని, ఆవాంచనీయ సంఘటనల రూపాన్ని ప్రతీకలుగా మలిచి చెప్పడం ఈ కవిత్వం ప్రత్యేకత...

అయితే కవిత్వం మీద అవగాహన, సాధికారత లేకుండా ఇంత కవిత్వాన్ని రాయడం సులువు కాదు... ఇప్పటి యువత పాటించాల్సిన ఎన్నో ధోరణులు ఈ కవిత్వంలో నేను గమనించాను...

పెనుగులాట జీవిత తర్కం అయితే ఆ పెనుగులాటను గుచ్ఛం చేసి బూడిద చెట్ల పూలని మనకు అందించడం... వాటిని చదువుతూ ఎంతో కొంత మనల్ని మనం ఊరట వైపు మళ్లించుకోడం తుదిమెరుగు...


పోరాటాన్ని వీడని ఏ వాక్యమైన కవిత్వమే అవుతుంది అంటాను నేను... అలాంటి పోరాట పటిమ ఉన్న శ్రీరామమూర్తి కవిత్వానికి నా సలాములూ...

- సుభాషిణి తోట, 9502818774

డార్విన్ గెలిచాడు

వాడంతే
అజ్ఞానధారి!

శాస్త్రీయంలో
మూసిన కళ్ళు మూసిన ముక్కు మూసిన చెవులు
ముంచి
అశాస్త్రీయ నోరు తెరుస్తాడు



జన్యుస్థిరత్వం ధిక్కరించి
శ్రమపాత్ర దొంగిలించి
మానవుడి నుండి
కోతైయ్యేందుకు
వెనక్కి నడుస్తుంటే
వాడి ప్రేమల 'దేవుడి సృష్టి'
దేశంమీద పడి ఏడుస్తోంది

జీవపరిణామక్రమం
సూర్యుని చుట్టూ తిరిగొస్తుంటే
చీకటి చుట్టూతిరుగుతున్న మతం!

లేలేత మెదడు కొమ్మల్లో
వెలుగు నింపడానికి
చంపడానికి
మధ్య
ఒక యుద్ధం జరుగుతోంది

కాషాయఫాసిస్టు ప్రణాళిక మనుస్మృతి!
మనమధ్య వేలాడ్తున్న మధ్యయుగమొకటి
మనతో దాగుడుమూతలాడ్తోంది

ఒక ఆటవిక పులిపంజా
మనల్ని గురిచూస్తోంది

మంత్రాలకు
చింతకాయలు రాల్తేకదా!

నేలమీద నిలబడ్డ
డార్విన్ను చూసి
దేవుడు భయపడ్తున్నాడు
నిలబడ్డానికి
కాళ్ళులేక

- వడ్డెబోయిన శ్రీనివాస్

ముక్కుతో పెంకును పగులగొట్టుకుంటూ

యువర్ స్టోరేజ్ ఈజ్ ఫుల్
ఖాళీ చెయ్.. లేకుంటే
ఊడదు.. చిగురు మొలవదు
ఇనర్షియా.. జడత్వమేదో
ఒక మంచుసముద్రమై
లోపల ఘనీభవిస్తూ
ఘనీభవిస్తూ
కొంత అంతర్దనమేదో
జరిగి జరిగి, ఆత్మ కరిగి
కరిగి
దుఃఖంతో, విముక్త
కాంక్షతో
లోపలి నుండి ఒక
ఊదారంగు పావురం
రెక్కల చప్పుడు టపటపా టపటపా
మౌనరాత్రి.. జ్ఞాపకాలు పక్షుల గుంపులవలె
మేల్కొని
పదునైన ముక్కులతో హృదయాన్ని పొడుస్తూ
పొడుస్తూ
జీవితం.. నిజానికి అనుభవంగా మిగుల్తున్న
ఒకేఒక దీర్ఘానుభూతేనా-



అప్పుడప్పుడు అమ్మ కనబడ్తుంది చేతులు
దాచి
తర్వాత నగ్నంగా హత్తుకుని ఒడిలో
రాత్రంతా ఒదిగి
కన్నీటితో కరిగించిన 'ఆమె' కనిపిస్తుంది
మనుషుల్లోనుండి రోడ్లు, నదులు, మొలకెత్తే
ఆకాశాలు పొటమరిస్తూంటాయి
నన్ను నేను ఖాళీ
చేసుకోవాలనుకుంటున్నపుడు
ఏ పుస్తకాన్నని పారేయగలను..
ప్రతిపుటా జ్వలితామృత బిందువే
డై ఎమీ కాదు.. లివ్ ఎన్నీ'
ఖాళీ ఐ ఎప్పటికప్పుడు లోపలి చెత్తను
కాలబెట్టుకుంటూ
స్వయం శుద్ధున్నా తూ విస్తరించగలనా
ఏమీ తోచని అస్థిరత్వంలో నుండి
మొలకెత్తుతూండగా
'పర్చేజ్ న్యూ స్టోరేజ్' అని ఒక సూచన
కొత్త సూర్యుడు.. కొత్త మెలకువ.. కొత్త దృష్టి
కొత్త జీవితం
గుడ్డు లోపల శిశుపక్షి ముక్కుతో పైపెంకును
పగులగొడ్తూ
టక్ టక్ టక్.. కొత్త జన్మ కోసం నిశ్శబ్ద
శబ్దం-

- రామా చంద్రమౌళి,
9390109993



నారుమడి అద్దంలో

కర్షకున్ని,
పంటచేలో దిక్కులు చూపిస్తున్న
సీతకుండలా నిలబెట్టినది నేటి రాజకీయం
చీడపురుగులు ఆకురసాన్ని పీల్చినట్టు
దళారులు రైతురక్తాన్ని జుర్రుకుంటున్నారు
నారుమడి అద్దంలో
చంద్రుని రూపాన్ని చూసి,
చిరునవ్వుతో సాగిపోతూ
చేను మొక్కల మొదళ్ళ మొలిచిన
చుక్కల కండ్లతో
పంటకు కాపు కాస్తడు సేద్యపతి
బురదనే భస్మంలా
అలంకరించుకున్న నిష్కామయోగి
నల్లరేగడి మన్ను మంత్రించి
మల్లెల అన్నం పుట్టిస్తాడు
అప్పు చేసైనా సరే
పంటకన్యకు కనకపు గొలుసులు
మెడలువంగ అలంకరిస్తాడు
కల్తీవిత్తనం కాన్పుకాలేక
సుడులు దిరిగి ఉసురు దీసుకుంటుంటే
కర్షకుని పేగులచెమ్మ ఇంకిపోయి
రోట్టె విరిగిన చప్పుడు వినిపిస్తుంది
అతని చినిగిన చొక్క కిటికిలోంచి
ఎముకల ఊచలు కిలుము పట్టి
పెచ్చులూడుతున్నాయి
రైతుపాద చైతన్యయాత్రల
మేకులు నాటి అడ్డుకుంటున్నరు
నకిలీ మందులతో
సస్యరమ నుదుటి సింధూరం
కారిపోతుంది
పంటలమ్ముడువోక
కృషీవళుని నిండుప్రాణం
పంటకుప్పలపై
దిష్టిదీసిన నిమ్మపండులా చితికిపోయింది
రైతురాజ్యం మాత్రం
పేపర్లలో వెలిగిపోతూనే వుంది

- కోరెంకయాదయ్య
9492363404

ఐదు తరాలు ఆవిష్కరణ

ఈ నెల 14వ తేదీ ఉదయం 10:30గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో షోయబ్ హాల్‌లో గులాబీల మల్లారెడ్డి కథల పుస్తకం 'ఐదు తరాలు' ఆవిష్కరణ సభ నిర్వహించనున్నారు. తెలంగాణ సాహితీ ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమంలో ఏనుగు నరసింహారెడ్డి పుస్తకావిష్కరణ చేయనున్నారు. బొజ్జ బిక్షమయ్య, రాపోలు సుదర్శన్, ప్రమోద్, గుడిపాటి తదితరులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు.

శ్రీమతి గంటా కమలమ్మ స్మారక కథా పురస్కారం 2023

శ్రీమతి గంటా కమలమ్మ స్మారక కథా పురస్కారం 2023కు కథా రచయిత కే.వీ. మేఘనాథ్ రెడ్డి "కలుంకూరి గుట్ట" కథా సంపుటి ఎంపికైందని, పురస్కార వ్యవస్థాపకులు, అరసం చిత్తూరు జిల్లా అధ్యక్షులు గంటా మోహన్ తెలిపారు. ఈ నెల 30న చిత్తూరులో జరిగే కార్యక్రమంలో రచయితకు 10వేల రూపాయల నగదు, జ్ఞాపికతో సత్కారం జరుగుతుంది.

21న గ్రంథాలయ సందర్శన యాత్ర

'ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ సందర్శన యాత్రలో భాగంగా గుంటూరులోని 'అన్నమయ్య గ్రంథాలయ సందర్శన యాత్ర ఈ నెల 21వ తేది న నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 'మన ఆంధ్రప్రదేశ్' కవితా సంకలనాన్ని ప్రఖ్యాత కవి, విమర్శకులు డా॥ పాపినేని శివశంకర్ ఆవిష్కరిస్తారు. డా. ఉప్పలధడియం వెంకటేశ్వర హైకూ సంపుటి 'విత్తనం'ను ప్రముఖ కవి అడిగోపుల వెంకటరత్నం ఆవిష్కరిస్తారు. ఈ యాత్రను సందర్శించడానికి పాల్గొనదలచినవారు 9247475975 నెంబర్ కు సంప్రదించగలరు.

- చలపాక ప్రకాష్, ప్రధాన కార్యదర్శి,
ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం

తిరగరాసిన ప్రసిద్ధ కవితలు


కొన్నిసార్లు ఒక చిన్న కవితకు లేదా దానిలోని చిన్న భాగానికి స్వల్పమైన మార్పులు చేర్పులు చేసి, ఉద్దేశ పూర్వకంగానో, అనాలోచితంగానో తిరిగి రాస్తారు ఇతర కవులు. ఇట్లాంటి సంఘటనలు సాహిత్య చరిత్రలో అరుదుగానే జరుగుతాయి. ప్రసిద్ధ కవి ఎజ్రా పౌండ్ పేరు మీద ఉన్న ఈ చిన్న కవితను చదవండి:

Hast thou 2 loaves of bread/ Sell one + with the dole
Buy straightaway some hyacinths/ To feed thy soul.
The Paris Review, Issue No. 222, (Fall 2017)
(నీ దగ్గర రెండు రొట్టెలు వుంటే/ ఒకదాన్ని అమ్మేసి
నీ ఆత్మ ఆకలిని తీర్చేందుకు/ వెంటనే కొన్ని గులాబీలను కొనుక్కో)

కానీ ఇదే కవిత కొంచెం భిన్నత్వంతో నూట పది సంవత్సరాల ముందే (ఆగస్టు 1907లో) The Century Magazine లో అచ్చైంది. రాసినతని పేరు జేమ్స్ టెరీ వైట్. అందులో ప్రారంభంలో, "నీ అదృష్టం బాగుండక నీ యింట్లో రెండు రొట్టెలు మాత్రమే మిగిలివుంటే..." అని రాసి వుంది. మిగిలిన పంక్తులలో ఎలాంటి మార్పు లేదు. పైగా కింద "హిపోక్రటిస్ వరవడిలో..." అని ఉంది. అంటే టెరీ వైట్ రాసిన ఈ చిన్న కవితకు హిపోక్రటిస్ స్ఫూర్తి అనుకోవాలి. హిపోక్రటిస్ ప్రాచీన కాలపు గ్రీకు వైద్యుడు. గులాబీలను దగ్గర ఉంచుకుంటే మానసిక స్వస్థత చేకూరుతుందని ఆయన అలా రాసి ఉండొచ్చునని భావించే అవకాశముంది ఇక్కడ. కానీ అదే సంవత్సరం చివరలో టెరీ వైట్ ప్రచురించిన "సాది గులాబీ తోటలో" అనే పుస్తకంలో మళ్లీ ఇవే పంక్తులు చోటు చేసుకున్నాయి. ఐతే ఈ సారి హిపోక్రటిస్ ప్రసక్తి లేదు. కాబట్టి, పదమూడవ శతాబ్దపు ఫార్సీ కవి ఐన సాది కవిత దీనికి స్ఫూర్తి కావచ్చు అనుకున్నారు కవిత్వాభిమానులు. ఇతర కవుల పంక్తులను తమ రచనలో చేర్చినప్పుడు కొటేషన్ మార్క్స్ పెట్టడాన్ని మరచిపోవడం కొన్నిసార్లు ఇటువంటి తప్పిదాలకు కారణ మౌతుంది. మరికొన్ని సార్లేమో పూర్తిగా ప్రమాదవశాత్తు (accidentally- యాదృచ్ఛికంగా) జరుగుతుంది ఈ పొరపాటు.

ఈ వాక్యాలనే మళ్లీ ఉటంకిస్తూ, వీటికి ఖురాన్‌తో సంబంధమున్నట్టు అస్పష్టంగా, అనిర్దిష్టంగా సూచించారు. ఇస్లాం ప్రవక్త ముహమ్మద్ లేదా ఎవరైనా అజ్ఞాత పర్షియన్ కవి ఈ పంక్తులకు మూలం అన్నారు. మరికొందరేమో వీటి కర్తృత్వాన్ని ఎల్బర్ట్ హబర్డ్ అనే తాత్వికునికి ఆపాదించారు. క్వేకర్, గ్రీన్ లీఫ్ విటియర్ లను కూడా వదలక ఈ పంక్తులకు వారితో సంబంధమున్నట్టు అభిప్రాయపడ్డారు కొందరు.

ఈ కథ ఇక్కడితో ఆగిపోలేదు. టెరీ వైట్ 1917 లో ఈ పంక్తులకు మళ్లీ స్వల్పమైన మార్పును చేసి, A Garden of Remembrance అనే తన కవితా సంపుటిలో చేర్చాడు. అట్లా ఆయన తన ఈ చిన్న కవితకు హిపోక్రటిస్ లేదా సాది స్ఫూర్తి అని చెప్పకనే చెప్పినట్లైంది. మొత్తానికి ఈ కవితా పంక్తులకు ప్రాచుర్యం కలిగింది. 1911లో అమెరికాలో మేయర్ పదవికి పోటీ చేసిన జెబ్ హెరిమన్ తన ఎన్నికల ఉపన్యాసంలో ఈ పంక్తులను వాడుకున్నాడు. కొందరు ఈ వాక్యాలనే మళ్లీ ఉటంకిస్తూ, వీటికి ఖురాన్‌తో సంబంధమున్నట్టు అస్పష్టంగా, అనిర్దిష్టంగా సూచించారు. ఇస్లాం ప్రవక్త ముహమ్మద్ లేదా ఎవరైనా అజ్ఞాత పర్షియన్ కవి ఈ పంక్తులకు మూలం అన్నారు. మరికొందరేమో వీటి కర్తృత్వాన్ని ఎల్బర్ట్ హబర్డ్ అనే తాత్త్వికునికి ఆపాదించారు. క్వేకర్, గ్రీన్ లీఫ్ విటియర్ లను కూడా వదలక ఈ పంక్తులకు వారితో సంబంధమున్నట్టు అభిప్రాయపడ్డారు కొందరు. ఎజ్రా పౌండ్ ప్రాంభంలో hast ను చేర్చడమే కాక, one ను one+ గా మార్చాడు. టి. ఎస్. ఎలియట్ రాసిన ద వేస్ట్ ల్యాండ్ లో కూడా hyacinth అన్న పదం ఒకటి రెండు చోట్ల వస్తుంది.



మొత్తానికి ఈ చిన్న కవిత వెనుక ఇంత పెద్ద తతంగముంది.

దాదాపు ఇటువంటిదే ఐన ఒక సంఘటన తెలుగు సాహిత్యంలో కూడా సంభవించింది. ఒకే ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్ల కదలిక అనే వాక్యాన్ని కాళోజీ రాశాడని చాలా మంది అనుకుంటారు. కానీ అది వాస్తవం కాదు. నా గొడవ అన్న తన కవితా సంపుటిలోని ఒక కవితలో, "ఒకే ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్ల కదలిక అన్నాడు లార్డ్ బైరన్" అని రాశాడు కాళోజీ. ఐతే, అన్నాడు లార్డ్ బైరన్ అనే మాటలను పట్టించుకోకుండా, కాళోజీయే దీనికి కర్త అని తప్పుగా వ్యాఖ్యానించారు చాలా మంది. నిజానికి, One drop of ink makes a million think అని రాసినవాడు జార్జ్ గోర్డన్ బైరన్ అనే ఆంగ్లేయ కాల్పనిక కవి. ఈయననే లార్డ్ బైరన్ అని కూడా అంటారు. తెలుగు సాహిత్య చరిత్రలో ఇటువంటి వృత్తాంతాలు ఇంకా ఏవైనా ఉన్నాయా?

కొన్నిసార్లు ఇతరుల ప్రసిద్ధ కవితలోని కేవలం ఒక పంక్తి ఒకటి రెండు పదాల మార్పుతో వేరొకరి కవితలో చొరబడవచ్చు. దానికి కారణం ఆ కవితా పంక్తిని రెండవ కవి ఎప్పుడో చదివి దానిచేత బాగా ప్రభావితుడై ఉండటం, తత్ఫలితంగా అది అతని మెదడు అడుగున నిద్రాణంగా పడివుండి చాలా యేళ్ల తర్వాత తన కొత్త కవితలో చొరబడటం జరగవచ్చు. అంటే, inadvertently/unwittingly (తెలియకుండా) అలా జరుగుతుందన్న మాట. కానీ పంక్తులకు పంక్తులు లేదా మొత్తం కవిత మక్కీకి మక్కీగా పునశ్చరణ (రిపీట్) ఐనప్పుడు, దాన్ని ఉద్దేశపూర్వకమైన గ్రంథచౌర్యంగానే భావించాల్సి ఉంటుంది.

- ఎలనాగ



గుండెపోటుతో సీపీఎం సానుభూతిపరురాలు మృతి

నివాళ్లర్పించిన పలువురు నాయకులు

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మండల పరిధిలోని నాయుడుపేట గ్రామానికి చెందిన సీపీఎం పార్టీ సానుభూతిపరురాలు జోగినేని జయమ్మ (65) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ తాళ్లూరి పుల్లారావు, జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజ్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకట్, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, రాష్ట్ర నాయకులు దుర్గా భవాని, సీపీఎం మధిర ఇంచార్జ్ పాలడుగు భాస్కర్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బండి రమేష్, సీపీఎం మండల కార్యదర్శి నంద్ర ప్రసాద్, జర్నలిస్ట్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి రామిశెట్టి విజేత, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్ లు ఆమె మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి భర్త సీపీఎం సీనియర్ నాయకులు జోగినేని సత్యనారాయణ, వారి కుమారులు కిరణ్, కిషోర్ లను ఓదార్చారు. జయమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాలర్పించిన వారిలో సీపీఎం నాయకులు నందిగామ కృష్ణ, పి.మోహన్ రావు, పుల్లయ్య, ఐకేపి ఏపిఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

మే డే స్ఫూర్తితో ఉద్యమించాలి

తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు

నవతెలంగాణ-నేలకొండపల్లి

మే డే స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమించాలని సీపీఐ(ఎ) మాజీ ఎంపీపీ, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు రచ్చ నరసింహారావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని చెన్నారం గ్రామంలో ప్రపంచ కార్మిక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎర్రజెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. దేశంలోని బిజెపి ప్రభుత్వం కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మిక హక్కులను భద్రతను కాలరాస్తుందని మండిపడ్డారు. రైతాంగం పండించిన పంట ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధరలు చెల్లించడంలో పట్టించుకోని పాలకులు విత్తనాలు ఎరువుల ధరలను అడ్డగోలుగా పెంచి రైతులను అప్పుల ఊబిలోకి దించుతున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా కట్టబెడుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తుందన్నారు. ప్రజల మధ్య మతం పేరుతో కులం పేరుతో ఘర్షణలు సష్టిస్తూ ఓట్ల రాజకీయం చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని గద్దె దించేందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పుసులూరి భాస్కరరావు, శాఖ కార్యదర్శి ఎస్కే మస్తాన్, కొవ్వూరు వెంకటేశ్వర్లు, నెల్లూరు నాగేశ్వరరావు, మంకెన బుచ్చయ్య, పగడాల నాగేశ్వరరావు, కుమ్మరి లక్ష్మయ్య, ఆవుల లక్ష్మీనారాయణ, తెలగమల్ల తిరుమలి, కొప్పుల సైదులు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక

నవతెలంగాణ-కల్లూరు

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న చీఫ్ మినిస్టర్స్ కప్పులో భాగంగా 15, 16 తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు సీనియర్ పిఈటీ వీర రాఘవయ్య ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులని ఈ పోటీల్లో పాల్గొనటానికి ప్రాక్టీస్ చేసుకోవాల్సిందిగా కోరారు. 15 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల వయసు మధ్యగల వారు అర్హులు చెప్పారు. వివరాలకు 9440669401 సంప్రదించాలన్నారు.



పడకేసిన పారిశుధ్యం

పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-వేంసూరు

మండలంలో కొన్ని గ్రామాలలో పారిశుధ్యం పడకేసింది. వైఎస్ బంజర్‌లో వాటర్ ట్యాంక్ చుట్టూ చెట్లతో అడవిని తలపించేలా ఉంది. పారిశుధ్యం పనులపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పారిశుధ్య పనులు, నర్సరీల నిర్వహణ, కంపోస్ట్ షెడ్లు అస్తవ్యస్థంగా మారిపోయాయి. సుమారు 150 కుటుంబాలకు తాగునీటిని అందించే వాటర్ ట్యాంకులు శుభ్రం చేయకుండానే నీరు అందిస్తున్నారు. కార్యాలయానికి ఏ అధికారి ఎప్పుడు వస్తారు ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి. ఓ అధికారి అయితే భోజనం టైంకి ఇంటికి వెళ్లడం ఆనవాయితీగా మారింది. జిల్లా అధికారులు మండలంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మండలానికి చెందిన ఓ వ్యక్తి కలెక్టర్‌కు మంత్రి కేటీఆర్ కు ఫిర్యాదు చేశారు.



షెల్లింగ్ పోటీలలో పిల్లి అఖిల్‌కు జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్

నవతెలంగాణ-వైరా

నిరుపేద ఇంట పుట్టిన పిల్లి అఖిల్ నార్త్ ఈస్ట్ షెల్లింగ్ పోటీలలో షిల్లాంగ్‌లో జరిగిన జాతీయ పోటీలలో ప్రథమ బహుమతి, గోల్డ్ మెడల్ సాధించాడు. ఆదివారం స్వగ్రామం వైరా మండలం కొస్టాల గ్రామం వచ్చిన సందర్భంగా తాటిపూడి, కోస్టాల గ్రామ సర్పంచ్ లు భట్టా భద్రయ్య, మంచాల జయరావు ఆధ్వర్యంలో గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. తాటిపూడి నుండి కొస్టాల గ్రామానికి ప్రజలు ర్యాలీలో పూల వర్షం కురిపిస్తూ తీసుకెళ్లారు. పిల్లి శరత్ బాబు ప్రమీల కుమారుడు అఖిల్ జాతీయ స్థాయిలో విజేతగా నిలిచి జపాన్‌లో త్వరలో జరగనున్న పోటీలలో పాల్గొనేందుకు సోమవారం బయలుదేరనున్నాడు. కొస్టాల గ్రామంలో సర్పంచ్ మంచాల జయరావు ఆధ్వర్యంలో జరిగిన సన్మాన సభలో గ్రామస్థులు పూల మాలలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా పిల్లి అఖిల్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టినప్పటికీ పేదరికం తెలియకుండా పెంచిన తల్లి దండ్రుల ప్రోత్సాహంతో కష్టించానని అన్నారు. సర్పంచ్ జయరావు మాట్లాడుతూ కొస్టాల గ్రామం ఎక్కడ ఉంటుందో చాలా మందికి తెలుసో తెలియదు గాని పిల్లి అఖిల్ జాతీయ స్థాయిలో సాధించిన గోల్డ్ మెడల్ తో గొప్ప ఖ్యాతి గడించిన గ్రామంగా వెలుగొందనున్నదన్నారు. అందుకు గర్వపడుతున్నామని అఖిల్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఈపూరి లక్ష్మి, మద్దెల బాబురావు, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసిన మంత్రి

నవతెలంగాణ-ఖమ్మం



వివిధ అనారోగ్య కారణాలతో వైద్య చికిత్సలు చేయించుకుని ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన రూ. 42.69 లక్షల విలువగల చెక్కులను 116 మంది లబ్ధిదారులకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆదివారం వీడియోస్ కాలనీ మంత్రి క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలకు ఆర్థిక చేయూత నందించే వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల అమలు తోపాటు, వివిధ అనారోగ్య కారణాలతో వైద్య చికిత్స చేయించుకుని ఆర్థిక స్తోమత లేని పేద, నిరుపేదలకు రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సాయం చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఇప్పటి వరకు 4839 మంది పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.20.70 కోట్లు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. కష్టాల్లో ఉన్న వారికి రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పెద్ద మనసుతో ఇంత పెద్ద మొత్తంలో నగదును అందిస్తూ వారి కుటుంబాలను ఆదుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభతోనే గుర్తింపు



- కులమేదైనా మంచిని స్వీకరించాలి..మంచి చేయాలి
- ఖమ్మంలో రెడ్డి సంక్షేమ భవన్ కు రూ.కోటి విరాళం
- రెడ్డి సంక్షేమ సంఘం ఆత్మీయ సన్మానంలో ఎంపీ బండి పార్థసారథిరెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

మనం చూపే ప్రతిభతోనే మనకు గుర్తింపు వస్తుందని రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథిరెడ్డి అన్నారు. కులమేదైనా మంచిని స్వీకరించాలి.. నలుగురికి మంచి చేయాలని సూచించారు. ఖమ్మం జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక మొగిలి పాపిరెడ్డి కన్వెన్షన్ హాల్లో ఆదివారం ఆత్మీయ సన్మాన మహోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. మనం ఎదుగుతూ మరో 10 మందికి నీడను ఇవ్వాలని అన్నారు. విద్యా, వైద్యం కోసం తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలుపుతూ... రెడ్డి సంక్షేమ సంఘం విజ్ఞప్తి మేరకు ఖమ్మంలో రెడ్డి సంక్షేమ భవన్ నిర్మాణానికి రూ. కోటి విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. ఏ అంశంలోనైనా మనం చూపించే ప్రతిభాపాఠవాలే మనకు గుర్తింపు తెస్తాయని తెలిపారు. కులమేదైనా మంచిని స్వీకరించాలని.. చెడుకు దూరంగా ఉండాలని హితబోధ చేశారు. భవిష్యత్తులో కులాలు అంతరించక తప్పదు అన్నారు. పిల్లలకు వారసత్వంగా ఆస్తులను కాకుండా వారి కాళ్లపై వారే నిలబడే శక్తి సామర్థ్యాలను ఇవ్వాలని సూచించారు. ప్రపంచ నాల్గో అపర కుబేరుడు వారెన్ బఫెట్ పిల్లలు తమ తండ్రి నుంచి ఆస్తిని కాకుండా ఆశయాన్ని పునికి పుచ్చుకున్నట్లు వివరించారు. తనకు రాజ్యసభ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ సభ్యుల వ్యక్తిగత ఖర్చుల నిమిత్తం ఏటా రూ. 8000 కోట్ల నుంచి రూ.పదివేల కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. ప్రజాధన దుర్వినియోగ దష్ట్యా ఆర్థిక స్తోమత ఉన్న సభ్యులు దీనిని తిరస్కరించ వచ్చున్నారు. శ్రీమంతులైన సభ్యులు సైతం దీనిని స్వీకరిస్తున్న విషయాన్ని ప్రస్తావిస్తూ... పైసా ప్రభుత్వ ఖర్చు ఆశించకుండా ప్రజాసేవ చేసేందుకే తాను రాజ్యసభ సభ్యత్వం స్వీకరించినట్లు తెలిపారు. తనకు బాధ్యత ఇచ్చిన ముఖ్యమంత్రికి గౌరవం దక్కేలా తన నడవడిక ఉంటుందన్నారు. అనంతరం రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు ఎంపీ పార్థసారథి రెడ్డిని భారీ గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మొగిలి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు శీలం వెంకట్ రెడ్డి, ఐలూరి వెంకటేశ్వర్ రెడ్డి, నూకల నరేష్ రెడ్డి, వంగ సాంబశివారెడ్డి, గ్లోబల్ రెడ్డి ఫెడరేషన్ నాయకులు మంజునాథరెడ్డి, మద్ది శ్రీనివాసరెడ్డి, బండి గురునాథరెడ్డి, డాక్టర్ రాఘవరెడ్డి, గాదె మాధవరెడ్డి, రిటైర్డ్ ఆర్డీవో కృష్ణారెడ్డి, కార్పొరేటర్ దండా అయప్పరెడ్డి, వంటికొమ్ము శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎల్‌ఏ ఆఫ్ మ్యాచ్ అయినా బోన్ మ్యారో చేస్తాం

- తలసేమియాపై ప్రజల్లో అవగాహన రావాలి
- ప్రముఖ పిడియాట్రిక్ ఆంకాలజిస్ట్ వైద్యులు మోహన్‌రెడ్డి
- సంకల్ప సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ తలసేమియా దినోత్సం

నవతెలంగాణ-ఖమ్మం



తలసేమియా వ్యాధిని నివారించాలంటే బోన్‌మ్యారో వైద్య చికిత్స ఒక్కటే మార్గమని, హెచ్ఎల్ఏ 10 బై10 మ్యాచ్ అయిన వారికి మాత్రమే ఇప్పటి వరకు ఈ చికిత్స చేశామని, భవిష్యత్‌లో ఆఫ్ మ్యాచ్ అయినా బోన్‌మ్యారో ఆపరేషన్లు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రముఖ పిడియాట్రిక్ (ఆంకాలజిస్ట్) వైద్యులు, బోన్‌మ్యారో శస్త్ర చికిత్స నిపుణులు మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలో వైరా రోడ్డులో గల ఓ హెూటల్‌లో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ తలసేమియా దినోత్సవం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రాజేష్ గార్గె అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పది సంవత్సరాల క్రితం తలసేమియా వ్యాధి గురించి ప్రజలకు పెద్దగా తెలియదని, ఆ వ్యాధిని గుర్తించి ఖమ్మంలో వ్యాధిబారిన పడిన చిన్నారులకు సేవలందిస్తున్న సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థకు అభినందనలన్నారు. తాను వైద్యవిద్యలో పీజీ చదువుకునే సమయంలో నాగ్‌పూర్‌లో తలసేమియా కేసులు ఎక్కువగా చూసానని, ఈ వ్యాధిని నిర్మూలించేందుకు బెంగుళూర్‌కు చెందిన సంకల్ప్ ఇండియా సంస్థతో కలిసి పని చేస్తున్నట్లు తెలిపారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఆరుగురు చిన్నారులకు బోన్‌మ్యారో ఆపరేషన్లు చేశామని, నలుగురు చిన్నారులకు ఈ ఆపరేషన్ విజయవంతం అయిందన్నారు. త్వరలోనే హెచ్ఎల్ఏ ఆఫ్ మ్యాచ్ అయిన వారికి బోన్‌మ్యారో ఆపరేషన్లు చేస్తామన్నారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రాజేష్ గార్గె మాట్లాడుతూ 13 సంవత్సరాల నుండి తలసేమియా చిన్నారులకు తమ సంస్థ అనేక సేవలందిస్తుందన్నారు. సంకల్ప్ ఇండియా సంస్థ ముందుకు రావడంతో బోన్‌మ్యారో ఆపరేషన్లు చేయించి తామ మరో విజయం సాధించామన్నారు. భవిష్యత్‌లో వ్యాధి నిర్మూలన కోసం విస్తృత ప్రచారాలు చేయనున్నట్లు తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులను కాపాడుకుంటూనే వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. చిన్నారులను కాపాడేందుకు తమకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం దాతలను వేదికపై సత్కరించారు. చిన్నారులు నృత్యాలు చేసి అందరిని ఆకట్టుకున్నారు. సంకల్ప్ ఇండియా సంస్థ ద్వారా ఈ కార్యక్రమంలో పలువురు చిన్నారుల కుటుంబాలకు హెచ్ఎల్ఏ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సంకల్ప్ ఇండియా సంస్థ బాధ్యులు డాక్టర్ అబిజిత్, ప్రముఖ వైద్యులు గిరిసింహారావు, డాక్టర్ డి.నారాయణమూర్తి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ గోపి, ఆరోగ్యశ్రీ మేనేజర్ శ్రీనివాస్, పారా ఉదయ్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు పి.చంద్రలీల, ఉపాధ్యక్షురాలు పి.పావని, కోశాధికారి పి.రవిచందర్, పి.ఉదయ్‌భాస్కర్, పి.అనిత, పి.వంశీకిరీటి, పి.ప్రియ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ ఉద్యోగుల సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తాను..

మంత్రి పువ్వాడ

నవతెలంగాణ-ఖమ్మం

ఉపాధి హామీ ఉద్యోగుల సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఆదివారం ఖమ్మంలోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో ఉపాధి హామీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉపాధి హామీ ఉద్యోగుల సమస్యను పరిష్కరించే దిశగా సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అఫ్జల్ హసన్ మాట్లాడుతూ ఉపాధి హామీ ఉద్యోగుల పక్షాన టీఎన్జీవో సంఘం వెన్నంటి ఉంటోందన్నారు. ఇటీవలే ప్రభుత్వం కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల జీవితాలలో వెలుగులు నింపి, వారి ఉద్యోగాలను రెగ్యులైజ్ చేసిందని గుర్తు చేశారు.ఉపాధిహామీ ఉద్యోగుల సమస్యను కూడా ప్రభుత్వం పరిష్కరిస్తాదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి ఆర్.వి.ఎస్ సాగర్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నందగిరి శ్రీను, టీజీవో జిల్లా అధ్యక్షులు ఆళ్ల శ్రీనివాస రెడ్డి, రిటైర్డ్ ఎంపిడిఓల అధ్యక్షులు నవాబు పాషా, ఉపాధి హామీ ఉద్యోగుల జిల్లా జేఏసీ చైర్మన్ కోటయ్య, భద్రాద్రి జిల్లా జేఏసీ అధ్యక్షులు సుధాకర్, రాష్ట్ర జేఏసీ కో చైర్మెన్ జలీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల తరపున పోరాడిది ఎర్రజెండానే

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ప్రజల తరపున నిరంతరం పోరాడేది ఎర్ర జెండా మాత్రమేనని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య ఆదివారం పేర్కొన్నారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని సత్యనారాయణపురం, గట్ల గౌరవరం గ్రామాల్లో మే డే వారోత్సవాలలో భాగంగా నాయకులతో కలిసి సిపిఎం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాల ద్వారా తెచ్చుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలకు అండగా ఎల్లప్పుడు సిపిఎం పార్టీ ఉంటుందని అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హరి పెద్ద కోటేశ్వరరావు, గొర్రాజు రాములు, కూడెల్లి నాగేశ్వరరావు, తాళ్లూరి వెంకటనారాయణ, సుబ్బారెడ్డి, వేముల వెంకటేశ్వరరావు, సత్యం, హరి చిన్న కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కోటూరి మానవతా రాయ్‌పై కేసు నమోదు చేయాలి



నవతెలంగాణ-కల్లూరు

ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యపై ఆరోపణలు చేస్తున్న టీపిసిసి జనరల్ సెక్రెటరీ కోటూరి మానవతారాయ్, వారి బృందంపై కేసు నమోదు చేయాలని టీఆర్ఎస్ నాయకులు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇటీవల కాలంలో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యపై ఉద్దేశ పూర్వకంగా అసత్య ఆరోపణలు చేస్తూ... వారి వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగే విధంగా వ్యవహారిస్తున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. వాటిలో భాగంగా ఎమ్మెల్యే సండ్ర అదృశ్యం అని, కనబడుట లేదని, రైతులు గూర్చి పట్టించుకోవడం లేదని సోషల్ మీడియాలో అసత్య పోస్టులు పెడుతూ... ఎమ్మెల్యేకి, బిఆర్ఎస్ నాయకుల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకులు కోటూరి మానవతరాయ్, దామల రాజు, జాన్ పాషా, కర్నాటి వెంకటరెడ్డి, నాగేశ్వరరావులపై కేసు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. అభివృద్ధి, సంక్షేమ రంగాలలో నియోజకవర్గానికి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రుల సహకారంతో భారీగా నిధులను తెస్తూ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో పరుగులు పెట్టిస్తూ ప్రభుత్వానికి ప్రజలకు అనుసంధాన కర్తగా పనిచేస్తున్న ఎమ్మెల్యే సండ్రని ఐదు రోజులు తాను కుటుంబ సభ్యులతో దైవ దర్శనానికి వెళ్ళితే దానికి కాంగ్రెస్ నాయకులు కట్టు కథలు అల్లుతూ ఎమ్మెల్యే కనిపించడం లేదని, వ్యంగ్యంగా మాట్లాడడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, డిసిసిబి డైరెక్టర్ బోబోలు లక్ష్మణరావు, మండల యూత్ అధ్యక్షులు పెదకంటి రామకృష్ణ, మండల సెక్రెటరీ కొరకొప్పు ప్రసాద్, నాయకులు మాజీ జెడ్పీటీసీ మేకల కృష్ణ, మండల నాయకులు భాణోత్ కృష్ణ, రాచమళ్ళ నాగేశ్వరరావు ఏఎంసి డైరెక్టర్ కట్టా అర్లప్ప, అజ్మీరా జమలయ్య చారుగుండ్ల సందీప్, దార్ల నరసింహారావు, ఖమ్మంపాటి రమేష్, మోర్తాల పిచ్చిరెడ్డి, బొల్లం వేంకటేశ్వర్లు, పాలడుగు శంకర్ రావు, బొల్లం కృష్ణ, బొగ్గుల రామిరెడ్డి, వెంకన్న, శ్రీను, మంచాల కృష్ణ, ఐలూరి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తోటి మత్స్యకారుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-సత్తుపల్లి

అనారోగ్యంతో ఇటీవల మరణించిన ఓ మత్స్యకారుడి కుటుంబానికి తోటి మత్స్యకారులు ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. సత్తుపల్లి మండలం బేతుపల్లి మత్స్య సహకార సంఘంలో సభ్యుడైన గంగారంకు చెందిన కాకా ముత్యాలు అనారోగ్యంతో మరణించారు. ఇంటి పెద్దదిక్కు అకాల మరణానికి గురికావడంతో కుటుంబానికి ఆసరా అందించేందుకు సంఘంలో 100 మంది వరకు ఉన్న గంగారం సభ్యులు తలాకొంత నగదును సేకరించి ఆదివారం ముత్యాలు కుటుంబానికి రూ. 10వేలు అందించారు. ఈ కార్యక్రమంలో మత్స్య సంఘం అధ్యక్షుడు ఊకే కన్నారావు, కాకా రామచంద్రరావు, ఊకే రమేశ్ (కరాటే), మాజీ ఎంపీటీసీ సభ్యుడు వాడే మల్లేశ్, సోయం కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ చలమారావు, కారం వీరాస్వామి, శివకృష్ణ, నాగేశ్వరరావు, పొట్టి, బెటాలియన్ కానిస్టేబుల్ ఈశ్వర్, వెంకట్రావు, మోహనరావు, పొట్ట శ్రీను, కాకా నాగేశ్, రాము, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సత్తుపల్లి గడ్డ...తెలుగుదేశం అడ్డ

- ఉమ్మడి ఖమ్మంలో 10స్థానాల్లో పోటీ చేస్తాం
- సత్తుపల్లి, అశ్వారావుపేటలను గెల్చుకు తీరతాం
- టీడీపీ క్రమశిక్షణ సంఘం జాతీయ అధ్యక్షులు బంటు, నన్నూరి
- సత్తుపల్లిలో 'మినీ మహానాడు' సదస్సు

నవతెలంగాణ-సత్తుపల్లి



తెలుగుదేశానికి సత్తుపల్లి అడ్డా అని, రానున్న ఎన్నికల్లో సత్తుపల్లితో పాటు అశ్వారావుపేట స్థానాలను కైవశం చేసుకొని తెలుగుదేశం జెండాలను రెపరెపలాడించాలని టీడీపీ క్రమశిక్షణ సంఘం జాతీయ సభ్యులు, బంటు వెంకటేశ్వర్లు, జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. ఆదివారం సత్తుపల్లిలోని మాధురి ఫంక్షన్‌హాలులో జరిగిన మినీ మహానాడు సదస్సులో వారు మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 స్థానాల్లో తెలుగుదేశం అభ్యర్థులు పోటీలో ఉంటారని వారు స్పష్టం చేశారు. ముఖ్యంగా సత్తుపల్లి, అశ్వారావుపేట స్థానాలపై ప్రత్యేక దృష్టి మళ్లీ గెల్చుకు తీరతామన్నారు. ఎందుకంటే ఇక్కడి ఈ రెండుస్థానాల్లో టీడీపీ నుంచి గెల్చిన ఇద్దరూ బీఆర్ఎస్‌లోకి ఫిరాయించారన్నారు. వారు వెళ్లిపోయినంత మాత్రాన పార్టీ కేడర్ ఎక్కడికి పోలేదన్నారు. ప్రజల్లో తెలుగు రక్తం ప్రవహిస్తూనే ఉందన్నారు. తెలంగాణలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ప్రజా సంక్షేమాన్ని మర్చిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలన్నీ అలాగే ఉండిపోయాయన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప ఈ 9ఏండ్ల కాలంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. తెలుగుదేశం అంటేనే ఎన్టీ రామారావని, ఈ రెంటిని కేసీఆర్ ప్రభుత్వం వేరుగా బాధాకరమన్నారు. ఇప్పుడెందుకో ఎన్టీఆర్‌పై ప్రేమ పుట్టుకొస్తుందన్నారు. రానున్న రోజుల్లో తెలుగు తమ్ముళ్లు అహెూరాత్రులు కష్టించి రామరాజ్యం తీసుకురావాలన్నారు. ఈ సదస్సు ప్రారంభానికి ముందు పట్టణంలోని వెంగళరావునగర్ నుంచి ప్రదర్శన నిర్వహించారు. ఈ సదస్సులో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం, రాష్ట్ర నాయకుడు కాసాని వీరేశ్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పూల అశోక్, తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షుడు కాపా కృష్ణమూర్తి, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు జయరాం, రాష్ట్ర కల్చరల్ అధ్యక్షుడు చంద్రహాసన్, సత్తుపల్లి నాయకులు బొంతు శ్రీనివాసరావు, పోట్రు రామారావు, ముప్పిడి శ్యామ్ సుధాకర్, రాచర్ల చందు, కోట సత్యనారాయణ పాల్గొన్నారు.

యువ సంఘర్షణ సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఎర్రుపాలెం

హైదరాబాద్ సరూర్ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ యువ తేజం ప్రియాంక గాంధీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న యువ సంఘర్షణ సభని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా వారు ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థి నిరుద్యోగుల భవిత కోసం కాంగ్రెస్ పార్టీ అధినాయకురాలు సోనియా గాంధీ కుమార్తె ప్రియాంక గాంధీ సరూర్ నగర్ లో నేడు నిర్వహించే ఈ సభలో యువత డిక్లరేషన్‌ను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులతో కలిసి విడుదల చేస్తారన్నారు. మండలం నుండి యువత నిరుద్యోగులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్య కర్తలు పెద్ద ఎత్తున ఈ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఛలో హైదరాబాద్ యువ సంఘర్షణ సభను విజయవంతం చేయండి

మధిర : మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురంశెట్టి కిషోర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మధిర మండల పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మధిర పట్టణం, మండలంలోని ప్రతి గ్రామం నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు హైదరాబాద్ లో జరుగుతున్న యువ సంఘర్షణ సభకు నేడు మధ్యాహ్నం మూడు గంటలకు హాజరు కావాలి కోరారు.

పేదలకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-మధిర

మధిర పట్టణంలోని అజాద్ రోడ్డులో ప్రముఖ సామాజిక సేవకులు (మధిర ఆశమిత్ర), ఆరోగ్య పరివేక్షకుడు లంకా కొండయ్య బృందం నడుపుతున్న మహాత్మాగాంధీ ఉచిత పాత బట్టల కేంద్రం నుండి సేకరించిన పాత బట్టలు మండలం లోని దెందుకూరు మేజర్ గ్రామ యువకుడు, సామాజిక సేవా కార్యకర్త దోర్నాల దివాకర్‌కు అందించినారు. ఈ దుస్తులు లేని వారికి నిరుద్యోగులకు కాలేజ్ విద్యార్థులకు పేద మహిళలకు పంచి పెట్టనున్నారని కొండయ్య వివరించారు.

అనుదినం...జనస్వరం
www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
6 ఖమ్మం
సోమవారం 08, మే 2023

సీపీఐ(ఎం) నాయకులను పరామర్శించిన నున్నా నాగేశ్వరరావు



నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని వివిధ హాస్పిటల్స్‌లో అనారోగ్యానికి గురి అయి చికిత్స పొందుతున్న సిపిఎం పార్టీ జిల్లా నాయకులు టి.కృష్ణ, ప్రమాదంలో కాలుకు ఫ్రాక్చర్ అయినా పార్టీ వైరా టౌన్ కార్యదర్శి సుధాకర్‌ను పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, నవీన్ రెడ్డి, కాంపాటి వెంకన్న పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులను కలిసి సంఘటన వివరాలు తెలుసుకున్నారు. వారికి వైద్యం చేస్తున్న డాక్టర్లను కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారు వెంటనే కోలుకోవాలని, ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనాలని వారు ఆకాంక్షించారు.

కడుపుబ్బ నవ్వించిన వంద నవ్వుల విందు



నవతెలంగాణ-ఖమ్మం

నవ్వు నాలుగు విధాల చేటు.. ఇది గతం.. నవ్వు నలభై విధాల గ్రేటు... ఇది వాస్తవం... నవ్వటం ఒక భోగం. నవ్వించడం ఒక యోగం... నవ్వలేకపోవడం ఒక రోగం... అన్న హాస్య రచయిత, దర్శకుడు జంధ్యాల మాటలను సార్ధకం చేస్తూ ఆదివారం స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో వంద నవ్వుల విందు" కార్యక్రమం ఆద్యంతం హాస్యాన్ని పండించింది. ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకొని "స్టార్ మా" లాఫ్టర్ ఫన్ విజేత మొగిలి గుణకర్ నేతృత్వంలో "మొగిలి ఎంటర్టైన్మెంట్స్" ఆధ్వర్యంలో నాన్ స్టాప్ నవ్వుల హంగామా ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించింది. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చిన బుల్లితెర, సినీ రంగాల ప్రముఖ హాస్యనటులు చేసిన హాస్యం ప్రేక్షకులను నువ్వుల జల్లులల్లో ముంచెత్తాయి. జీ తెలుగు "కామెడీ ఖిలాడీలు" ఈటీవీ ప్లస్ గ్యాంగ్ లీడర్ ఫేమ్ డేవిడ్ రాజ్, కుమారి (బండోడు- గుండమ్మ) కామెడీ స్కిట్లు, ఈశ్వర్ బహదూర్, రమేష్ హాస్య వల్లరి, ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ బాబా షరీఫ్ స్టాండ్ ఆఫ్ కామెడీ, నల్లగట్ల కిషోర్, వరుణ్ మిమిక్రీ నవ్వుల వాన కురిపించారు. ప్రత్యేక ఆకర్షణగా ఫైర్ రవి జగ్లింగ్ షో, జూనియర్ బాలయ్య, జూనియర్ రామ్ చరణ్ నిలిచారు. ఈ సందర్భంగా అధ్యక్షులు వేల్పుల విజేత, మిత్ర గ్రూప్ చైర్మన్ కురవెల్ల ప్రవీణ్ మాట్లాడుతూ 23ఏండ్లుగా కమెడియన్‌గా రాణిస్తూ అందర్నీ నవ్విస్తున్న మొగిలి ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. డాక్టర్ నాగబత్తిని రవి మాట్లాడుతూ ప్రముఖ హాస్య నటులు బ్రహ్మానందంచే.. లాఫ్టర్ ఫన్ విజేతలుగా బహుమతి పొందిన మొగిలి గుణకర్ కమెడియన్‌గా, నటుడుగా సినిమాలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్, వేముల రవికుమార్, డాక్టర్ ముక్కపాటి కోటేశ్వరరావు, అన్నాబత్తుల సుబ్రహ్మణ్య కుమార్, ప్రముఖ న్యాయవాది జాబిశెట్టి పాపారావు, బండి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు పశువులు మృతి

జూలూరుపాడు : మండల పరిధిలోని ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పిడుగుపాటుకు ఎద్దులు మృతి చెందాయి. వివరాలు ఇలా మండలంలోని కొత్తూరు గ్రామపంచాయతీ పరిధిలోని పెద్ద హరిజనవాడలో రైతు చెట్ల కింద రెండు ఎద్దులను కట్టివేశారు. ఆదివారం నాడు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో ఎద్దులు కట్టేసిన చెట్టుపై పిడుగు పడటంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. వ్యవసాయానికి రైతులకి అండగా ఉండే దూకిటెద్దులు చనిపోవడంతో రైతు తీవ్ర ఆవేదనకు గురయ్యాడు.

10వ రోజు కొనసాగుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె

నవతెలంగాణ-కామేపల్లి

మండల పరిషత్ కార్యాలయం ముందు జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె నేటితో పదవ రోజుకు చేరింది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సమ్మెను జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కొనసాగించారు. సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ఈ సమ్మె కొనసాగించడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శులు అన్నారు.



ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం మండల నూతన కమిటీ ఎంపిక

- అధ్యక్ష కార్యదర్శులుగా వేపకుంట్ల వెంకటేశ్వర్లు, బొడ్డు సతీష్‌లు
- ఆదివాసీ నాయకపోడుల సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలి
- పసల బుచ్చయ్య

నవతెలంగాణ-కామేపల్లి

ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం సమావేశం ఆదివారం మండల పరిధిలోని పింజరమడుగు గ్రామంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పసల బుచ్చయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో నాయకపోడు ఆదివాసీల బతుకులు ఆగమ్యగోచరంగా ఉన్నాయన్నారు. భారత రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించిన హక్కులు, చట్టాలు పకడ్బందీగా అమలు కావడం లేదని, ఆదివాసీలకు రక్షణగా ఉన్న చట్టాలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని, ఆదివాసీలకు దక్కాల్సిన సంక్షేమ ఫలాలు పక్కదారి పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం 11 ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని చేసిన అసెంబ్లీ తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసి సాంప్రదాయ పండుగలు, జాతరల నిర్వహణకు ఐటీడీఏ ద్వారా నిధులు కేటాయించాలని కోరారు. ఎనుకబడిన గిరిజన ఆదివాసీ నాయకపోడుల గ్రామాలను గుర్తించి ప్రత్యేక నిధులు కేటాయించి మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. అనంతరం కామేపల్లి మండల నూతన కమిటీ అధ్యక్షుడుగా వేపకుంట్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గా బొడ్డు సతీష్‌లతో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ నాయకులు సంగం నాగేశ్వరరావు, దబ్బా రామారావు, భోగి వీరస్వామి, సంగం నాగరాజు, రావుల శ్రీనివాసరావు, జిల్లా నాయకులు రాస శ్రీను, కిన్నెర రామచంద్రయ్య, సంగం వెంకన్న పాల్గొన్నారు.



బీపీ, షుగర్ క్యాంప్ ను మండల ప్రజలు సద్వినియోగించుకోవాలి

నవతెలంగాణ - బోనకల్

బత్తినేని ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న బీపీ, షుగర్ మెగా క్యాంప్ అభినందనీయమైనదని మేఘ శ్రీ హాస్పిటల్స్ ప్రముఖ వైద్యులు టి.పవన్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో మేఘ శ్రీ హాస్పటల్ నందు ఆదివారం అమరజీవి తూము ప్రకాష్ రావు జ్ఞాపకార్థం నిర్వహించిన బీపీ, షుగర్ మెగా క్యాంప్ విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత జీవనశైలిలో బీపీ, షుగర్, గుండె వ్యాధులు సర్వసాధరణమైనాయని, పేషంట్లకు రూ.100 కే నెలకు సరిపడ మందులు అందజేయడం గొప్ప విషయమన్నారు. బీపీ, షుగర్ ఉన్నవారు క్యాంప్ సేవలు సద్వినియోగించు కోవాలని తెలిపారు. ట్రస్ట్ సేవలను అన్ని గ్రామాలకు విస్తరిస్తున్నట్లు ఆయన తెలిపారు. బత్తినేని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల ఆఖరులో జానకిపురం ఉన్నత పాఠశాలలో న్యూరో, ఆర్థో, డెంటల్, గైనిక్, జనరల్ మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నామని, మండల ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. అనంతరం రోగులకు నిర్వాహకులు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు, ట్రస్ట్ సభ్యులు తూము రోషన్ కుమార్, ఆర్ఎంపీడబ్ల్యూఏ టీఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మినేని కొండలరావు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ సీనియర్ నాయకులు జక్కా నాగభూషణం, ఏలూరి పూర్ణచందు, తోటపల్లి ఆనంద్ రావు, క్యాంపు నిర్వాహకులు ఆకెన పవన్, సాధనపల్లి ఆమర్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వంలోనే మధిర నియోజకవర్గ అభివృద్ధి

నవతెలంగాణ-బోనకల్

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం లోనే మధిర నియోజకవర్గం అభివృద్ధి చెందిందని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు అన్నారు. మండల పరిధిలోనే తూటికుంట్ల గ్రామంలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన పల్లె పల్లెకు బిఆర్ఎస్ గడపగడపకు సంక్షేమం కార్యక్రమాన్ని ఆ పార్టీ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి 30 కుటుంబాలు వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరినట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రాకముందు మధిర నియోజకవర్గం, గ్రామాలు ఎలా ఉండేవో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మధిర నియోజకవర్గం ఎంత అభివృద్ధి చెందిందో ఆత్మ పరిశీలనచేసుకోవాలన్నారు. ఇన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి మన చల్లని ఆశీస్సులతో మూడోసారి ముఖ్యమంత్రిని చేసుకొని మధిర నియోజకవర్గంపై గులాబీ జెండాను ఎగరవేయాలని అన్నారు. నూతనంగా పార్టీలో చేరిన వారు గతంలో పార్టీలో ఉన్నవారు కలిసిమెలిసి పనిచేసి పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు మండల కన్వీనర్ వేమూరి ప్రసాద్ రావు రజక సంఘం జిల్లా అధ్యక్షుడు తమ్మారపు బ్రహ్మయ్య ఆ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బంధం శ్రీనివాసరావు, తూటికుంట్ల గ్రామానికి చెందిన పలువురు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫోర్ట్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఏఐఆర్టీడబ్ల్యూఏఎఫ్ జిల్లా కార్యదర్శి జిల్లా ఉపేందర్

ఖమ్మం : ట్రాన్స్‌ఫోర్ట్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐఆర్టీడబ్ల్యూఏఎఫ్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి జిల్లా ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మంలోని సుందరయ్య భవన్లో జిల్లా కమిటీ సమావేశం రాందాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో రవాణా రంగంలో అత్యంత ఎక్కువ కార్మికులు ఉన్నారన్నారు. ట్రాన్స్‌ఫోర్టు ఉన్న కార్మికులు డ్రైవర్లు, హెల్పర్లు, షోరూం వర్కర్లుగా అలాగే రవాణా రంగం బాగా విస్తరిస్తుందని, దానిలో ఉన్న కార్మికులు అందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు అడ్డాలు ఏర్పాటు చేయాలని, జెసిబి, స్కూల్ బస్ డ్రైవర్లు, ట్రాక్టర్ డ్రైవర్లు, ఎయిర్‌బస్ డ్రైవర్స్, లారీ, కారు డ్రైవర్లు మొదలు స్కిల్ డ్రైవర్స్ అందరికీ ప్రభుత్వం విడుదల చేసిన 18500 రూపాయలు నుండి 33500 రూపాయలు జీవోను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రమాదం జరిగితే ఆ సంస్థలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని, వారికి ఆ సమయంలో ప్రమాద ఖర్చులు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో జెసిబి డ్రైవర్ ప్రెసిడెంట్ వెంకట్, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు అమరయ్య, ట్రాక్టర్ యూనియన్ నాయకులు రామ్మూర్తి, ఆటో యూనియన్ జిల్లా కోశాధికారి దండగల ఉపేందర్, నాయకులు అక్బర్ ,కాసిం, నరసయ్య నాగేశ్వరావు, ఖలీల్, శీను పాల్గొన్నారు.



మంత్రి పర్యటనను విజయవంతం చేయండి

ధనియాకుల హనుమంతరావు

నవతెలంగాణ-కామేపల్లి

నేడు కామేపల్లి మండలానికి పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు విచ్చేయుచున్న మంత్రి అజయ్ కుమార్, ఎమ్మెల్యే హరిప్రియ పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ధనియాకుల హనుమంతరావు కోరారు. మండలంలో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు మంత్రి ఎమ్మెల్యే పర్యటనలు పండితాపురం గ్రామం నుండి భారీ మోటార్ సైకిల్ ర్యాలీతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు భారీగా మోటార్ సైకిల్ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నరసింహారావు, కోట మైసమ్మ, ఆలయ కమిటీ చైర్మన్ మల్లంపాటి శ్రీనివాసరావు, వడియాల.క్రిష్టారెడ్డి, తూము.బాబు తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శుల వంటావార్పు

నవతెలంగాణ-ముదిగొండ

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమస్యలను పరిష్కరించాలని గత పది రోజులుగా ముదిగొండ మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న విషయం విధితమే. సమ్మెలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు ఆదివారం వంటావార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శి ఎస్కె యాకూబ్ పాషా, మహమ్మద్ సాహెబ్ ఆలీ కోశాధికారి ఓబినబోయిన రాంబాబు, కార్యదర్శులు ఎం భాగ్యలక్ష్మి,జి రాంబాబు,కె నరేష్,వి నాగమణి, బి హరీష్, సిహెచ్ వీరభద్రం, వి స్వర్ణలత, రామకృష్ణ, కొండ నరేష్, వై మల్లికార్జున్, ఎన్ వెంకటేష్, ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పలు శుభ కార్యాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కందాళ

నవతెలంగాణ-కూసుమంచి

మండలంలోని పాలేరు గ్రామం రెడ్డి ఫంక్షన్ హాల్లో ఆదివారం కాలంగి వెంకన్న కుమారుని వివాహ వేడుకకు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి హాజరై, నూతన వధూవరులు ఉపేందర్–లక్ష్మీ ప్రసన్న లను ఆశీర్వదించారు. మండలంలోని ఈశ్వరమాధారం గ్రామంలో గుంటి రంగయ్య కుమార్తె వివాహ వేడుకకు హాజరైన నూతన దంపతులు లక్ష్మీ త్రివేణి–మహేష్ లను, మండలంలోని మల్లేపల్లి గ్రామంలో బద్దం లక్ష్మారెడ్డి కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులు అనూష–ప్రశాంత్ రెడ్డి లను పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి ఆశీర్వదించారు. మండల కేంద్రంలో తెలంగాణ రైతు ఆగ్రోస్ కేంద్రాన్ని పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చలో హైదరాబాదును జయప్రదం చేయండి

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్

నవతెలంగాణ-ఖమ్మం

ఈ నెల 26, 27, 28వ తేదీల్లో హైదరాబాద్‌లో డీవైఎఫ్ఐ జాతీయ కమిటీ సమావేశాలు జరగబోతు న్నాయని, ఈ సమావేశాలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్ అధ్యక్షతన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ కమిటీ సమావేశాల సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం నేషనల్ సెమినార్‌ను హైదరాబాద్ ఎస్వీకే లో ఈనెల 26వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నేషనల్ సెమినార్‌కు రాష్ట్రం మొత్తం వివిధ జిల్లాల నుంచి వెయ్యి మందికి పైగా హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సెమినార్‌కు డీవైఎఫ్ఐ ఆల్ ఇండియా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఎంఏ రహీం హాజరవుతారని, జాతీయ కమిటీ సమావేశాల్లో దేశవ్యాప్తంగా 500 మంది పాల్గొంటారని ఆయన తెలిపారు. బిజెపి అనుసరిస్తున్న విధానాల పైన చర్చించి, నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం కార్యక్రమాలు రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్, శీలం వీరబాబు, జిల్లా నాయకులు కొంగర నవీన్, కనపర్తి గిరి, కూరపాటి శ్రీను పాల్గొన్నారు.



ఉద్యమ నినాదాలన్నీ కేసీఆర్ ఇంటికే

- నీళ్ళు గజ్వేల్ ఫాంహౌస్‌కి
- నిధులు, నియామకాలు కేటీఆర్, కవిత, సంతోష్ రావులకు..
- 8న సరూర్ నగర్లో యువ సంఘర్షణ సభ
- విజయవంతం చేయండి : నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్



నవతెలంగాణ-ఖమ్మం

కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేసి ఉద్యమ నినాదాలన్ని కేసిఆర్ ఇంటికే పరిమితం అయ్యాయని టీపిసిసి సభ్యులు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ ఆరోపించారు. ఆదివారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగాలు, కొలువులు, నియామకాలు మనకు రాలేదని, మనం ఉద్యమించామని, మన రాష్ట్రం మనకు కావాలని నినదించామని, మా కొలువులు మా రాష్ట్రంలోనే మాకొస్తాయని, మన విద్యార్థి లోకం గొంతెత్తిందని, ఉమ్మడి రాష్ట్రంలో అన్యాయానికి గురవుతున్నామని, గుర్తించిన సోనియమ్మ మన రాష్ట్రం మనకిచ్చిందని గుర్తు చేశారు. సొంత రాష్ట్రం అయితే వచ్చింది కానీ, పాలకులు మాత్రం పరాయివాళ్లయ్యారనీ, సొంత రాష్ట్రంలో తొమ్మిదన్నరేళ్లుగా కొలువులు కోసం నిరుద్యోగులు, విద్యార్థులు, యువత మళ్లీ పోరుబాట బట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలో మన ఉద్యోగాల కోసం.. మన బిడ్డలు మళ్లీ తండ్లాటకు దిగడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. కల్లబొల్లిమాటలు, ఉత్తుత్తి హామీలతో అధికారంలోకి వచ్చిన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు.. నేడు దొరల పాలన చేస్తున్నారని అన్నారు. ఆనాడు రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, తల్లి సోనియమ్మ బిడ్డ ప్రియాంకగాంధీ నేడు మన విద్యార్థులు, నిరుద్యోగుల కోసం మరోసారి జంగ్ సైరన్ మోగించేందకు హైదరాబాద్ నడిబొడ్డుకు వస్తోందని, రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని, కొలువులు వస్తే ఆత్మగౌరవంతో జీవించవచ్చు అని ఆశించి భవిష్యత్ తరాలకు బాటలేసే నిర్ణయాధికారంలో మనమే ఉంటాం అనుకున్నామని అన్నారు. కానీ నోటిఫికేషన్లను.. నిరుద్యోగుల లక్ష్యాలను.. కేసీఆర్ లక్షలకు అమ్ముకుంటుంటే.. తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ బిడ్డ.. ప్రియాంకగాంధీ.. నిరుద్యోగుల పక్షాన ఉద్యమ భేరీ మోగిస్తోందని తెలిపారు. కేసీఆర్ పాలనలో తెలంగాణలో నీళ్లు రావు నిధులు లేవు.. నియామకాలు ఊసే లేదు అన్నట్లుగా ఉందని , నీళ్లు గజ్వేల్ ఫామ్ హౌస్ కు.. నిధులు కేటీఆర్, హరీష్, కవిత, సంతోష్ రావుకు.. నియామకాలు మొత్తం కుటుంబానికి మాత్రమే చెందాయని విమర్శించారు. రండి కదలిరండి.. చేయిచేయి కలిపి.. సరూర్ నగర్ స్టేడియంకు పోటెత్తుదామని కార్యకర్తలకు, నిరుద్యోగులకు, అభిమానులకు, మానవతావాదులకు, ప్రజాస్వామ్య వాదులకు, నగర కార్పొరేటర్లకు పిలుపునిచ్చారు. వరంగల్‌లో రైతులకు రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించగా, సరూర్ నగర్లో ప్రియాంక గాంధీ నిరుద్యోగ డిక్లరేషన్ ను ప్రకటించనున్నారని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు సైదులు నాయక్, వెంకటేశ్వర్లు, భారతి చంద్రం, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో పోరాడుదాం

నవతెలంగాణ-తల్లాడ

తల్లాడ మండలం కేశవాపురం గ్రామంలో అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి సభను సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజాపంథా జిల్లా నాయకులు షేక్ లాల్మియా అల్లూరి చిత్రపటానికి పూలమాలు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తితో భారత దేశ రక్షణకై పోరాడుదామని పిలుపునిచ్చారు. స్వతంత్ర పోరాటంలో రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన అల్లూరు సీతారామరాజు పోరాటపటిమా స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ గ్రామ నాయకులు కుమారి, వెంకటి, అనిల్, సాకేత్ సంగీత, ఏసు, సలోమే, రాదేష్, తదితరులు పాల్గొన్నారు.

కోట మైసమ్మ ఆలయ పున నిర్మాణానికి 5 లక్షల విరాళం

దిరిశాల నరేష్ చౌదరి

నవతెలంగాణ-కామేపల్లి

కోట మైసమ్మ ఆలయ పున నిర్మాణానికి 5 లక్షల రూపాయలు విరాళంగా దిరిశాల.నరేష్ చౌదరి అందచేశారు. కామేపల్లి మండలం మద్దిగూడెం గ్రామానికి చెందిన నరేష్ హైదరాబాద్ ఓ సాఫ్టేర్ కంపెనీ చైర్మన్‌గా పనిచేస్తున్నారు. కొత్త లింగాల కోట మైసమ్మ తల్లి మీద అభిమానంతోనే ఆలయ నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు విరాళంగా అందజేశారు. అభివృద్ధి పనులకు ఉపయోగించాలని ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావును కోరారు. చెక్కును చైర్మన్, కమిటీ సభ్యులకు అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి-సీఐటీయూ



నవ తెలంగాణ-ఖమ్మం రూరల్

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా కార్యదర్శి మూదాం శ్రీనివాసరావు అన్నారు. తమని పర్మనెంట్ చేయాలని కోరుతూ తొమ్మిది రోజులుగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మండలంలోని జలగం నగర్ వద్ద గల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేస్తున్న నిరవధిక సమ్మెను ముదాం శ్రీనివాసరావు సందర్శించి ఆదివారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడారు. గత నాలుగు సంవత్సరాలుగా తక్కువ వేతనంతో వెట్టి చాకిరీ చేయించుకున్న కార్యదర్శులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంచాయితీ కార్యదర్శులకు ఇచ్చిన మాట ప్రకారం పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామాలు అభివృద్ధి చెందడంలో పంచాయతీ కార్యదర్శుల పనితీరు వెలకట్టలేనిది అన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ను సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం లేఖ రాసారని, ప్రత్యక్షంగా కలిసి సమస్య పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని తెలిపారని ముదాం శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పెరుమాళ్ళపల్లి మోహన్ రావు, జిల్లా నాయకులు మేడికొండ నాగేశ్వరరావు, దోనోజు పాపయ్య, లక్ష్మయ్య, గూడ బ్రహ్మం, దేవ్‌జా, ఐతగాని రవి, కన్నెకంటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌లను బేషరతుగా రెగ్యులర్ చేయాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

కూసుమంచి : రాష్ట్రంలో పనిచేస్తున్న జేపీఎస్‌లను చెక్ పవర్‌తో కూడిన రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో పదవ రోజు సమ్మెలో కూర్చున్న జేపిఎస్‌ల సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం ప్రతి గ్రామ పంచాయతీకి ఒక పంచాయతీ కార్యదర్శులు ఉండాలని చట్టం చేసినందు వల్లనే జేపీఎస్ లు ఎంపిక అయ్యారన్నారు. ఆ చట్టంలో పటిష్ఠం గా అమలు చేయడంలో జేపిఎస్ ల పాత్ర కీలకమైంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గుండెపోంగు మల్లేష్, పి.తిరుపయ్య తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగు అధ్యాయానికి అధికారులు ఏపీకి పర్యటన

• కలెక్టర్ అనుదీప్



నవతెలంగాణ పాల్వంచ

మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల సాగు చేపట్టేందుకు పంటలు అధ్యయనం చేసేందుకు జిల్లా వ్యవసాయ అధికారి కోర్స అభిమన్యుడు, జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్నల ఆధ్వర్యంలో వ్యవసాయ, ఉద్యాన అధికారుల బృందం ఈ నెల 8వ తేదీ నుండి 11వ తేదీ వరకు 4 రోజులు ఆంధ్ర ప్రదేశ్‌లోని, అల్లూరి సీతారామరాజు జిల్లాలో అధ్యయన పర్యటనకు వెళ్తున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ తెలిపారు. చింతపల్లి, జీకే వీధి, లంబసింఘి, జి మాడుగుల, పాడేరు, హుకుంపేట, అరకు తదితర ప్రాంతాలలో సాగులో ఉన్న పలు రకాల చిరు ధాన్యములు, ఆపిల్, మిరియాలు, కాఫీ, అనాస, యాలుక, స్ట్రా బెర్రీ, దాల్చిన చెక్క, కర్పూరం, కోల్ క్రాప్స్ తదితర పంట తోటలతో పాటు ప్రాంతీయ పరిశోధన కేంద్రాలను, అభ్యుదయ రైతు క్షేత్రాలను, రైతు భరోసా కేంద్రాలు మొదలైనవి సందర్శించనున్నట్లు ఆయన చెప్పారు. మన జిల్లాలోని ఆయిల్ పామ్ పంటలో అంతర పంటలు సాగు చేపట్టేందుకు, సంప్రదాయ పంటల నుండి డిమాండ్ ఉన్న పంటలు సాగు చేపట్టేందుకు తదితర అంశాలపై సదరు అధికారుల బందం అధ్యయనం చేయనున్నట్లు ఆయన చెప్పారు.

డాక్టర్ గడల శ్రీనివాసరావు మీద మంత్రికి ఫిర్యాదు

నవతెలంగాణ-కొత్తగూడెం

తెలంగాణ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావుపై గిరిజన సంఘం నాయకులు రాష్ట్ర ఆరోగ్యమంత్రికి ఫిర్యాదు చేశారు. ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ నాయక్, గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణలు శనివారం హైదరాబాద్‌లో వైద్య ఆరోగ్య శాక మంత్రి హరీష్ రావుని కలిసి మెమోరాండం అందించారు. తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్య శాఖలో జరుగుతున్న అవినీతి అక్రమాలు రోజు రోజుకు మితిమీరుతున్నాయని, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. హెల్త్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు తన సమీప బంధువులను ఎలాంటి ప్రభుత్వ నోటిఫికేషన్ లేకుండా ప్రభుత్వ కాంట్రాక్టు పద్ధతిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏఎన్ఎం ఉద్యోగ నియామకాలు చేశారని ఆరోపించారు. రాజకీయ ప్రయోజనం కోసం తన ఇష్టానుసారంగా బదిలీ చేయడం, కొత్తగూడెంలో పలు సేవా కార్యక్రమాల పేరుతో ప్రచారం చేసుకోవడం జరుగుతుందని, కొత్తగూడెం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేయాలనే ప్రయత్నంలో భాగంగా అగ్ర కులానికి చెందిన ఓసి సామాజిక వర్గానికి చెందిన డాక్టర్‌ను జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓగా నియమించడం ఇది తన రాజకీయ స్వలాభం కోసమేనని ఫిర్యాదులో తెలిపారు.

వీఓఏల సమ్మె ఉధృతం చేయండి

• సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.వీరన్న పిలుపు

నవతెలంగాణ-కొత్తగూడెం

రాష్ట్ర ప్రభుత్వం విఓఏల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, విఓఏల సమస్యల సాధనకు పోరాటాలు ఉధృతం చేయాలని సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న పిలుపు నిచ్చారు. ఆదివారం నాటికి సమ్మె 21 రోజుకు చేరింది. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ వివోఏలు గత 21 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వం ఏమాత్రం స్పందించడంలేదని మండిపడ్డారు. ప్రభుత్వం కళ్లుతెరిచేలా ఈ సమ్మెను వివోఏలు మరింత ఉధృతం చేయాలని పిలుపు నిచ్చారు. గ్రామాలలో హరితహారం పేరు మీద పెట్టిన మొక్కలను కాపాడుతున్నావీరు గ్రామాల్లో 20 రకాల పనులను నిర్వహిస్తూ ప్రభుత్వానికి ఎంతో చేతనందిస్తున్నారని చెప్పారు. ఈ ప్రభుత్వం గుడ్డిగా వ్యవహరించడం సరైనది కాదని, సమ్మె ఉధృతంతోనే సమస్యలు పరిష్కారం కానున్నట్లు, వెంటనే సమ్మె ఉధృతిచేయనున్నట్లు హెచ్చరించారు. వారి న్యాయమైన సమస్యలైన కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సెర్ప్ నుంచి ఐడి కార్డులు ఉద్యోగ భద్రత, రూ.10 లక్షల సాధారణ ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విఓఏల సంఘం నాయకులు రేష్మ, మాధవి, స్వరూప, సత్యవతి, అరుణ, రాజమణి, పద్మ జహీదా తదితరులు పాల్గొన్నారు.

నిరసన సభను జయప్రదం చేయండి

సుజాతనగర్ : ఈ నెల 8వ తారీఖున హైదరాబాదులోని సరూర్నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న నిరుద్యోగ నిరసన సభను జయప్రదం చేయాలని టీపీసీసీ సభ్యులు నాగ సీత రాములు పిలుపునిచ్చారు. ఈ సభకు ముఖ్య అతిథిగా ప్రియాంక గాంధీ హాజరవుతున్నారని యువకులు, కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సుజాతనగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింతలపూడి రాజశేఖర్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మడిపల్లి శ్రీనివాసులు, జిల్లా కాంగ్రెస్ మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ.కరీం పాషా, ఓబీఎస్ జిల్లా సెక్రటరీ బాలు, భద్దర్ రావు, యువజన కాంగ్రెస్ నాయకుల పాల్గొన్నారు.

క్రీడాకారులకు జెర్సీలు, బ్యాట్లు అందజేత

దుమ్ముగూడెం : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కె.వి.ఫౌండేషన్ (కొర్సావెంకటేశ్వరావు 'సివిల్ ఇంజినీర్') ద్వారా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ సందర్భంగా తన స్వగ్రామమైన కొత్త పల్లి గ్రామ క్రికెట్ టీం క్రీడాకారులకు క్రికెట్ జెర్సీలు బ్యాట్‌లతో పాటు మ్యాచ్ ఎంపైర్‌లకు డ్రెస్‌లు అందజేశారు. వీటిని ఆదివాసీ నాయకులు ముర్రం వీరభద్రం చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ కన్వీనర్ రేసు ఆదినారాయణ మూర్తి, వైస్ ప్రెసిడెంట్ కొర్సా రామచంద్రయ్య, గ్రామ పెద్దలు రేసు లక్ష్మయ్య జానకయ్య రాంబాబు, ముర్రంవీరభద్రం, కల్లూరి జయబాబు (ఏటిఏ), క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



జూలూరుపాడు : మండలం కేంద్రంలోని క్రీడా మైదానంలో జేఎస్టీయుహెచ్ జేఏసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి రెండు జిల్లాల మెగా క్రికెట్ టోర్నమెంట్ అంగరంగ వైభవంగా జరిగింది. ఫైనల్ మ్యాచ్‌కి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఇన్ కమ్ టాక్స్ కమిషనర్ లావుడియా జీవన్ లాల్, భారత రాష్ట్ర సమితి జిల్లా అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు విచ్చేసి మెగా క్రికెట్ టోర్నీలో గెలుపొందిన విజేతలకు అభినందనలు తెలిపి బహుమతులు అందజేశారు. క్రికెట్ టోర్నీలో మొదటి బహుమతి విజేతగా మణుగూరు క్రికెట్ జట్టు నిలిచింది. వీరికి రూ.75,000 నగదు బహుమతితో పాటు ఆకర్షణీయమైన మెమోంటో రెండో బహుమతి విజేతగా నిలిచిన జూలూరుపాడు క్రికెట్ జట్టుకు రూ.50,000 నగదు బహుమతితో పాటు మెమోంటో అలాగే ఈ మెగా క్రికెట్ టోర్నీలో పాల్గొన్న ప్రతీ టీమ్‌కు పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌తో పాటు ఆకర్షణీయమైన బహుమతులు అందజేశారు. గెలుపొందిన విజేతలకు వారి చేతుల మీదుగా నగదు బహుమతితో పాటు ఆకర్షణీయమైన మెమోంటోలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటమి గెలుపుకు నాంది అనీ, జీవితంలో గెలుపు ఓటమిలను సమానంగా స్వీకరించాలనీ, ఈ మెగా క్రికెట్ టోర్నీకి ముఖ్య అతిథులుగా పాల్గొని బహుమతులు అందజేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఎస్టీయుహెచ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మంద రంజిత్ కుమార్, రాష్ట్ర జేఏసీ చీఫ్ అడ్వైజర్ పోతపెంజర రమేష్, జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బల్లర్ సందీప్, మండల ప్రజా ప్రతినిధులు రెండు జిల్లాల క్రికెట్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పలు శుభకార్యాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మెచ్చా

అశ్వారావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన శుభకార్యాల్లో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గుంటిమడుగులో ఆసీ నాగమణి- రామకృష్ణ (లేట్) దంపతుల కుమారుడు ప్రదీప్ వివాహ వేడుకలో పాల్గొనీ నవ దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. (గుంటిమడుగు గ్రామానికీ కోట్ల రూపాయలతో బీటీ రోడ్డు మంజూరు చేయడంతో మెచ్చాకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు. నందిపాడులో టీచర్ కారం వీరాస్వామి-నాగావతి దంపతుల కుమారుడు మహేష్ కుమార్ (రాము) వివాహ వేడుకలో పాల్గొని నవదంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కొయరంగాపురంలో శ్రీశ్రీశ్రీ సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామస్థులతో కలిసి నృత్యం చేశారు. ఉట్లపల్లిలో ముత్యాలమ్మ తల్లి అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలోని గిరిజన భవన్ నందు జరిగిన కొలిపాక సుబ్బారావు(లేట్)-సావిత్రి దంపతుల కుమారుడు అరుణ్ గోపి వివాహ వేడుకలో పాల్గొని నవదంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట అనుచరులు, అభిమానులు, కార్యకర్తలు, ముఖ్యనేతలు పాల్గొన్నారు.

వీవోఏల పోరాటానికి యూటీఎఫ్ సంఘీభావం

నవతెలంగాణ-మణుగూరు



ఐకేపీ వీఓవోఎల హక్కుల పోరాటానికి టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బానోతు రాము సంఘీభావం తెలిపారు. ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు చేస్తున్న శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. వారి న్యాయమైన కోర్కెల సాధనకు మథతు తెలియచేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బానోతు రాము, మండల అధ్యక్షులు షేక్ మీరా హుస్సేన్ మాట్లాడుతూ... విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్స్ న్యాయమైన డిమాండ్స్‌ను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కనీస వేతనం, సెర్ప్ ఉద్యోగుల వలె గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా వీఓఏలు తమకు మద్దతు తెలిపిన యూటీఎఫ్ సంఘానికి కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కుమారస్వామి, రత్న ప్రసాద్, డీఓఏల మండల అధ్యక్ష కార్యదర్శులు కనితి సులోచన, శ్రీను, గోపాల్, రామ నర్సయ్య, షేక్ జరీనా, బేగం లలిత, పద్మ, వెంకటలక్ష్మి, సీత, అరుణ, హ్యాండ్ రైటింగ్ హుస్సేన్ పాల్గొన్నారు.

మతం పేరుతో కార్మికుల మధ్య చిచ్చులు

మోడీ పాలనలో బతుకులు దారుణం

• రూ.8లక్షల కోట్ల విశాఖ స్టీల్ ప్లాంట్ రూ.32 వేల కోట్లకు కట్టబెట్టే ప్రయత్నం
• మేడే స్ఫూర్తితో యువ కార్మికులు హక్కులు కాపాడుకోవాలి
• సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు





నవతెలంగాణ-ఇల్లందు

కేంద్రంలోని బీజేపీ పాలనలో కార్మికుల బతుకులు దారుణంగా ఉన్నాయని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు విమర్శించారు. మతం పేరుతో కార్మికుల మధ్య చిచ్చులు పెడుతున్నారని అన్నారు. హిందూ, ముస్లీం, క్రిస్టియన్ అంటూ నూరిపోసి విభేదాలు సృష్టించి పబ్బం గడుపుకునే పరిస్థితులు మోడిప్రభుత్వం తెస్తోందని కార్మికులంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్మికులకు ఉపయోగపడే చట్టాలను రద్దు చేసి ఇంటికి పంపే చట్టాలను ప్రవేశపెడుతోందని అన్నారు. రానున్న కాలంలో పరిస్థితులు దారుణంగా ఉండబోతున్నాయని అన్నారు. స్థానిక జెకె ఓసి మైన్‌పై ఆదివారం ఫిట్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సందపదను సృష్టించేది కార్మికులు, ప్రజలు. కానీ మోడీ ఎర్రకోట సాక్షిగా సంపద సృష్టికర్తలు పెట్టుబడిదారులని అన్నారని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం 44 చట్టాలను సమూలంగా మార్చివేసిందన్నారు. బొగ్గుగనుల్లో 12గంటలు పని చేయాలని చట్ట సవరణ చేసిందన్నారు. కార్మికులు సమ్మెలు చేయాల్సి వస్తే 14 రోజుల ముందు యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చి చేసేవారని దీనిని 60 రోజులకు పొడిగించారని అన్నారు. పరిశ్రమలో ఏడుగురు కార్మికులుంటే సంఘం పెట్టుకునే అవకాశం ఉందని దీనిని సైతం 300 కార్మికులు ఉండాలని మెలికలు పెడుతోందన్నారు. ఈ రోజుల్లో ఒక్కొక్క వస్తువు ఒక పరిశ్రమలో తయారౌతున్నాయన్నారు. ఈ విధంగా దేశంలో 5లక్షల చిన్న పరిశ్రమలున్నాయన్నారు. కూలి పనుల్లాగా హైర్‌అండ్ ఫైర్ పని చేయించుకుని ఇంటికి పంపే ఏర్పాటు చేస్తోందన్నారు.

ఫిక్స్‌డ్ టైం ఎంప్లాయిమెంట్ పేరుతో ఇక ఇంటికే

దేశంలో పరిశ్రమలు పెట్టాలని ప్రధాని మోడీ అమెరికాను కోరగా మీ దేశంలో కార్మిక చట్టాలు బాగా పనిచేస్తున్నాయని పరిశ్రమలు స్థాపించలేమని చెప్పారని అన్నారు. దీంతో అనుకూలమైన కార్మిక చట్టాలు తెస్తామని మోడీ హామి ఇచ్చారని అన్నారు. దీని మూలంగానే పరిశ్రమలు, బొగ్గుగనుల్లో ఇక నుండి ఫిక్స్‌డ్ టైం ఎంప్లాయిమెంట్ పేరుతో పనిచేయించుకుని ఇంటికి పంపే ఏర్పాటు చేస్తోందని అన్నారు. పని చేసే స్థలాల్లో పర్మినెంట్ కార్మికులతో సమానంగా అప్రంటిస్ కార్మికులు ఉచితంగా పనిచేసే విధాలు అమలు చేయాలని బిజెపి ప్రభుత్వం చట్టంలో అనేక మార్పులు చేస్తోందన్నారు.

రూ.8లక్షల కోట్ల విశాఖ స్టీల్ ప్లాంట్ రూ.32 వేల కోట్లకు కట్టబెట్టే ప్రయత్నం

దశాబ్దాల నుండి వేలాది మంది కార్మికులతో లాభాలబాటలో నడుస్తోన్న విశాఖ ఉక్కు స్టీల్ ఫ్యాక్టరీని ప్రధాని మోడీ ప్రభుత్వం కారు చౌకగా అమ్మేస్తోందన్నారు. రూ.8లక్షల కోట్ల విశాఖ స్టీల్ ప్లాంట్ రూ.32 వేల కోట్లకు కట్టబెట్టే ఏర్పాట్లు జరిగాయన్నారు. నీటి అయోగ్ మినిస్ట్రీ ప్రకారం ఒకరికి రెండు పరిశ్రమలు ఇవ్వాలని కాని దీనికి విర్దుంగా ఆదానికి 6 ఎయిర్ పోర్టులు ఇచ్చారని అన్నారు. ఆదాని ఆస్తులు 50వేల కోట్లు ఉండగా ప్రధాని మోడీ హయాంలో నేడు రూ.18లక్షల కోట్లు అయ్యాయన్నారు. ఆదాని కంపినీల డొల్లతనం అమెరికాకు చెందిన బర్గ్ బట్టబయలు చేశారని దీంతో రూ.10లక్షల కోట్ల సంపద ఆవిరయ్యాయన్నారు. షేర్ మార్కెట్ కుప్పకూలిందన్నారు. దేశ సందపద ప్రయివేటుకు ప్రజలకు భారాలు మిగిలాయన్నారు.

బొగ్గుగనుల నిర్వీర్యానికి కేంద్రం,రాష్ట్రం ఎత్తులు : పూసపల్లి ఓసి సింగరేణి చేపట్టాలి

బొగ్గుగనుల నిర్వీర్యానికి కేంద్రం ఎత్తులు వేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం అదే దారిలో వెల్లడం సరికాదన్నారు. మార్చి 2015లో మోడి ప్రభుత్వం బొగ్గుగనులు ప్రయివేటుకు అమ్మడం చట్టం చేశారని అన్నారు. ఆస్ట్రేలియాలో బొగ్గు బ్లాక్ ఆదానికి ప్రధాని మోడీ ఇప్పించి దేశంలోకి బొగ్గు దిగుమతి చేస్తున్నారని అన్నారు. సింగరేణి బొగ్గు టన్నుకు రూ.4వేలు ఉండగా ఆదాని బోగ్గు టన్నుకు రూ.32వేలు కొనాలని మెలికలు పెడుతున్నారని అన్నారు. అనేక రాయితీ చట్టాలు రద్దు చేశారని అన్నారు. కోయగూడెం ఓసి-3 అరబిందో కంపిని ఒక్కరే వేశారని నిబంధనల ప్రకారం ఇవ్వకూడదని కాని యాజమాన్యం కట్టబెట్టిందన్నారు. ఈ విధంగా సింగరేణిలో ఒకటి, కోల్ ఇండియాలో మొత్తం 160 బొగ్గు బ్లాకులను ప్రయవేటకు ఇచ్చారని అన్నారు. ఇల్లందులో 21 ఇంక్లైన్, పూసపల్లి భూగర్భగనుల నుండి ఓసి ఎక్స్‌టెంషన్ పేరుతో ఓసి సిద్ధమైందని దీనిని ప్రయివేటకు అప్పజెప్పడానికి సింగరేణి యాజమాన్యం పూనుకుందని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. సిఎం కేసిఆర్ చొరవ చూపి సింగరేణి సంస్థ ఓసి నడిపే విధంగా చూడాలని కోరారు.

మేడే స్ఫూర్తితో యువ కార్మికులు హక్కులు కాపాడుకోవాలి

ఎన్నో పోరాటాలు ప్రాణత్యాగం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలు రద్దు చేసి కార్మికులకు ఉపయోగంలేని చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెస్తోంది. మేడే స్ఫూర్తితో కొత్తగా వస్తున్న యువ కార్మికులు హక్కులు కాపాడుకోవాలని మందా నర్సింహారావు కోరారు. ఆలిండియా పిలుపులో భాగంగా మే ఒకటి నుండి 8 మేడే వారోత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఈ సభలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కూకట్ల శంకర్, జిల్లా నాయకులు నబి, బ్రాంచి కార్యదర్శి ఎండి. అబ్బాస్, మండల కార్యదర్శి తాళ్ళూరి కృష్ణ, మన్యం మోహన్‌రావు, రమేష్, చందర్, రాంభరోస్, సదానందం పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన జీఎం

ఇల్లందు : ఏరియా సింగరేణి రన్స్ అండ్ గోల్స్ స్టేడియం (24 ఏరియా) నందు వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోషియేషన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలెం రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, వారి పిల్లలకు ఫుట్ బాల్, బాస్కెట్ బాల్ క్రీడలలో శిక్షణ ఇస్తున్నామని, తద్వారా పిల్లలకు శారీరకంగా, మానసికంగా ఎంతో దోహద పడతాయని, పిల్లలు చిన్నతనం నుంచే క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని, వేసవి సెలవుల్లో సెల్ ఫోన్లు వాట్స్‌అప్‌లతో కాలయాపన చేయకుండా క్రీడల పై దృష్టి పెట్టాలని, శిక్షకులు చెప్పిన మెళకువలను పాటిస్తూ రాణించాలని, ఇందులో భాగంగా బాస్కెట్ బాల్, ఫుట్ బాల్ క్రీడలను 25 రోజులపాటు ఈ శిక్షణ శిబిరంలో నిర్వహించడం జరుగుతుందని, ఈ శిక్షణను నిర్వహించడానికి అనుభవజ్ఞులైన శిక్షకున్ని నియమించడం జరిగిందని, ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం మల్లారపు మల్లయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాసు, జెకెఓసీ ప్రాజెక్ట్ అధికారి బోల్లం వేంకటేశ్వర్లు, డిజియం(పర్సనల్)జీవి.మోహనరావు, డీవైపీఎం (పర్సనల్) జి.శ్రీహరి, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షులు ఎస్.రంగనాథం, ఉద్యోగులు జైనులావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

నేడు కలెక్టరేట్ ప్రజావాణి

పాల్వంచ : సోమవారం ఐడీఓసీ (కలెక్టరేట్) కార్యాలయంలో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని డీఆర్ఓ అశోక్ చక్రవర్తి తెలిపారు. ప్రజలు వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదును అందచేయాలని ఆయన చెప్పారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు.

కొల్హాపూర్ రైలు ప్రారంభం

కొత్తగూడెం టౌన్ : కొత్తగూడెం-కొల్హాపూర్ మధ్య నడిచే కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్‌రైలును ఈనెల 8వ తేదీ నుండి పునరుద్ధరించనున్నట్లు కొవ్వూరు రైల్వే లైన్ సాధన కమిటీ కన్వీనర్ కొదమసింహం పాండు రంగాచార్యు ప్రకటనలో తెలిపారు. కోవిడ్-19 కరోనా సమయంలో రద్దుచేసిన కొల్హాపూర్ ఎక్స్ ప్రెస్ రైలును సోమవారం నుండి పునరుద్ధరిస్తున్నారని తెలిపారు. కొల్హాపూర్ బెళగావి నుంచి సికింద్రాబాద్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్‌ను మణుగూరు వరకు కొనసాగించనున్నట్లు శనివారం రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీచేసినట్లు సమాచారం 7వ తేదీ తెల్లవారుజామున 5.గంటల 25 నిముషాలకు సికింద్రాబాద్‌లో బయలుదేరే రైలు ఉదయం10.45 గంటలకు బీడీసీఆర్ (కొత్తగూడెం)కు చేరుకుంటుంది. ఇక్కడి నుండి బయలుదేరి మధ్యాహ్నం 3గంటల 40 నిముషాలకు మణుగూరు చేరుకుంటుంది. తిరిగి అదే రోజు సాయంత్రం 4 గంటల 50 నిముషాలకు మణుగూరు నుండి బయలుదేరి బీడీసీఆర్ (కొత్తగూడెం) మీదుగా సికింద్రాబాద్ చేరుకుని, అక్కడి నుండి కొల్హాపూర్ మీదుగా బెళగావి చేరనుందని సమాచారం.

ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తాం

దుమ్ముగూడెం : తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేంతవరకు ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని వీవోఏల సంఘం మండల కార్యదర్శి నాగరాజు అన్నారు. వీవోఏలు చేస్తున్న నిరవేదిక సమ్మె ఆదివారం నాటికి 21వ రోజుకు చేరుకుంది. గత 21 రోజులు తాము సమ్మె చేస్తుంటే కనీసము రాష్ట్ర ప్రభుత్వం పట్టిచుకోవడం లేదు అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఐకెపిలో పనిచేస్తున్న తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత ఆరోగ్య భద్రత కల్పించాలని, ఐడీ కార్డులు అందజేయాలని, యూనిఫామ్ ఇవ్వాలని, ప్రమోషన్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఒత్తిడి ఉన్న కారణముగా సంఘ సభ్యులకు అభయహస్తం డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్యాం మణి రేఖ, వెంకటనర్సమ్మ రాజేశ్వరి, భద్రమ్మ, కృష్ణవేణి, గుట్టయ్యా, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలు విజయవంతం

• సహకరించిన ప్రజలకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు
• రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మిడియం బాబురావు



నవతెలంగాణ-భద్రాచలం

మే 3 నుండి 6 వరకు జరిగిన తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర 3వ మహాసభలు జయప్రదంగా ముగిశాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మిడియం బాబురావు అన్నారు. సహకరించిన ప్రజలకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 3, 4 తేదీలలో జరిగిన ఆదివాసి గిరిజన సాంస్కృతిక ఉత్సవాలు ఆదివాసి గిరిజనుల, సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించాయని అన్నారు. రెండు రోజులపాటు జరిగిన రేలా పండుం ఉత్సవాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకించడం మంచి పరిణామం అని, ఉత్సవాల్లో పాల్గొన్న ప్రజలకు, ముఖ్య అతిథులుగా పాల్గొన్న పట్టణ ప్రముఖులు, డాక్టర్లు, వ్యాపార వర్గాలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. గిరిజన సంఘం కేంద్ర నాయకురాలు బృందా కారత్ పాల్గొన్న బహిరంగ సభ, ర్యాలీ జయప్రదం చేసిన గిరిజన ప్రజలకు అభినందనలు తెలిపారు. మహాసభ జయప్రదం కోసం ఏర్పాటుచేసిన కమిటీలు కృషి అభినందనీయమని అన్నారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలో చర్చించిన గిరిజన సమస్యలపై భద్రాద్రి కేంద్రంగా రానున్న కాలంలో గిరిజన ఉద్యమాలు నిర్వహించాలని నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. ప్రధానంగా ఆదివాసి గిరిజనుల మనుగడను ప్రమాదంలోకి నెట్టే కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాడుతామని అన్నారు. విద్య, ఉపాధి, గిరిజన చట్టాల అమలు తదితర అంశాలపై మహాసభలో చర్చించి నిర్వహించాల్సిన పోరాటాలపై కార్యాచరణ రూపొందించడం జరిగిందని అన్నారు. గిరిజనుల సాగులో ఉన్న పోడు భూములకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా హక్కు పత్రాలు ఇవ్వాలని లేకుంటే రానున్న కాలంలో పోడు పోరు తప్పదని అన్నారు. మూడవ మహాసభలో ఎన్నికైన నూతన రాష్ట్ర కమిటీ పటిష్టమైన గిరిజన ఉద్యమాన్ని నిర్మాణాత్మకంగా సాధిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కారం పుల్లయ్య, ఉపాధ్యక్షురాలు సున్నం గంగా, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు సోయం జోగారావు, కుంజా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ప్రతిగింజనూ ప్రభుత్వం కొనుగోలు చేయాలి

• తేమ సాకుగా చూపి రైతులకు నష్టం చేయొద్దు
• రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల విశ్వనాథం
• ప్రభాత నగర్(రెడ్డిగూడెం) ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సీపీఐ బృందం



నవతెలంగాణ-పాల్వంచ

సీసీఐ కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే కాటాలు పెట్టాలని, ఇటీవల కురిసిన అకాల వర్షాలతో కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి నష్టపోయిన సమస్త రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. పాల్వంచ మండలం ప్రభాత నగర్(రెడ్డిగూడెం) ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, సీపీఐ బృందం ఆదివారం సందర్శించారు. రైతులను కలుసుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, ఐతే క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని, దాన్యాన్ని ఆరబెట్టుకొని రావాలని సంబంధిత అధికారులు నిబంధన విధిస్తుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారని, తరచూ వర్షాలు కురుస్తుండటంతో దాన్యాన్ని ఆరబెట్టే పరిస్థితులు లేకుండా పోయాయన్నారు. 17శాతం తేమ అనే నిబంధన వల్ల రైతాంగం నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

లక్షలాది ఎకరాల్లో పండించిన వరిదాన్యం అకాల వర్షాలకు తడిసి ఇంకా కల్లాలోనే ఉందని, రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్న ఈ దాన్యాన్ని 17 శాతం నిబందను విధించకుండా కొనుగోలు చేయాలని కోరారు. అకాల వర్షాలకు వరితోపాట మొక్కజొన్న, మిర్చి, మామిడి రైతులు సైతం పూర్తిగా నష్టపోయారన్నారు. రైతులకు జరిగిన నష్టంపై కేంద్రం ప్రభుత్వం కూడా స్పందించాల్సిన అవసరం ఉందని, ఎకరాకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే పరిహారంతో నిమిత్తం లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి పరిహారం అందించాలని కోరారు. సాగుకోసం అప్పులు చేసి పెట్టిన పెట్టుబడులు తీర్చే స్థితిలో లేక, మళ్ళి అప్పులు చేసే ధైర్యం లేక రైతన్నలు గుండెనిబ్బరం కోల్పోతున్నారన్నారు. ప్రభుత్వం నుంచి రైతులకు ఖచ్చితమైన హామీ ఇచ్చి నష్టపోయిన రైతుల కన్నీళ్ళు కన్నీళ్ళు తుడవాలని, సుమారు 100మంది రైతుల ధాన్యం సీసీఐ కేంద్రంలో ఉందిని యుద్ధ ప్రాతిపదికన సీసీఐ కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే కాటాలు పెట్టాలినీ, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి జరిగిన నష్టంపై సర్వేలు చేపట్టి త్వరితగతిన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రతినిధి బృందంలో సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోటి నాగేశ్వరరావు, రైతు సంఘం.మండల కార్యదర్శి రామచందర్, ఉపేందర్ రెడ్డి, గుడాపురి రాజు, జకరయ్య, రైతులు నిమ్మల మోహన్ రెడ్డి, జక్కుల కృష్ణ, రాములు, వెంకట్ రెడ్డి, వేల్పుల లింగయ్య, సత్తిరెడ్డి, మహేందర్ రెడ్డిలి ఉన్నారు.

అనుదినం...జనస్వరం
www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం 08 మే 2023



ప్రశాంతంగా నీట్ పరీక్ష

- అలస్యంగా వచ్చి వెనుతిరిగిన అభ్యర్థులు
- వేడుకున్నా ఫలితంలేదు
- 1080 మందికి 19 మంది విద్యార్థులు గైర్హాజరు

నవతెలంగాణ-కొత్తగూడెం

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ), దేశ వ్యాప్తంగా మెడికల్ కోర్సులలో ప్రవేశానికి నిర్వహించే నీట్ ప్రవేశ పరీక్షకు ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగాయి. జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాలలో పరీక్ష నిర్వహించారు. కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలల, పాల్వంచలోని డిఏవి పాఠశాలలో పరీక్షలు పటిష్టంగా ఏర్పాటు చేసినట్లు నీట్ సిటీ కో-ఆర్డినేటర్ ఎంవి. శ్రీనివాసరెడ్డి తెలిపారు.

దేశ వ్యాప్తంగా 20 లక్షలు మంది విద్యార్థులు సిద్ధం కాగా భద్రాద్రి జిల్లాలో రెండు కేంద్రాలలో 1080 మంది విద్యార్థులుకు గాను 19 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షల నియమ నిబం ధనలుకు అనుగుణంగా రెండు కేంద్రాలలో సరైన సమయంకి ప్రారంభం అయి నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని పాల్వంచ డిఏవి స్కూల్, కొత్తగూ డెంలోని సింగరేణి డిగ్రీ, పీజి కాలేజ్‌లో ప్రశాంతంగా జరిగాయి. నీట్ పరీక్షకు మొత్తం విద్యార్థులు 1080 మంది రాశారు. కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ పీజీ కళాశాలలో 480 మందికి 11 మంది గైర్హాజరుకాగా, 479 మంది విద్యా ర్థులు హాజరయ్యారు. పాల్వంచలోని కేటిపిఎస్ డిఏవి పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో 600 మంది విద్యార్థులు 582 మది హాజరయ్యారు. 8 మంది గైర్హాజరు అయ్యారు. మొత్తంగా 19 మంది విద్యార్థులు హాజరు కాలేకపోయారని తెలిపారు.

ఆలస్యంగా వచ్చి వెక్కిపడ్చిన విద్యార్థిని



నీట్ పరీక్షలకు 1080 మంది హాజరుకావాల్సి ఉండగా వివిధ కారణాల రిత్యా కొంత మంది అభ్యర్థులు హాజరు కాలేక పోయారు. కొంత మంది అభ్యర్థులు సమయం దాటిన తరువాత పరీక్ష కేంద్రాలకు ఆలస్యంగా వచ్చిన తీరు కనిపించింది. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించారు. ఉదయం 11 గంటల నుండి విద్యార్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతిచారు. జాతీయ స్థాయి పరీక్ష కావడంతో నిబంధనలు కఠినంగా ఉన్నాయి. పరీక్ష రాసే విద్యార్థినులు వారు ధరించిన నగలను తీయించి, లోనికి అనుమతించారు. ఆలస్యంగా వచ్చిన వారు పరీక్ష రాయకుండా వెనుతిరిగారు. కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల పరీక్ష కేంద్రం గేటువద్ద పాల్వంచకు చెందిన ఇద్దరు ఆలస్యంగా వచ్చి, అనుమతిలేక కళ్లనీళ్లు పెట్టుకున్నారు. బందో బస్తులో అక్కడే ఉన్న కొత్తగూడెం 1టౌన్ సిఐ కరుణాకర్‌ను కన్నీళ్ల పర్యంతంతో వేడుకున్నారు. ఆయన పరీక్ష నిర్వహకులను కలిసి విన్నవించినప్పటికీ పరీక్ష నిబంధన ప్రకారం అనుమతి లేదని తేల్చి చెప్పారు.

కారు...ఆటో ఢీ

- నలుగురికి తీవ్రగాయాలు
- మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్ తరలింపు



నవతెలంగాణ-చుంచుపల్లి

కారు, ఆటో ఢీ కొన్న సంఘటనలో పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన చుంచుపల్లి మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని 4 ఇంక్లైన్ జాతీయ రహదారిపై ఆటోను కారు ఢీ కొట్టిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం విజయవాడ నుంచి భద్రాచలం వైపు వెలుతున్న టిఎస్-27, ఎఫ్-4066 నెంబర్ గల కారు 4 ఇంక్లైయిన్ వద్ద జాతీయ రహదారిపై రోడ్డు క్రాస్ చేస్తున్న టిఎస్-28 టిఏ-9972 ఆటోను ఢీ కొంది. ఆటోలో ఉన్న ప్యాసింజర్లు రోడ్డుపై చెల్లాచెదురుగా పడటంతోతీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే సమీపంలోని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను వైద్యులు పరీక్షించగా తీవ్రగాయాలపాలైనారని, కొందరికి తలకు బలమైన గాయాలు కావడం, నలుగురి పరిస్థితి విషమించటంతో వారిని మెరుగై న వైద్యం కోసం హైదరాబాదు తరలించారని వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ఉద్యమించాలి

- టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిడియం బాబురావు


నవతెలంగాణ భద్రాచలం రూరల్



అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ఉద్యమించాలని మాజీ ఎంపీ, టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిడియం బాబురావు అన్నారు. భద్రాచలం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో ఉన్న మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి మిడియం బాబురావు, ఘంటం దొర విగ్రహానికి టీఏజీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కారం పుల్లయ్య, మల్లు దొర విగ్రహానికి ప్రముఖ న్యాయవాది పాయం రవివర్మ పూలమాల వేసి నివాళులర్పించారు. సభ అధ్యక్షులు భద్రాచలం పట్టణ అధ్యక్షులు సోయం జోగారావు అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో మిడియం బాబురావు మాట్లాడుతూ మన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్వతంత్ర సమరయోధుడు ఆనాటి బ్రిటిష్ పాలకులను తెల్లదొరలను తరిమి కొట్టిన బ్రిటిష్ వాళ్ళ గుండెల్లోకి దూసుకొని వెళ్ళిన విప్లవ బాణం అల్లూరి సీతారామరాజు అని వారి స్ఫూర్తితో భవిష్యత్తు పోరాటాలకు ఆదివాసీలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని స్వతంత్ర పోరాటంలోనే కాదు ఆదివాసీ హక్కుల కోసం కూడా అనేక పోరాటాలు చేసిన మహా వీరుడు అన్నారు. ఆ యోధుడుని 1924 మే 7వ తారీఖున అతి దారుణంగా బ్రిటిష్ సామ్రాజవాదులు చెట్టుకు కట్టేసి తుపాకులతో కాల్చి చంపడం జరిగిందని ఆయన ఉద్యమం 1922 నుండి 1924 మే 7 వరకు కొనసాగిందని రెండు సంవత్సరాల కాలంలోనే అనేక ఆదివాసి హక్కులు సాధించడం ఈ దేశం నుండి తెల్లదొరలను తరిమికొట్టే విధంగా ఉద్యమించడం జరిగిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈనాటి కేంద్ర ప్రభుత్వం బీజేపీ 2014లో అధికారంలో వచ్చిన తర్వాత నుండి ఇప్పటివరకు ఆదివాసీల పైన ఆదివాసి హక్కుల పైన దాడి చేయడం కాకుండా అడవులన్నీ కార్పొరేట్ శక్తులకు అమ్మేసే ప్రయత్నం చేస్తుందని ఇట్లాంటి ప్రయత్నాలు మానుకోకపోతే రానున్న కాలంలో బిజెపి పార్టీ నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దెదింపడానికైనా ఆదివాసీలందరిని ఐక్య పోరాటాలతో ఐక్యం చేసి ఉద్యమిస్తామని హెచ్చరిక చేశారు.

అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిధిలో ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో ఖాళీగా ఉన్న ఉద్యోగా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 2020 ఏప్రిల్ 22న రద్దు చేసిన జీవో నెంబర్ త్రీని రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వం కలిసి చట్టం చేయడం కోసం రూపకల్పన చేయాలని ఆయన అన్నారు. తరతరాలుగా సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కారం పుల్లయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు సున్నం గంగా, ప్రముఖ న్యాయవాది ఆదివాసి నాయకుడు పాయం రవివర్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గడ్డం స్వామి పిఏజిఎస్ టౌన్ కార్యదర్శి కుంజా శ్రీను, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సంద్ర భూపేందర్, సీఐటీయూ నాయకులు నకరికంటి నాగరాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మిడియం బాబురావు



విద్యుత్ శాఖ ఆర్థిక సాయం

నవతెలంగాణ-మణుగూరు


అగ్ని బాధిత కుటుంబానికి విద్యుత్ శాఖ వారిచే ఆర్థిక సహాయం అందజేసినట్లు భద్రాచలం డివిజన్ ఇంజనీర్ కె.జీవన్ కుమార్ తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ చిక్కుడు గుంటలోని మాటూరు సారయ్య పూరి గుడిసె ఏప్రిల్ 21 అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో విద్యుద్ఘాతంతో అతని గృహం దగ్ధమైందని తెలిపారు. ఈ ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ శాఖ వారిచే రూ.20వేలు విరాళం సేకరించి ఆర్థిక సహాయం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ జి.వేణుగోపాల్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యునిగా గౌరీ నాగేశ్వరరావు



నవతెలంగాణ-ములకలపల్లి

తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ములకలపల్లి మండలానికి చెందిన గౌరీ నాగేశ్వరరావు నూతనంగా ఎన్నికయ్యారు. 5, 6 తేదీలలో భద్రాచలంలో జరిగిన తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం 3వ రాష్ట్ర మహాసభలలో ఎన్నికయ్యారు. ములకలపల్లి మండలంలో ఆదివాసి సమస్యలపై నిరంతరం ఆందోళన పోరాటాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా పోడు భూముల సమస్యపై పలుమార్లు జైలు జీవితం గడిపారు. మండల వ్యాప్తంగా ఆదివాసీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికైన గౌరీ నాగేశ్వరరావును వివిధ ప్రజా సంఘాల నాయకులు అభినందించారు.



అనుబోస్ ఇంజనీరింగ్ క్యాంపస్ సెలక్షన్స్

- 30 మంది విద్యార్థులు ఎంపిక
- విద్యార్థుల నైపుణ్యాల మెరుగు కోసం వర్క్ షాప్స్
- అనుబోస్ ఇంజనీరింగ్ చైర్మన్ డాక్టర్ భరత్ కృష్ణ

నవతెలంగాణ-పాల్వంచ

మున్సిపల్ పరిధిలోని అనుభూతి ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్ జరిగాయి. అనుబస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న ఈసీఈ సిఎసి, సివిల్, ఈఈఈ, మెకానికల్ 2022-2023 ఉత్తీర్ణులైన విద్యార్థులకు బెంగళూరుకు చెందిన ప్రముఖ సాఫ్ట్వేర్ దగ్గర సంస్థ బస్టాండ్ ఐటి సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ క్యాంపస్ సెలక్షన్ నిర్వహించింది. సంస్థ హెచ్ఆర్ మేనేజర్ గీతం దేశాయి సీనియర్ హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ ప్రశాంత్ జోసి పాల్గొని విద్యార్థులకు నాలుగు వివిధ ప్రక్రియలను నిర్వహించారు. ఆంగ్లభాష ప్రతిభను పరిరక్షించుటకు మొదటి రాత పరీక్షను తర్వాత ఆప్టిట్యూడ్ టెస్ట్ టెక్నికల్ హెచ్ఆర్ ఇంటర్వ్యూలను కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ నియామక ప్రక్రియలు భాగంగా నిర్వహించిన పరీక్షల ఆధారంగా కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. విద్యార్థులు ఏడాది ఆగస్టున సంస్థ నందు రిపోర్ట్ చేయవలసి ఉండగా వారికి వార్షిక వేదనంగా 9 లక్షల ప్యాకేజీని సంస్థ అందించాలని ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ భరత్ కృష్ణ మాట్లాడుతూ మా కళాశాలలో విద్యార్థులు చేరిన మొదటి రోజు నుండి అనేక రంగాల్లో వ్యక్తిగత వృత్తి గత నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు అనేక వర్క్షాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ టి.ఆవని, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్వి సుబ్బారావు, ప్లేస్మెంట్ ఆఫీసర్ ఇమ్మడి క్రాంతికుమార్, వివిధ విభాగాధిపతులు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మాలోత్ కవితకు కృతజ్ఞతలు

నవతెలంగాణ-మణుగూరు



బెల్గావి నుండి సికింద్రాబాద్ వరకు నడిచే ఎక్స్ప్రెస్ రైలును మణుగూరు వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సౌత్ సెంట్రల్ రైల్వే శాఖ, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవితకు మణుగూరు ప్రాంత ప్రజలు మరియు ప్రజా ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ పోశం నరసింహారావు మాట్లాడుతూ ఎంపీ మాలోత్ కవితకు, ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో సింగరేణి బీటీపీఎస్ హెవీ వాటర్ ప్లాంట్ ఐటీసీ పేపర్ బోర్డ్, అనేక రాష్ట్ర ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారన్నారు. వారి సౌకర్యార్థం రైలు పొడిగించడం సంతోషకరంగా ఉందన్నారు. కరోనా సమ యంలో మణుగూరు నుండి కోలాపూర్ ఎక్స్ప్రెస్ రైలు రద్దు చేసిన తర్వాత ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. ఎంపీ ప్రత్యేక చొరవతో కేంద్ర ప్రభు త్వంతో మాట్లాడి ప్రాంతానికి రైలు తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. సింగరేణి, విజయవాడ రైళ్లను కొత్తగూడెం నుండి మణుగూరుకు పొడిగించాల న్నారు. దీనికి దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.



భరోసా సభకు బయలుదేరిన టేకులపల్లి ప్రజలు

నవతెలంగాణ-టేకులపల్లి

హైదరాబాదులో బీఎస్పీ ఆధ్వర్యంలో జరుగుతున్న తెలంగాణ భరోసా సభకు టేకులపల్లి మండల బీఎస్పీ నాయకులు ఆదివారం బయలుదేరి వెళుతున్నట్లు ఇల్లందు నియోజక వర్గ బీఎస్పీ ఇన్చార్జ్ ప్రతాప్ తెలిపారు. సభలో రాష్ట్రంలో జరుగుతున్న సమస్యలను పలువురు నాయకులు వివరిస్తారన్నారు. బీఎస్పీ అవినీతి లేని పాలన అందిస్తుందని, ప్రజలుఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాదావత్ ప్రతాప్, ఇల్లందు నియోజకవర్గ అధ్యక్షులు, మండల నాయకులు రాంబాబు, రాంప్రసాద్, తులసమ్మ, సుజాత, లావణ్య, లోకేష్, రాకేష్, తరుణ్, అరుణ్, కిరణ్ యశ్వంత్ మరియు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రత వారోత్సవాలు

నవతెలంగాణ-చంద్రుగొండ

విధి నిర్వహణలో సిబ్బంది భద్రతా చర్యలు పాటించాలని డివిజనల్ ఇంజనీర్ టి.శేషాద్రి సూచించారు. చంద్రుగొండ ఉపకేంద్రంలో విద్యుత్ భద్రతా వారోత్సవాలు డివిజనల్ ఇంజనీర్ టి.శేషాద్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి టి.శేషాద్రి మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది లైన్‌లో పని చేయునప్పుడు తీసుకోవాలసిన జాగ్రత్తలు, సూచనలు, సలహాలు తెలియజేశారు. సిబ్బందికి భద్రతా పరికరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ ఎండి యాసిన్, ఏఈ నరసింహా రావు, ఎస్ఎల్ఐ, ఎంవి సత్యనారాయణ, లైన్ మెన్‌లు సతీష్, కిషన్, తరుణ్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- అర్ధరాత్రి ట్రాక్టర్లతో ఇసుక తోలకాలు
- సుదూర ప్రాంతాలకు తరలింపు
- గోదారి తీరాన ప్రజలకు ఇసుక కరువు
- పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు మండలంలోని గోదారి తీరంలో కొందరు అక్రమార్కులు యదేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఇసుక క్వారీల నుంచి కాకుండా ఇతర ప్రాంతాల మణుగూరులోని ఇసుక ట్రాక్టర్స్ ఎటువంటి అనుమతులు లేకుండా ఇస్తారాజ్యంగా అక్రమంగా ఇసుక తోలకాలు చేపడుతున్నారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని రాయిగూడెం గ్రామ సమీపంలోని అక్రమంగా ఏర్పాటు చేసుకున్న క్వారీలో నుంచి కొందరు అక్రమార్కులు ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేయడం జరుగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు రాత్రి వేళలు డాక్టర్ల ద్వారా చేపడుతున్నారని, అటువంటి సమయంలో వారికి ఎవరు అడ్డొచ్చిన ఏం చేయడాకైనా సిద్ధంగా ఉన్నారని స్థానిక ప్రజల ఆరోపిస్తున్నారు. అవసరాలను ఆసరా చేసుకుని వారి ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయిస్తున్నారని, గోదావరి తీరంలో ఉన్న గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం ఇక్కడ ఇసుక కరువవుతుందని మండిపడుతున్నారు. మణుగూరు గోదావరి ఇసుక క్వారీల నుంచి హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు ఇసుక రవాణా అవుతున్నప్పటికీ ఇక్కడ నిర్మాణాలు చేసుకునే వారికి మాత్రం ఇసుక కరువనట్లు టాక్టర్ యజమానులు చేస్తున్నారు. వారు చెప్పిన ధరలకు మాత్రమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేయడం జరుగుతుంది. కొంతమంది ఇసుక అక్రమంగా తీసుకొచ్చి నిర్వహించుకొని ఇతర ప్రాంతాలకు అక్రమంగా లారీల ద్వారా తరలిస్తున్నారు.



సెలవులు వస్తే చాలు....

మణుగూరులోని గోదావరి తీరం నుంచి అక్రమంగా ఇసుకతోలకాలపై రెవెన్యూ పోలీస్ అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో అక్రమదారులకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. రాత్రి, పగలు తేడా లేకుండా సెలవు దినాల్లో అక్రమ తోలకాలు జరుగుతున్నాయి. సెలవు రోజుల్లో అధికారులు ఎవరూ అందుబాటులో లేని సమయాల్లో అక్రమ దారులు ఇష్టానుసారంగా తోలకాలు చేపడుతుంటారు. ఈ విధంగా అక్రమ తూలకాలు చేపట్టడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇసుక సీనరేజీలు ఏర్పాటు చేయడం వల్ల సంబంధిత మున్సిపాలిటీలకు గాని పంచాయతీలో గాని కొంత ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయి.

అందరికీ మామూళ్లు

ప్రభుత్వానికి ఎటువంటి పనులు చెల్లించకుండానే గోదావరిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న అక్రమ వ్యాపారులు తాము అందరికీ మామూళ్లు ఇస్తున్నామంటూ ప్రచారం చేస్తున్నారు. ఆ మాట చెప్పి అధిక ధరలకు ఇసుక అమ్మకాలు చేపడుతున్నారు. గతంలో స్థానికంగా కేవలం ఒక వెయ్యి నుంచి 1200 వరకు అమ్మకాలు చేస్తామని చెప్పినా టాక్టర్ యజమానులు ప్రస్తుతం రూ.1500 నుంచి 2000 వరకు అమ్ముతున్నారు. గోదావరిలో యంత్రాలు పెట్టి మరి తోలకాలు చేపడుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే పోలీస్, రెవెన్యూ అధికారులకు నెలనెలా మామూలు అందిస్తున్నామంటూ బుకాయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ విధమైన అక్రమ ఇసుక దందాకు తెరదించాలని, ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రజాసంఘాలు కోరుతున్నాయి.

మితిమీరుతున్న ఆగడాలు



ట్రాక్టర్ యజమానులు చేస్తున్న ఆగడాలు అంతా ఇంతా కాదు. రాత్రివేళ ఇష్టా నుసారంగా ట్రాక్టర్లను గ్రామాల మీద నుంచి పోతున్నాయి. దీంతో గ్రామంలో రోడ్లు పూర్తిగా పాడై పోతున్నాయి. కమలాపురంలోని ప్రధాన రహదారి పూర్తిగా ఇసుక ట్రాక్టర్ల వల్లనే పాడైపోతుంది. ప్రశ్నించే వారిపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. అక్రమ వ్యాపారులకు అధికారులు అండదండలు పుష్కలంగా ఉండడంతో వారు ఇష్టారాజ్యంగా చేస్తున్నారు.

- బొల్లం రాజు వ్యకాస మండల అధ్యక్షులు

అధిక ధరలకు అమ్ముతున్నారు



గోదావరి తీరం నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ ప్రజలకు అధిక ధరలకు అమ్ముతున్నారు. గోదావరి నుంచి అక్రమ రవాణా వల్ల ప్రభుత్వానికి ఆదాయం గండి పడుతుంది. ప్రజలపై భారం పడుతుంది. ఇసుక ధరలు అధికంగా ఉండటం వల్ల భవన నిర్మాణాలు సైతం తగ్గుతున్నాయి. దీంతో కార్మికులకు సైతం ఇబ్బందిగా మారుతుంది. అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వెయ్యాలి.

కొండ్రు గౌరీ, గిరిజన సంఘం మండల అధ్యక్షురాలు

వ్యవసాయ రంగంలో సీసీఎక్స్ సేవలు అభినందనీయం

- జిల్లాలో వరి సాగు చేసే రైతులందరికీ ఏడబ్ల్యుడీ పథకాన్ని వర్తింపజేయాలి
- ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

నవతెలంగాణ-పినపాక

వ్యవసాయ రంగంలో వస్తున్న అధునాతన పద్ధతులను అన్నదాతలు అందిపుచ్చుకోవాలని ఈ దిశగా కృషి చేస్తున్న సీసీ ఎక్స్ సేవలు అభినందనీయమని పినపాక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు అన్నారు. పినపాక మండలం జానంపేట రైతు వేదికలో సీసీఎక్స్ జిల్లా మేనేజర్, జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ కమిటీ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి అధ్యక్షతన సిసి ఎక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టేక్ హెూల్డర్స్ రైతు సమావేశానికి అయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విప్ రేగా కాంతారావు మాట్లాడుతూ వరి సాగులో అధికంగా సాగునీరు ఉంచడం వల్ల మిథైల్ విషవాయువు ఉత్పత్తి అయ్యి పర్యావరణానికి పెను ప్రమాదంగా మారిందని ఈ గ్యాస్ ఉత్పత్తిని తగ్గించేందుకు పర్యావరణాన్ని పరిరక్షించేందుకు సీసీ ఎక్స్ సంస్థ వరి సాగులో తడి పొడి పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. రైతులు వరి సాగులో తడి పొడి విధానం అవలంబించడం వల్ల మిథైన్ విష వాయువు ఉత్పత్తి తగ్గించటంతో పాటు భూగర్భ జలాలను పొదుపు చేయడం విద్యుత్ వినియోగాన్ని తగ్గించడం భూసారాన్ని పరిరక్షించడం వంటి అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న పినపాక, కరక గూడెం మండలాలతో పాటు జిల్లాలోని మిగిలిన మండలాల్లో సైతం ఈ పథకాన్ని అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సిసియక్స్ జిల్లా మేనేజర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి, సిసిఎక్స్ ఉన్నత అధికారులకు ఎమ్మెల్యే రేగా సూచించారు. వ్యవసాయ శాఖ, సీసీ ఎక్స్ అధికారులు కలిసి సంయుక్తంగా రైతులకు ప్రయోజనం చేకూర్చేలా కార్యక్రమాల్ని అమలు చేయాలన్నారు. రైతులకి సంస్థ ప్రతినిధులకు మధ్య అనుసంధానం ఉండేలా ఆదర్శ రైతులను నియమించాలని ఎమ్మెల్యే రేగా అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తొలిసారిగా సిసి ఎక్స్ ఏడబ్ల్యుడి ప్రాజెక్టును తన చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.





అనంతరం సిసి ఎక్స్ డైరెక్టర్ హెడ్ హృషికేశ్ మహాదేవ్ మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా సాంకేతికంగా అభివృద్ధి చెందెందుకు తమ సిసి ఎక్స్ సంస్థ నడుం బిగించిందన్నారు. అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.కార్తీక్ రావు మాట్లాడుతూ తడి పొడి పద్ధతిలో రెండు పంటలు వరి పండించే రైతులకు ఎకరానికి రూ.800 ప్రోత్సాహక ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. శాస్త్రవేత్త, సిసి ఎక్స్ కన్సల్టెంట్ డాక్టర్ ఎస్ నరసింహారెడ్డి మాట్లాడుతూ తడి పొడి విధానం పై వరి రైతులకు సహజంగా ఉండే సమస్యలు సందేహాలను నివృత్తి చేశారు. తడి పొడి పద్ధతిలో వరి సాగు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పోతన ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్, సిసి ఎక్స్ డైరెక్టర్ గడ్డం వెంకట్ రెడ్డి, హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్ ప్రశాంత్, వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ దేవేందర్, మణుగూరు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు తాతారావు, ఏఈఓ కేశవ్, పినపాక వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ చైర్మన్ పొనుగోటి భద్రయ్య, పినపాక ఎంపీపీ గుమ్మడి గాంధీ, జడ్పిటిసి సుభద్ర వాసు, రైతు సమన్వయ సమితి పినపాక మండల కోఆర్డినేటర్ దొడ్డ శ్రీనివాసరెడ్డి, సహకార సంఘం చైర్మన్ ముదునూరి రవిశేకర్ వర్మ, సహకార సంఘం డైరెక్టర్ పొనుగోటి కామేశ్వరరావు, వికాస్ అగ్రి ఫౌండేషన్ వైస్ చైర్మన్ పచ్చి పులుసు నరేష్, సిసిఎక్స్ క్లస్టర్ కోఆర్డినేటర్ పసుపులేటి కార్తీక్, ఫీల్డ్ కోఆర్డినేటర్లు పొనుగోటి సాయి, తేజస్, నంకాపురం శ్రీనివాస్, బాబురావు, మందడపు సాంబశివరావు, సహాయకులు సాయి, మూడు రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రేగాకి ఘన సత్కారం

పినపాక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ రేగా కాంతారావుని సిసిఎక్స్ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. సిసి ఎక్స్ సంస్థ ప్రతినిధులు హృషి కేశవ్ కార్తీక్ రావు, నరసింహారెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా మేనేజర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి ఎమ్మెల్యే రేగా కాంతారావుకి ధాన్యం కంకులు, వ్యవసాయ రంగానికి చిహ్నమైన కలప నాగలిని బహుకరించి పూల బొకేలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అక్షరం ఆరోగ్యం వెరసి ఆలూరి



కథానికలతో పాటు ఆరోగ్యకరమైన సమాజం కోసం ఆరోగ్యకరమైన విషయాల పట్ల అవగాహన కలిగించడంలో నిష్ణాతులు వీరు. వైద్య వృత్తిని అభ్యసించి స్త్రీల శారీరక రుగ్మతలకు కారణాలు వెదికారు. మహిళలకు తమ ఆరోగ్యం పట్ల అవగాహన లేకపోవడం సమస్యకు కారణమని గుర్తించారు. తన రచనల ద్వారా బాలికలు, మహిళలు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తున్నారు. నిరుపేద మహిళలకు తన చేతనైన రీతిగా వైద్యం చేస్తూ సామాజిక ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారు. 78 ఏండ్ల వయసులోనూ ఇంకా చేయవలసినది ఇంకా ఎంతో ఉంటుందన్నారు. ఆమే డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి. వారి జీవన ప్రస్థానం వారి మాటల్లోనే...

మీ బాల్యం గురించి చెప్పండి?

కృష్ణాజిల్లా ఆత్కూరులో పుట్టాను. గూడపాటి వరలక్ష్మి, రామకోటయ్య మా తల్లిదండ్రులు. మేము ఐదుగురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలం. పెద్దమ్మకు పిల్లలు లేక నన్ను పెంచుకొన్నారు. ఏడాది వయసు నుండి పెంచి పెద్దచేసి, విద్యాబుద్ధులు నేర్పించిన పెద్దమ్మ పెదనాన్నలు అట్లూరి వెంకటలక్ష్మి విలాసం, అచ్యుతరామయ్యలు జీవితాంతం తోడుగా నిలిచారు. కృష్ణాజిల్లా ఉంగుటూరులో ప్రాథమిక విద్య నుండి హైస్కూల్ చదువు వరకు చదివాను. పి.యు.సి.సెయింట్ థెరిసా మహిళా కళాశాల, ఏలూరులోనూ, ఎం.బి.బి.ఎస్. ఆంధ్రామెడికల్ కాలేజీ, విశాఖపట్నంలోనూ చదివాను. హౌస్ సర్జెన్సీ హైదరాబాద్ ఉస్మానియా వైద్య కళాశాలలో చేశాను. ఎమ్మెస్. (గైనిక్) ప్రిన్స్ వేల్స్ వైద్య కళాశాల పాట్నాలో చేరి, 1970లో యూనివర్సిటీ ఫస్ట్ గా నిలిచాను.1971 నుండి ప్రాక్టీస్ మొదలుపెట్టాను. నా మేనమామ మురళీకృష్ణమూర్తితో నా పెండ్లి జరిపించారు. వారు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలోఫార్మసీ హెడ్‌గా పని చేశారు. తర్వాత ఇండస్ట్రీ పెట్టి నడిపారు. మాకు ఇద్దరు అమ్మాయిలు. డాక్టర్ సమీర గైనకాలజిస్ట్, ఆమె భర్త డాక్టర్ సి.ఎల్.వెంకటరావు సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్. రెండో కూతురు డాక్టర్ తుషార ఆప్తల్మాలజిస్ట్, ఆమె భర్త డా.వి.ఎస్.రామచంద్ర కార్డియాలజిస్ట్.

సాహిత్యం పట్ల ఆసక్తి ఎలా కలిగింది..?

ఆరు, ఏడు తరగతుల నుండి పుస్తకాలు చదివేదాన్ని. మా బాబాయి గ్రామ సర్పంచుగా ఉండేవారు. కనుక పంచాయతీ లైబ్రరీ పుస్తకాలు అందుబాటులో ఉండేవి. స్కూల్ లైబ్రరీలో కూడా మంచి పుస్తకాలు ఉండేవి. కనుక చిన్నతనం నుండి చదవడం ఒక వ్యసనం లాగా అయింది. 8వ తరగతిలో ఉండగా మహీధర రామ్మోహనరావుగారి కుమార్తె సర్వలక్ష్మి మాకు తెలుగు టీచర్‌గా వచ్చారు. స్కూల్ గ్రంథాలయ విభాగం వారు విద్యార్థులకు వారానికొక పుస్తకం ఇచ్చేవారు. సర్వలక్ష్మిగారు నా సాహిత్య ఆకలిని గమనించి నాకు గ్రంథాలయ పుస్తకాలను ఎక్కువగా అందజేసేవారు. అదేవిధంగా ఊర్లో ఎవరింట్లో పుస్తకాలు ఉన్నా వెళ్లి తెచ్చుకొని చదివేసి మళ్ళీ ఇచ్చేసేదానిని. పుస్తకాలు చదవడం వలన వ్యక్తిగత అభిరుచులు, ఆలోచనలూ, ప్రవర్తనలు తప్పనిసరిగా సానుకూలమైన దిశకు మరలుతాయి. నాకు కూడా అలాగే జరిగింది. తెలుగు సాహిత్యంతో పాటు హిందీ పరీక్షలు ప్రాథమిక నుండి, విశారద వరకు చదివాను. అందువల్ల హిందీ మాస్టారు, శ్రీ దత్తత్రేయ వర ప్రసాద్ సార్ చిన్న తరగతుల వారికి క్లాసులు తీసుకోమనేవారు. అంతేకాక ఆయన హిందీ సాహిత్యాన్ని నాకు చక్కగా విపులీకరించేవారు. హరివంశరాయబచ్చన్, మైథిలీ శరణగుప్త మొదలగు మంచికవుల కవిత్వాన్ని, సాహిత్యాన్ని చదవడం వలన తెలుగు సాహిత్యం మీద పట్టు ఏర్పడి, సానుకూల ప్రభావం పడింది.



మీరు ఆటల్లో కూడా ముందుండేవారని విన్నాము..?

అవును, హైస్కూల్‌లో ఉన్నప్పుడు సాయంత్రం చీకటి పడే వరకూ ఆటలు ఆడేదాన్ని. హైస్కూల్ నుండి టెన్నికాయిట్ ఛాంపియన్ని. జిల్లా గ్రిగ్ స్పోర్ట్స్ అండ్ గేంస్ మీట్‌లో కృష్ణా జిల్లా చాంపియన్. ఏలూరులో చదివేటప్పుడు కూడా పశ్చిమగోదావరిజిల్లా గ్రిగ్ స్పోర్ట్స్‌లో ఛాంపియన్. అదేవిధంగా వైజాగ్‌లో మెడికల్ కాలేజీలో చదివేటప్పుడు విశాఖ జిల్లా టెన్నికాయిట్ ఛాంపియన్ని. వరసగా మూడేండ్లు మూడు జిల్లాల్లో టెన్నికాయిట్ ఛాంపియన్‌గా నిలిచాను. స్పోర్ట్స్‌లో రన్నింగ్ విజేతను. ఆంధ్రా మెడికల్ కాలేజి స్పోర్ట్స్ చాంపియన్ని. ఇంటర్ మెడికల్, ఇంటర్కొలిజియేట్ గేంస్ అండ్ స్పోర్ట్స్ మీట్స్‌లో ఎన్నో కప్పుల్ని, పతకాల్ని గెలుచుకున్నాను

మీ సాహిత్య ప్రయాణం ఎలా కొనసాగింది?

పి.యు.సి. పరీక్షలు వ్రాసి రిజల్ట్ కోసం వేచి చూస్తున్న సమయంలో డా.పి. శ్రీదేవి రాసిన 'కాలాతీత వ్యక్తులు' చదివాను. ఆమె రచయిత్రి, డాక్టర్ కనుక ఆమెలాగా కావాలి అనేది లక్ష్యంగా పెట్టుకున్నాను. అంతవరకూ చదవడమే తప్ప రాయలేదు. అప్పుడే మొదటి కథ 'మలుపు'ను ఓ వీక్లీ పత్రిక నిర్వహించిన దీపావళి కథల పోటీకి పంపిస్తే తిరిగి వచ్చింది. వెంటనే దాన్ని మరో పత్రిక నిర్వహించిన దీపావళి కథల పోటీకి పంపగా కథకు స్పెషల్ బహుమతి వచ్చినట్టు టెలిగ్రామ్ వచ్చింది. స్నేహితులతో కలిసి హాస్టల్ కారిడార్‌లో చదువుతూ ఉండగా ఈ విషయం తెలిసి అందరిలో ఎంతో ఆనందం నిండింది. ఇంటర్ ఫస్టియర్‌లో ఉండగానే విశాఖ రచయితల సంఘం కార్యక్రమాలలో పాల్గొనగలిగాను. అప్పుడు రాచకొండ విశ్వనాథశాస్త్రి, ముప్పాళ రంగనాయకమ్మ, కారా మాస్టారు, బలివాడ కాంతారావు, అంగర వెంకటకృష్ణారావు వంటి మొదలగు మహా రచయితలు అందులో ఉండేవారు. సమావేశాలు చాలా రెగ్యులర్‌గా జరిగేవి. విశాఖ రచయితల సంఘం కార్యక్రమాలకు హాజరవడం కార్యక్రమాలకు హాజరవడం పెద్ద, పెద్ద రచయితల ప్రసంగాల్ని వినడం ఒక గొప్ప అవకాశంగా నేను భావిస్తాను. వారు వెలువరించిన 'విశాఖ' సాహితీ పత్రిక సంపాదకవర్గంలో నన్ను చేర్చారు. అది నాకు గర్వకారణమైంది. ఆ సమయంలో ఆరుద్ర, రామలక్ష్మి, ముళ్ళపూడి వెంకటరమణగార్ల తోటి పరిచయాలు చాలా గొప్పగా అనిపించేవి. భీమిలి మొదలగు వేరే ప్రాంతాలు కూడా తీసుకువెళ్ళేవారు. 2-3 సంవత్సరాలు చాలా రెగ్యులర్‌గా వెళ్ళేవాళ్ళం. నేనెందుకు రాశాను? వంటి అంశాలపై రాయించేవారు. క్లినికల్ వైపు రాగానే మేనమామతో వివాహం, ఏడాదిలో పాపాయి పుట్టడం జరిగింది.

వైద్య వృత్తి చేస్తూ రచనలు చేశారు. ఎలా సాధ్యం..?

ఆంధ్రజ్యోతి వీక్లీ సంపాదకులు పురాణం సుబ్రహ్మణ్యంశర్మగారు ఆయనే 'పేషంట్ చెప్పే కథలు' అనే శీర్షిక పెట్టి దాదాపుగా ఒక 25/30 కథలు రాయించారు. 1983లో సోవియట్ రష్యా పర్యటనకు వెళ్ళినప్పుడు ఆ కథలు రాయడానికి అంతరాయం కలిగింది. కాకినాడ వెళ్ళిన కొత్తలో 'వనిత'లో కథ అచ్చు అయ్యాక సాహితీరంగంలో తిరిగి చూసుకొనవలసిన అవసరం లేకపోయింది. ఆంధ్రజ్యోతి, వనిత సంపాదకులు అడిగి మరీ నా చేత కథలు ప్రత్యేక సంచికలకు రాయించే వారు. వారి ప్రోత్సాహం లేకుంటే ఏనాడో రచయిత్రిగా కనుమరుగయ్యేదాన్ని అనుకుంటాను.

మీరు తీసుకొచ్చిన పుస్తకాల గురించి చెబుతారా..?

'రీడర్స్ డైజెస్ట్' అనే ఆంగ్ల పత్రికలో మన శరీరంలోని సుమారు 15 వ్యవస్థల గురించిన పరిచయం ఇంగ్లీషులో ప్రచురించారు. "వనిత' పత్రికలో అదే నమూనాలో తెలుగులో రాసి ఇమ్మని అడిగారు. వాటినే 'మన దేహం కథ' పేరుతో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ పుస్తకంగా పబ్లిష్ చేసింది. చాలా ఏండ్లు మరల మరల ప్రచురించి పుస్తకానికి రాయల్టీ కూడా ఇచ్చేవారు. గర్భిణీ స్త్రీలకు సలహాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పడానికి సమయం లేక వారు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి 'మాతృత్వం' అను పేరుతో ఒక పుస్తకంగా రాశాను. మొదటిసారి నేనే ముద్రించుకున్నాను. తర్వాత విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారే ముద్రించేవారు. వృత్తిపరంగా చాలా బిజీగా ఉండేదాన్ని. ఓ.పీ పేషెంట్లను చూడడం, చిన్న చిన్న ప్రొసీజర్లు, మేజర్ సర్జరీలు అన్నిటితో ఊపిరి సలపని పని చేస్తున్నప్పుడే ఎక్కువ రచనలు చేసాను.



మహిళల కోసం మీరు చేసిన కార్యక్రమాలు..?

నాకు 50 ఏండ్లు వచ్చిన దగ్గర నుండీ నా సమయాన్నీ, ధనాన్నీ కూడా సమాజం కోసం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాను. అలాంటి ఉద్దేశాలు గల సంస్థల్లో పనిచేసేదాన్ని. స్లమ్ ఏరియాలలో ఉచితంగా హెల్త్ కాంపులు నిర్వహించి, ఉచితంగా మందులు ఇవ్వడం చేసేదాన్ని. 1982లో మా ప్రాంతంలోని మహిళలంతా కలసి 'చైతన్య వనితా మండలి'ని ఏర్పాటు చేసి దానికి నన్ను అధ్యక్షురాలిగా ఉండమని కోరారు. అప్పటి నుండి నేటిదాకా ఆ మండలి అధ్యక్షురాలిగా కొనసాగుతున్నాను. మహిళల కోసం మహిళలే కాకుండా మహిళల అభివృద్ధి సాధికారత కోరుకునే పురుషులను కూడా చేర్చుకుని 'సెంటర్ ఫర్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ అండ్ డెవెలప్‌మెంట్ ఆఫ్ ఉమెన్' అనే సంస్థను ప్రారంభించాం. మహిళల ఉన్నతి కోసం మహిళల సాధికారత పట్ల అందరం కలిసి అనేక కార్యక్రమాలు ఉద్యమరూపంలో చేసాం.



మీరు మహిళల కోసం ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వహిస్తున్నారు అని తెలిసింది. వివరాలు చెప్పండి..?

వైద్యం కోసం నా దగ్గరకు వచ్చే వయసు పైబడిన మహిళలను గమనించాను. కుటుంబంలో తాము ఎదుర్కొనే నిరాదరణను, పడే అవమానాల్ని, బాధలను ఎవరికీ చెప్పుకోలేరు, కుటుంబం లోపల ఉండలేరు, బయటకు రాలేరు. అలాంటి మానసిక వ్యథలతో కుంగిపోయే మహిళలకు ఉపశమనం, ఆశ్రయం కలిగిచడం కోసం రోటరీ క్లబ్ అధ్యక్షురాలిగా ఉన్న సమయంలో వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేయాలని పట్టుదలగా ప్రయత్నించాం. ముందుగా 'రోటరీ ఆశ్రయ' పేరుతో ఎనిమిది మంది వృద్ధ మహిళలతో మా ఆస్పత్రిలో వృద్ధాశ్రమాన్ని ప్రారంభించాం. తర్వాత కాలంలో వృద్ధాశ్రమం కోసం ప్రభుత్వ 1100 చదరపు గజాల స్థలం కేటాయించింది. అమెరికాలో ఉండే ముత్యాల సీత వారి తల్లి చుండ్రు సుబ్బాయమ్మ పేరిట 5 లక్షలు విరాళంగా ఇచ్చారు. దాంతో పాటు మరెంతోమంది సహృదయంతో ఇచ్చిన విరాళాలతో 'చుండ్రు సుబ్బాయమ్మ రోటరీ ఆశ్రయ' ఏర్పడింది. 40 మంది ఉండేందుకు సౌకర్యవంతంగా, చక్కటి వాతావరణంలో ఏర్పాటు చేసిన ఆశ్రయ 22 ఏండ్లుగా నిరాటంకంగా నడుస్తుంది.

మీ భవిష్యత్ ప్రణాళిక..?

'సర్వైకల్ క్యాన్సర్ ముక్తభారత్' నినాదంతో జాతీయస్థాయి గైనిక్ అసోసియేషన్ వారి పిలుపు మేరకు పేద మహిళలకు సర్వికల్ కేన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ గురించి అవగాహన కలిగించి ఆవ్యాధుల నివారణకు కృషి చెయ్యాలని అనుకుంటున్నాను. కౌమార బాల్యం, ముఖ్యంగా బాలికలకు న్యూట్రిషన్, హైజీన్, లైంగిక హింస, పునరుత్పత్తి, లైంగిక ఆరోగ్యం మొదలైన అంశాలపై అవగాహన కలిగించేందుకు పుస్తకాల్ని రాయాలని అనుకుంటున్నాను.

పుట్ట పాడులో ఎన్‌కౌంటర్

నవతెలంగాణ-చర్ల

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. ఈ సంఘటన చత్తీస్‌గఢ్‌లోని ఎర్రంపాడు పరిధి పుట్టపాడు అడవుల్లో ఆదివారం జరిగింది. నిషేధిత సీపీఐ(మావోయిస్టు) చెందిన ఒక యాక్షన్ టీం పోలీసులపై దాడి చేయాలనే లక్ష్యంతో సంచరిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో పోలీసులు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. పోలీసులపై ఆదివారం ఉదయం కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలో పుట్టపాడు అటవీ ప్రాంతంలో సుమారుగా 6.10 గంటలకు అకస్మాత్తుగా ఒక ఎత్తైన ప్రదేశం నుంచి మావోయిస్టులు కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు తిరిగి ఎదురు కాల్పులు జరిపారు. కొన్ని నిమిషాల పాటు మావోయిస్టులు, పోలీసులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. అనంతరం ఆ ప్రదేశంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా రెండు మృతదేహాలు, ఒక ఎస్ఎల్ఆర్ ఆయుధం, ఒక సింగల్ బోర్ తుపాకీ ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మృతిచెందిన వారిలో.. ఒకరు చర్ల ఎల్ఓఎస్ కమాండర్ మడకం ఎర్రయ్య రాజేష్‌గా గుర్తించారు. మరొకరి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ఇంకా కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతుందని ఎస్పీ తెలిపారు.

పుట్టపాడు ఎన్‌కౌంటర్ బూటకం : మావోయిస్టు నేత ఆజాద్

నిరాధాయుడైన రాజేష్‌ను బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని అల్లూరి సీతారామరాజు, భద్రాద్రి కొత్తగూడెం డివిజన్ మావోయిస్టు పార్టీ కార్యదర్శి ఆజాద్ తెలిపారు. ఆ మేరకు ఆదివారం ఆయన ఓ లేఖ విడుదల చేశారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు పుట్టపాడు అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగిందని ఇందులో కమాండర్ రాజేష్, మరో దళ సభ్యుడు చనిపోయారని, ఒక ఎస్ఎల్ఆర్ తుపాకి దొరికిందని పోలీసులు చెబుతున్న విషయాలు బూటకమని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు.. ఈ ఎన్‌కౌంటర్‌ను ఖండించాలని సూచించారు. కామ్రేడ్ రాజేష్ పార్టీ పనుల రీత్యా నిరాయుధంగా ఒకరే పుట్టపాడు గ్రామానికి వెళ్ళారు. ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో పట్టుకొని, చిత్రహింసలు పెట్టి కాల్చిచంపి, ఇది నిజమైన ఎన్‌కౌంటర్ అని నమ్మించడానికి తమతో పాటు తెచ్చుకున్న ఎస్ఎల్ఆర్ తుపాకీని పెట్టారని తెలిపారు. అదేవిధంగా పుట్టపాడు గ్రామానికి చెందిన నందాల్ అనే అమాయక ఆదివాసీని కూడా కాల్చి హత్య చేసారని తెలిపారు. ఇది పోలీసులు పిరికిపంథా చర్య అని విమర్శించారు. కాగా, ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా కంగాల్ గ్రామంలోని ఆదివాసీ మడకం కటుంబంలో రాజేశ్(26) జన్మించినట్టు తెలిపారు. అతని 19వ యేటా విప్లవోద్యమంలో చేరి 2016 నుంచి 2022 అక్టోబర్ వరకు చర్ల ఎల్ఓఎస్ సభ్యునిగా, 2022 అక్టోబర్లో చర్ల ఎల్ఓఎస్ కమాండర్‌గా ప్రమోట్ అయి సేవలందిస్తున్నాడు. వీరి హత్యకు బీఆర్ఎస్ పార్టీ లీడర్లు, ఎస్పీ వినిత్, డీఎస్పీ సత్యనారయణ, సీఐ ఆశోక్ ఈ హత్యకు పూర్తి బాధ్యత వహించాలని తెలిపారు.

బ్రిజ్ భూషణ్ ను జైలుకు పంపండి

(మొదటిపేజీ తరువాయి)

పంజాబ్ నుంచి వచ్చిన రైతులను ఢిల్లీ సరిహద్దుల వద్ద పోలీసులు అడ్డుకున్నారు. రైతులు ఢిల్లీలోకి ప్రవేశించకుండా టిక్రీ సరిహద్దు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులను నెట్టుకుంటూ రైతులు, మహిళ రైతులు ఢిల్లీలోకి ప్రవేశించారు. ఢిల్లీ పోలీసులు కొంతమంది ఖాప్ నాయకులను వారి ప్రయివేట్ వాహనాల్లో ఢిల్లీ

సరిహద్దుల నుంచి జంతర్ మంతర్ వరకు ప్రయాణించడానికి అనుమతించారు. అయితే, ఖాప్ నేతలను ట్రాక్టర్లపై దేశ రాజధానిలోకి అనుమతించలేదు. ఖాప్ పంచాయతీ అధ్యక్షుడు పాలం చౌదరి సురేందర్ సోలంకి మాట్లాడుతూ మహిళా రెజ్లర్లకు న్యాయం జరిగే వరకు నిరసన కొనసాగుతుందన్నారు. ఈ నిరసన కార్యక్రమాలను ఏ విధంగా మరింత ముందుకు తీసుకెళ్లాలో త్వరలోనే నిర్ణయిస్తామని చెప్పారు. ఖాప్ అధ్యక్షుడు బల్వంత్ ఫోగట్ మాట్లాడుతూ న్యాయం కోసం పోరాటంలో మల్లయోధులకు మద్దతు ఇవ్వడానికి వివిధ ఖాప్‌ల నాయకులు నిరసన ప్రదేశంలో సమావేశమయ్యామని అన్నారు. "ఈ ముఖ్యమైన విషయంలో మా తదుపరి చర్యల గురించి చర్చించడానికి మేం సమావేశాన్ని నిర్వహిస్తున్నాం" అని ఆయన చెప్పారు.

ఢిల్లీ పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. అన్ని ఎంట్రీ పాయింట్ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. దాదాపు 300 మంది పోలీసులను, పారామిలటరీ సిబ్బందిని సింఘూ సరిహద్దులో మోహరించారు. ఔటర్ ఢిల్లీలో 200 మంది పోలీసులను మోహరించారు. బహదూర్‌ఘర్ (హర్యానా)కి అనుసంధానించే టిక్రీ సరిహద్దు వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. అన్ని వాహనాలను ఫరీదాబాద్-ఢిల్లీ సరిహద్దు, ఘజియాబాద్-ఢిల్లీ సరిహద్దు వద్ద కూడా నిలిపివేశారు. ఢిల్లీ పోలీసులు ట్రాక్టర్, ట్రాలీలు సరిహద్దు నుంచి దేశ రాజధానిలోకి ప్రవేశించడానికి అనుమతించలేదు. పోలీసులు అనేక వరుసల బారికేడ్లను ఏర్పాటు చేశారు.

రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ)కి అనుబంధంగా ఉన్న హర్యానా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ (హెచ్ఏడబ్ల్యూఏ) ముగ్గురు సభ్యులను సస్పెండ్ చేసింది. డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్‌కు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో పాల్గొన్నందుకు ఝజ్జర్, హిసార్, మేవాత్ జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున సస్పెండ్ చేసింది. ఝజ్జర్‌లో వీరేందర్ సింగ్ దలాల్, హిసార్‌లో సంజయ్ సింగ్ మాలిక్ , మేవాత్‌లో జై భగవాన్ అనే ముగ్గురు సభ్యులను సస్పెండ్ చేస్తూ హెచ్ఏడబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్షుడు రోహతాస్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.

బ్రిజ్ భూషణ్‌పై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ఏర్పాటైన కమిటీ నివేదికను బయటపెట్టడంలో ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని రెజ్లర్లు ఆరోపిస్తున్నారు. ఆయన తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దర్యాప్తు జరుగుతున్నప్పటికీ డబ్ల్యూఎఫ్ఐ తన కార్యకలాపాలను పున్ణప్రారంభించడం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నారు.

సుప్రీం మాజీ న్యాయమూర్తితో ఉన్నత స్థాయి విచారణ జరపాలి : ఏఐకేఎస్ ఉపాధ్యక్షుడు హన్నన్ మొల్లా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీజేపీ ఎంపీ, డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేసి, జైలుకు పంపాలని ఏఐకేఎస్ ఉపాధ్యక్షుడు హన్నన్ మొల్లా డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు జంతర్ మంతర్ వద్ద మల్లయోధుల ఉద్యమానికి మద్దతు తెలిపారని ఎస్కేఎం తెలిపింది. ఎస్కేఎం నాయకులు దర్శన్‌పాల్, హన్నన్ మొల్లా, యుధ్‌బీర్ సింగ్, రాకేశ్ తికాయిత్, ఉగ్రహాన్, ఆశిస్ మిట్టల్, ప్రేమ్‌సింగ్, ఇంద్రజీత్ సింగ్, కృష్ణప్రసాద్ పాల్గొన్నారని పేర్కొంది. ఈ మేరకు ఎస్కేఎం ప్రకటన విడుదల చేసింది. రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మెన్, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై లైంగిక నేరాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న మా సోదరీమణులు, సోదరులకు తమ పూర్తి మద్దతును ప్రకటించారని తెలిపింది. ఖాప్ పంచాయతీలు కూడా పెద్ద సంఖ్యలో రెజ్లర్లకు మద్దతుగా నిలిచాయని పేర్కొంది. ఈ సందర్భంగా ఎస్కేఎం తరపున హన్నన్ మొల్లా మల్లయోధులకు మద్దతు ప్రకటించారు. నేరస్థుడైన ఎంపీని వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు.

డబ్ల్యూఎఫ్ఐ చైర్మెన్ పదవి నుంచి ఆయనను తొలగించాలని అన్నారు.. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో ఉన్నత స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బ్రిజ్ భూషణ్ నేరగాళ్ల వల్ల రెజ్లర్ల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నందున వారికి ప్రభుత్వం పూర్తి భద్రత కల్పించాలని కోరారు. బ్రిజ్ భూషణ్, కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మలను దహనం చేసేందుకు పిలుపు ఇచ్చామని అన్నారు. నేరస్తులకు శిక్ష పడే వరకు తాము రెజ్లర్లకు అండగా ఉంటామని ప్రకటించారు.

అప్పుల ఊబిలో కర్నాటక

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేసింది.

ఆర్‌బీఐ క్రోడీకరించిన రాష్ట్రాల బడ్జెట్ల సమాచారం ప్రకారం ఈ సంవత్సరం మార్చి నాటికి కర్నాటక అప్పుల భారం రూ. 5.35 లక్షల కోట్లకు చేరింది. 2018లో ఈ అప్పులు కేవలం రూ. 2.46 కోట్లు మాత్రమే. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రతి ఓటరు తల పైనా 1,02,107 రూపాయల రుణ భారం పడుతోంది. గత ఐదేండ్లలో తలసరి అప్పు 106 శాతం పెరగడం (2018లో ఇది రూ. 49,505 మాత్రమే) ఆందోళన కలిగిస్తోంది. నూతన రంగాలలో పెట్టుబడుల కోసం అప్పులు చేయక తప్పదని పాలక పక్షాలు వాదిస్తుంటాయి. 2017లో కేంద్రం జీఎస్‌టీ విధించిన తర్వాత రాష్ట్రాలకు కేంద్ర సాయం తగ్గిపోయింది. రుణాలు సైతం అందడం లేదు. ఇలాంటి పరిస్థితులలో అప్పులు అనివార్యమని రాష్ట్రాలు చెబుతున్నాయి. ఇందులో కొంత వాస్తవం లేకపోలేదు. పైగా కోవిడ్ అనంతర పరిస్థితులను ఎదుర్కోవడానికి పెడుతున్న ఖర్చులో రాష్ట్రాలే ఎక్కువగా భరించాల్సి వస్తోంది. అయినప్పటికీ సామాజిక రంగాలపై ప్రభుత్వాలు తగినంత మొత్తాన్ని ఖర్చు చేయాల్సిన అవసరం ఉంది.

అయితే కర్నాటకలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. 2022-23 బడ్జెట్‌లో కర్నాటకలోని డబుల్ ఇంజన్ ప్రభుత్వం మొత్తం వ్యయంలో విద్యపై కేవలం 12 శాతం మాత్రమే ఖర్చు చేస్తానని ప్రతిపాదించింది. దేశంలోని ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు సగటున విద్యకు కేటాయించిన 13.6 శాతంతో పోలిస్తే ఇది తక్కువే. అదే విధంగా వైద్యం, ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమం పద్దుకు కేటాయించింది 5.4 శాతమే. ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఈ రంగానికి సగటున కేటాయించిన 5.7 శాతం నిధులతో పోల్చినా కూడా ఇది తక్కువే.

వాస్తవానికి విద్యా రంగంపై 2019-20లో కర్నాటక ప్రభుత్వం 12.4 శాతం ఖర్చు చేయగా 2022-23 నాటికి అది 12 శాతానికి తగ్గిపోయింది. వైద్యం, ప్రజారోగ్యంపై 2019-20లో 4.1 శాతం ఖర్చు చేయగా కోవిడ్ అనంతరం ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా 2021-22 (సవరించిన అంచనాలు)లో 5.8 శాతం ఖర్చు చేశారు. అయితే ఆ తర్వాత ఈ రంగంపై వ్యయం తగ్గుతూ వచ్చింది. 2022-23లో 5.4 శాతం మాత్రమే ఖర్చు చేశారు.

బీజేపీ ప్రభుత్వం రుణాల ద్వారా సమీకరించిన వనరులను ప్రజా సంక్షేమానికి వెచ్చించడంలో విఫలమైంది. 2020-21లో రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో (జీఎస్‌డీపీ) అభివృద్ధి వ్యయం 9.4 శాతం ఉండగా 2021-22 నాటికి 8 శాతానికి, 2022-23 బడ్జెట్ అంచనాలలో 7.6 శాతానికి తగ్గింది. అదేవిధంగా 2020-21లో సామాజిక రంగంపై జీఎస్‌డీపీలో ఐదు శాతం ఖర్చు చేయగా అది 2021-22లో 4.9 శాతానికి, 2022-23లో 4.5 శాతానికి తగ్గింది.

దీనిని బట్టి అర్థమవుతోంది ఏమంటే బీజేపీ పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలు అప్పుల ద్వారా వనరులు సమీకరిస్తాయి. ముఖ్యంగా వాణిజ్య లేదా మార్కెట్ నుంచి రుణాలు పొందుతాయి. కానీ విద్య, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం వంటి ప్రజా సంక్షేమ చర్యల కోసం మాత్రం నిధులు విదల్చవు. బహుశా ఈ రుణాలను మూలధనపు వ్యయం కోసం ఉపయోగిస్తూ ఉండవచ్చు. అంటే మౌలిక సదుపాయాల కల్పన వంటి పద్దుల కోసం వ్యయం చేయవచ్చు. అయితే అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఈ వ్యయం కూడా సరిగా ఉండడం లేదు. 2020-21లో జీఎస్‌డీపీలో మూలధనపు వ్యయం కోసం 2.6 శాతం కేటాయించగా 2021-22లో 1.9 శాతానికి తగ్గిపోయింది. 2022-23లో కూడా బడ్జెట్ అంచనాలు అదే విధంగా ఉన్నాయి. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఈ కేటాయింపు చాలా తక్కువ.

ఒక్క మాటలో చెప్పాలంటే ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో పోలిస్తే కర్నాటకలో వివిధ రంగాలకు బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కేటాయింపులు చాలా తక్కువగా ఉంటున్నాయి. అభివృద్ధి వ్యయం కోసం ఇతర ప్రాంతాలు 12.5 శాతం కేటాయిస్తే కర్నాటక కేవలం 7.6 శాతం, సామాజిక రంగానికి ఇతర ప్రాంతాలు 8.4 శాతం కేటాయిస్తే కర్నాటక 4.5 శాతం, మూలధనపు వ్యయానికి ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు 2.9 శాతం కేటాయిస్తే కర్నాటక 1.9 శాతం మాత్రమే కేటాయించింది.

కర్నాటకలో సంక్షేమ రంగాలకు బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అరకొర కేటాయింపుల కారణంగా సామాన్య ప్రజానీకానికి పెద్దగా ఒరిగిందేమీ లేదు. దీనితో పాటు ప్రభుత్వంలో అవినీతి పెచ్చరిల్లిపోయిందన్న విమర్శల జడివానలో బసవరాజ్ బొమ్మై ప్రభుత్వం తడిసి ముద్దవుతోంది. వీటన్నింటి నడుమ కర్నాటక ప్రజలు ఇచ్చే తీర్పు కోసం దేశమంతా ఆసక్తిగా ఎదురు చూస్తోంది.

గుజరాత్‌లో 41 వేల మంది మహిళల అదృశ్యం

(మొదటిపేజీ తరువాయి)

4,722 మంది మహిళలు కన్పించకుండా పోయారు. రాష్ట్రానికి చెందిన బాలికలు, మహిళలను తరచుగా ఇతర రాష్ట్రాలకు పంపి వ్యభిచారంలోకి దింపుతున్నారని గుజరాత్ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు సుధీర్ సిన్హా చెప్పారు. మిస్సింగ్ కేసులు హత్య కేసుల కంటే తీవ్రమైనవని ఆయన తెలిపారు. పోలీసులు ఈ కేసుల విచారణను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. బాలికలు అదృశ్యం కావడానికి మానవ అక్రమ రవాణాయే కారణమని రాష్ట్ర మాజీ అదనపు డీజీపీ డాక్టర్ రాజన్ ప్రియదర్శి తెలిపారు. మహిళల అదృశ్యంపై గుజరాత్ కాంగ్రెస్ ప్రతినిధి హిరేన్ బంకర్ మాట్లాడుతూ 'కేరళ మహిళల గురించి బీజేపీ నేతలు మాట్లాడుతుంటారు. కానీ గుజరాత్‌లో 40 వేల మందికి పైగా కన్పించకుండా పోతే పెదవి విప్పరు. పైగా ఇది దేశ ప్రధాని, హోం మంత్రి సొంత రాష్ట్రం' అని ఎద్దేవా చేశారు.

ఓటమి భయంతో బీజేపీ నాయకుల బెదిరింపులు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

కర్నాటకలో ఓటమి భయంతో కాంగ్రెస్ నాయకులను చంపుతామని బెదిరిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మణికంఠ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కోరారు. ఆదివారం కాంగ్రెస్ నాయకులు సంపత్ కుమార్, అంజన్ కుమార్ యాదవ్ ఇతర నాయకులతో కలిసి ఆయన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మణికంఠ్‌పై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అందుకు సంబంధించిన ఆడియో టేప్‌ను ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డికి అందజేశారు. అనంతరం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కర్నాటకలో ఓటమి భయంతో చిత్తాపూర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మణికంఠ బహిరంగంగా చిత్తాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంక ఖర్గేను, వారి తండ్రి మల్లికార్జున ఖర్గేను, వారి కుటుంబ సభ్యులను చంపుతానని బెదిరించారని తెలిపారు. దాంతో అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ గెలుస్తుందని, అందుకు ఉదాహరణ ఇటీవల హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ విజయం అన్నారు. ఇప్పుడు కర్నాటకలో కూడా కాంగ్రెస్ గెలుస్తుందని, అలాగే తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

జనగణన జరిగేనా ?

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుతం అందుబాటులో లేదు. ఎందుకంటే పేదల సంఖ్యపై గత దశాబ్ద కాలంలో ప్రభుత్వం ఎలాంటి గణాంకాలు విడుదల చేయలేదు. కానీ నరేంద్ర మోడీ పాలనలో దేశంలో పేదరికం గణనీయంగా తగ్గిపోయిందన్న ప్రచారం మాత్రం నిరంతరాయంగా సాగుతూనే ఉంది. ప్రపంచబ్యాంక్ పరిశోధకులు విడుదల చేసిన పత్రం ప్రకారం 2019లో పేదరిక రేటు 10.2 శాతంగా ఉంది.పెద్ద నోట్ల రద్దు సమయంలో పట్టణ పేదరికం రెండు శాతం పెరిగింది. దేశంలో పేదరికం అంగీకారయోగ్యం కాని స్థాయిలో పెరిగిందని, కోవిడ్ మహమ్మారి కారణంగా పరిస్థితి మరింత దారుణంగా మారిందని కొన్ని సర్వేలు తెలిపాయి. పేదరిక సమాచారమే లేకుంటే పేదరికం ఎక్కడ ఉంటుందని అధికారంలో ఉన్న కొందరు పెద్దలు వితంతవాదం చేస్తున్నారు. అయితే జనగణన జరిగిన తర్వాత వీరి వాదనలో పసలేదని తెలిపోతుంది.

గిల్, సాహా దూకుడు



- ప్లే ఆఫ్స్‌లో గుజరాత్ టైటాన్స్ అడుగు
- ఛేదనలో క్వింటన్ డికాక్ పోరాటం వృథా
- లక్నో సూపర్‌జెయింట్స్‌పై భారీ విజయం

పాండ్య సోదరుల సమరంలో హార్దిక్ పాండ్య పైచేయి సాధించాడు. లక్నో సూపర్‌జెయింట్స్‌పై తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన గుజరాత్ టైటాన్స్ 56 పరుగుల తేడాతో భారీ విజయం నమోదు చేసింది. ఈ విజయంతో 16 పాయింట్లు ఖాతాలో వేసుకున్న గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్16 ప్లే ఆఫ్స్‌కు చేరుకున్న తొలి జట్టుగా నిలిచింది. తొలుత గుజరాత్ టైటాన్స్ 227 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఛేదనలో లక్నో సూపర్‌జెయింట్స్ 171 పరుగులకే పరిమితమైంది. ఐపీఎల్‌లో లక్నో సూపర్‌జెయింట్స్‌తో ఆడిన నాలుగు మ్యాచుల్లో గుజరాత్ టైటాన్స్ విజయాలు సాధించటం విశేషం.

నవతెలంగాణ-అహ్మదాబాద్

గుజరాత్ టైటాన్స్ అడుగు పెట్టింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2023 ప్లే ఆఫ్స్‌లో అధికారికంగా కాలుమోపింది. ఆదివారం లక్నో సూపర్‌జెయింట్స్‌పై 56 పరుగుల తేడాతో ఎదురులేని విజయం నమోద చేసిన గుజరాత్ టైటాన్స్.. సీజన్లో ఎనిమిదో గెలుపుతో ప్లే ఆఫ్స్‌లో చోటు ఖాయం చేసుకుంది. శుభ్‌మన్ గిల్ (94 నాటౌట్, 51 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్స్‌లు), వృద్ధిమాన్ సాహా (81, 43 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) ధనాధన్ అర్ధ సెంచరీలతో చెలరేగారు. ఓపెనర్లు విజృంభించిన వేళ గుజరాత్ టైటాన్స్ తొలుత భారీ స్కోరు నమోదు చేసింది. 20 ఓవర్లలో 2 వికెట్లకు 227 పరుగులు సాధించింది. భారీ ఛేదనలో లక్నో సూపర్‌జెయింట్స్ చతికిల పడింది. క్వింటన్ డికాక్ (70, 41 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) పోరాడినా ఫలితం దక్కలేదు. 20 ఓవర్లలో 7 వికెట్లకు లక్నో సూపర్‌జెయింట్స్ 171 పరుగులే చేసింది. 56 పరుగుల భారీ వ్యత్యాసంతో గుజరాత్ టైటాన్స్ ఏకపక్ష విజయం నమోదు చేసింది. అజేయ అర్ధ సెంచరీతో దంచికొట్టిన దంచికొట్టిన శుభ్‌మన్ గిల్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. 11 మ్యాచుల్లో గుజరాత్ టైటాన్స్‌కు ఇది ఎనిమిదో విజయం కాగా, 11 మ్యాచుల్లో లక్నో సూపర్‌జెయింట్స్‌కు ఇది ఐదో పరాజయం. పాయింట్ల పట్టికలో గుజరాత్ టైటాన్స్ (16) అగ్రస్థానంలో నిలువగా, లక్నో సూపర్‌జెయింట్స్ (11) మూడో స్థానంలో కొనసాగుతుంది.

ఛేదనలో చతికిల :

లక్నో సూపర్‌జెయింట్స్ లక్ష్యం 228 పరుగులు. ఈ సీజన్లోనే అత్యధిక స్కోరు సాధించిన రికార్డు ఆ జట్టు సొంతం. తొలి పది ఓవర్లలో లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్ లక్ష్యం దిశగా సాగింది. కానీ చివరి పది ఓవర్లలో లక్నో ఇన్నింగ్స్ గతి తప్పింది. ఫలితంగా ఆ జట్టు 56 పరుగుల తేడాతో భారీ పరాజయం పాలైంది. ఓపెనర్లు కైల్ మేయర్స్ (48, 32 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), క్వింటన్ డికాక్ (70, 41 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ ఆరంభాన్ని అందించారు. పవర్‌ప్లేలో లక్నో వికెట్ నష్టపోకుండా 72 పరుగులు పిండుకుంది. 24 బంతుల్లోనే 50 పరుగుల భాగస్వామ్యం జోడించిన మేయర్స్, డికాక్.. టైటాన్స్ బౌలర్లకు సవాల్ విసిరారు. ఏడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 31 బంతుల్లో క్వింటన్ డికాక్ అర్ధ సెంచరీ నమోదు చేశాడు. అర్ధ సెంచరీ ముంగిట కైల్ మేయర్స్ నిష్క్రమణతో లక్నో తడబాటు మొదలైంది. దీపక్ హుడా (11), మార్కస్ స్టోయినిస్ (4), నికోలస్ పూరన్ (3), కెప్టెన్ కృనాల్ పాండ్య (0) ఒత్తిడికి చిత్తయ్యారు. ఆయుశ్ బదాని (21, 11 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) ఒక్కడే మిడిల్ ఆర్డర్‌లో చెప్పుకోదగిన ప్రదర్శన చేశాడు. మేయర్స్ డగౌట్‌కు చేరుకున్నాక.. లక్నో సూపర్‌జెయింట్స్ మానసికంగా ఓటమికి సిద్ధపడింది. 20 ఓవర్లలో 7 వికెట్లకు ఆ జట్టు 171 పరుగులే చేసింది. గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో మోహిత్ శర్మ (4/29) నాలుగు వికెట్లతో రాణించాడు. మహ్మద్ షమి, రషీద్ ఖాన్, నూర్ అహ్మద్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

గిల్, సాహా ఉతికేశారు :

టాస్ నెగ్గిన లక్నో సూపర్‌జెయింట్స్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. సొంతగడ్డపై తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన గుజరాత్ టైటాన్స్‌కు ఓపెనర్లు బ్యాంగ్‌బ్యాంగ్ అందించారు. సీనియర్ ఓపెనర్ వృద్ధిమాన్ సాహా (81, 43 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లు), యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (94 నాటౌట్, 51 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. పవర్‌ప్లేలో వృద్ధిమాన్ సాహా లక్నో బౌలర్లను ఊచకోత కోశాడు. సాహా విధ్వంసక విన్యాసంతో తొలి ఆరు ఓవర్లలోనే టైటాన్స్ 78 పరుగులు పిండుకుంది. ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 20 బంతుల్లోనే సాహా అర్ధ సెంచరీ మార్క్ అందుకున్నాడు. మరో ఎండ్‌లో గిల్ భిన్నమైన ఆటతీరు కనబరిచాడు. నాలుగు సిక్సర్లతో 29 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు. సహజంగా బౌండరీలు ఎక్కువగా సాధించే గిల్.. లక్నోపై సిక్సర్ల వర్షం కురిపించాడు. తొలి వికెట్‌కు సాహా, గిల్ జోడీ 142 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పింది. కెప్టెన్ హార్దిక్ పాండ్య (25, 15 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు), డెవిడ్ మిల్లర్ (21 నాటౌట్, 12 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. ఓ ఎండ్‌లో గిల్ ఏడు సిక్సర్లతో అజేయంగా 94 పరుగులు సాధించాడు. గిల్ మెరుపులతో గుజరాత్ టైటాన్స్ 227 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్నో సూపర్‌జెయింట్స్ ఎనిమిది మంది బౌలర్లను ప్రయోగించినా ప్రయోజనం దక్కలేదు. మోహ్సిన్ ఖాన్, అవేశ్ ఖాన్‌లు చెరో వికెట్ ఖాతాలో వేసుకున్నారు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ చేతిలో లక్నో సూపర్‌జెయింట్స్‌కు ఇది వరుసగా నాల్గో పరాజయం.



స్కోరు వివరాలు :

గుజరాత్ టైటాన్స్ : వృద్ధిమాన్ సాహా (సి) ప్రేరక్ మన్కడ్ (బి) అవేశ్ ఖాన్ 81, శుభ్‌మన్ గిల్ నాటౌట్ 94, హార్దిక్ పాండ్య (సి) కృనాల్ పాండ్య (బి) మోహ్సిన్ ఖాన్ 25, డెవిడ్ మిల్లర్ నాటౌట్ 21, ఎక్స్‌ట్రాలు : 6, **మొత్తం : (20 ఓవర్లలో 2 వికెట్లకు) 227.**

వికెట్ల పతనం : 1-142, 2-184.

బౌలింగ్ : మోహ్సిన్ ఖాన్ 3-0-42-1, అవేశ్ ఖాన్ 4-0-34-1, కృనాల్ పాండ్య 4-0-38-0, యశ్ ఠాకూర్ 4-0-48-0, రవి బిష్ణోయ్ 2-0-21-0, కైల్ మేయర్స్ 1-0-16-0, స్వప్నిల్ సింగ్ 1-0-7-0, మార్కస్ స్టోయినిస్ 1-0-20-0.

లక్నో సూపర్‌జెయింట్స్ : కైల్ మేయర్స్ (సి) రషీద్ ఖాన్ (బి) మోహిత్ శర్మ 48, క్వింటన్ డికాక్ (బి) రషీద్ ఖాన్ 70, దీపక్ హుడా (సి) రాహుల్ తెవాటియ (బి) మహ్మద్ షమి 11, మార్కస్ స్టోయినిస్ (సి) మహ్మద్ షమి (బి) మోహిత్ శర్మ 4, నికోలస్ పూరన్ (సి) మహ్మద్ షమి (బి) నూర్ అహ్మద్ 3, ఆయుశ్ బదాని (సి) నూర్ అహ్మద్ (బి) మోహిత్ శర్మ 21, స్వప్నిల్ సింగ్ నాటౌట్ 2, కృనాల్ పాండ్య (సి) డెవిడ్ మిల్లర్ (బి) మోహిత్ శర్మ 0, రవి బిష్ణోయ్ నాటౌట్ 4, ఎక్స్‌ట్రాలు : 8, **మొత్తం :(20 ఓవర్లలో 7 వికెట్లకు) 171.**

వికెట్ల పతనం : 1-88, 2-114, 3-130, 4-140, 5-153, 6-166, 7-166.

బౌలింగ్ : మహ్మద్ షమి 4-0-37-1, హార్దిక్ పాండ్య 3-0-37-0, రషీద్ ఖాన్ 4-0-34-1, నూర్ అహ్మద్ 4-0-26-1, మోహిత్ శర్మ 4-0-29-4, అల్జారీ జొసెఫ్ 1-0-5-0.

సోదరుల సమరం



అన్నదమ్ములు కలిసి ఒకే జట్టుకు ఆడటం, ప్రత్యర్థి జట్ల తరఫున ప్రాతినిథ్యం వహించటం ఇప్పటి వరకు మనం చూశాం. ఇర్ఫాన పఠాన్, యూసుఫ్ పఠాన్, మైకల్ హస్సీ, డెవిడ్ హస్సీ, టామ్ కరణ్, శామ్ కరణ్, షాన్ మార్ష్, మిచెల్ మార్ష్, అల్బీ మోర్కెల్, మోర్నీ మోర్కెల్, దీపక్ చాహర్, రాహుల్ చాహర్, బ్రెండన్ మెక్‌కలమ్, నాథన్ మెక్‌కలమ్, డ్వేన్ బ్రావో, డారెన్ బ్రావో, మార్కో జాన్సెన్, డ్వాన్ జాన్సెన్.. ఇలా ఎందరో అన్నదమ్ములు ఐపీఎల్‌లో కలిసి, ఒకరితో ఒకరు పోటీపడ్డారు. కానీ ఐపీఎల్ చరిత్రలో తొలిసారి రెండు జట్లకు సోదరులు సారథ్యం వహించి ముఖాముఖి తలపడ్డారు. గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్‌జెయింట్స్ మ్యాచ్‌లో ఇది చోటు చేసుకుంది. హార్దిక్ పాండ్య టైటాన్స్‌కు, కృనాల్ పాండ్య సూపర్‌జెయింట్స్‌కు కెప్టెన్సీ వహించారు. ' మా కల నిజమైంది. హార్దిక్, నేను మా జట్లకు సారథ్యం వహిస్తున్నాం. మా కుటుంబానికి ఇది భావోద్వేగ రోజు. మా నాన్న కచ్చితంగా గర్వపడతారు. ఇలా రెండు జట్లకు సోదరులు సారథ్యం వహించటం ఇదే ప్రథమం. మాటలు రావట్లేదు. కానీ మా కుటుంబం గర్వపడుతుంది' అని పాండ్య సోదరులు భావోద్వేగం పంచుకున్నారు.



బట్లర్ బాదేశాడు

- 59 బంతుల్లో 95 పరుగులు
- సంజు శాంసన్ ధనాధన్
- రాజస్థాన్ రాయల్స్ 214/2

నవతెలంగాణ-జైపూర్ :

ముంబయి ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్ చేతిలో వరుస పరాజయాలు చవిచూసిన రాజస్థాన్ రాయల్స్.. మానసికంగా బలహీనంగా ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై దండయాత్ర చేసింది. పరుగుల వేటలో నెమ్మదించిన జోశ్ బట్లర్, సంజు శాంసన్ సైతం సన్‌రైజర్స్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ధనాధన్ ఇన్నింగ్స్‌లో ఫామ్ అందుకున్నారు. 10 ఫోర్లు, 4 సిక్సర్లతో 59 బంతుల్లోనే 95 పరుగులు చేసిన జోశ్ బట్లర్ రాజస్థాన్ రాయల్స్‌కు భారీ స్కోరు అందించాడు. కెప్టెన్ సంజు శాంసన్ (66 నాటౌట్, 38 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ అర్ధ సెంచరీతో విరుచుకుపడ్డాడు. జోశ్ బట్లర్, సంజు శాంసన్ విశ్వరూపంతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లలో 2 వికెట్లకు 214 పరుగుల భారీ స్కోరు చేసింది.

బట్లర్ మెరుపులు : టాస్ నెగ్గిన రాజస్థాన్ రాయల్స్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఆరంభం నుంచే ఎదురుదాడికి వెళ్లి గత రెండు మ్యాచుల్లో దెబ్బతిన రాజస్థాన్ రాయల్స్.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై పంథా మార్చుకోలేదు. టాప్ ఆర్డర్‌లో ముగ్గురు కీలక బ్యాటర్లు మెరవటంతో రాజస్థాన్ రాయల్స్ తడాఖా చూపించింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (35, 18 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), జోశ్ బట్లర్ (95, 59 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 54 పరుగులు జోడించి శుభారంభం అందించారు. పవర్‌ప్లేలో జైస్వాల్ దూకుడుగా ఆడాడు. జైస్వాల్ వికెట్ కోల్పోయినా.. ఆరు ఓవర్లలో 61 పరుగులు జోడించింది. జోశ్ బట్లర్‌కు సంజు శాంసన్ జత కలవటంతో రాయల్స్ ఇన్నింగ్స్ దూకుడు పట్టాలెక్కింది. ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 32 బంతుల్లోనే జోశ్ బట్లర్ అర్ధ సెంచరీ సాధించగా.. రెండు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 33 బంతుల్లో సంజు శాంసన్ ఫిఫ్టీ అందుకున్నాడు. ఓ ఎండ్‌లో బట్లర్, మరో ఎండ్‌లో శాంసన్ ఎడాపెడా బౌండరీలు బాదటంతో సన్‌రైజర్స్ బౌలర్లు తేలిపోయారు. సెంచరీ ముంగిట జోశ్ బట్లర్ నిష్క్రమించినా.. సంజు శాంసన్ మెరుపు ముగింపు అందించాడు. షిమ్రోన్ హెట్‌మయర్ (7 నాటౌట్) అజేయంగా నిలిచాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్, మార్కో జాన్సెన్ చెరో వికెట్ పడగొట్టారు. భువనేశ్వర్ కుమార్, మార్కో జాన్సెన్ నాలుగు ఓవర్లలో 44 పరుగుల చొప్పున సమర్పించుకున్నారు. మాయగాడు మయాంక్ మార్కండె ఏకంగా 51 పరుగులు సమర్పించుకుని అర్ధ సెంచరీ కొట్టాడు.

స్కోరు వివరాలు :

రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (సి) నటరాజన్ (బి) మార్కో జాన్సెన్ 35, జోశ్ బట్లర్ (ఎల్బీ) భువనేశ్వర్ కుమార్ 95, సంజు శాంసన్ నాటౌట్ 66, షిమ్రోన్ హెట్‌మయర్ నాటౌట్ 7, ఎక్స్‌ట్రాలు : 11, **మొత్తం : (20 ఓవర్లలో 2 వికెట్లకు) 214.**

వికెట్ల పతనం : 1-54, 2-192.

బౌలింగ్ : భువనేశ్వర్ కుమార్ 4-0-44-1, మార్కో జాన్సెన్ 4-0-44-1, నటరాజన్ 4-0-36-0, మయాంక్ మార్కండె 4-0-51-0, అభిషేక్ శర్మ 2-0-15-0, వివ్రాంత్ శర్మ 2-0-18-0.

డబ్బింగ్ షురూ..



బోయపాటి శ్రీను, రామ్

రామ్, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ చిత్రంలో అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు యాక్షన్, మాస్ ఎక్కువగా ఉండ బోతున్నాయి. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస చిట్టూరి భారీ బడ్జెట్‌తో అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన డబ్బింగ్ పనులు ప్రారంభమైయ్యాయి. దీన్ని తెలియజేస్తూ డబ్బింగ్ స్టూడియోలో ఉన్న దర్శకుడు బోయపాటి ఫొటోను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇటీవలే విడుదల చేసిన ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో రామ్‌కు జోడిగా శ్రీలీల నటిస్తోంది. ప్రముఖ పాత్రలలో కొంతమంది ప్రముఖ నటీనటులు కూడా నటిస్తున్నారు. దసరా కానుకగా అక్టోబర్ 20న విడుదల కానున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: బోయపాటి శ్రీను, నిర్మాత: శ్రీనివాస చిట్టూరి, సంగీతం: ఎస్ తమన్, డీవోపీ: సంతోష్ డిటాకే, ఎడిటింగ్: తమ్మిరాజు.

సర్‌ప్రైజ్ చేసే యూనిక్ కాన్సెప్ట్



కావ్యా థాపర్, సందీప్ కిషన్

సందీప్ కిషన్, వీఐ ఆనంద్ కాంబినేషన్‌లో వస్తున్న ఫాంటసీ, అడ్వెంచరస్ యాక్షన్ థ్రిల్లర్ 'ఊరు పేరు భైరవకోన'. ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. హాస్య మూవీస్ బ్యానర్ పై రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, ఏకె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై అనిల్ సుంకర సమర్పిస్తున్నారు. బాలాజీ గుత్తా ఈ చిత్రానికి సహ నిర్మాత. తాజాగా మేకర్స్ టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ, 'నా బర్త్ డే రోజు టీజర్ విడుదల కావడం స్పెషల్ మూమెంట్. తొలిసారి చండీయాగం చేసి టీజర్ విడుదల చేయడం చాలా పాజిటివ్‌గా ఉంది. ఈ సినిమాలో చాలా మంచి విషయాలు, వినోదాత్మక విషయాలు ఉంటాయి. ఫాంటసీ అడ్వెంచర్ సినిమాలు నాకు వ్యక్తిగతంగా చాలా ఇష్టం. వర్ష బొల్లమ్మ, కావ్య.. ఇలా అందరూ చాలా చక్కగా నటించారు' అని తెలిపారు."ఊరు పేరు భైరవకోన' యూనిక్ కాన్సెప్ట్. అలాగే ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది. సూపర్ నేచురల్ ఫాంటసీ ఎలిమెంట్స్ ఉంటాయి. నిర్మాత రాజేష్ ఎక్కడా రాజీ పడకుండా పూర్తి సహకారం అందించారు. అనిల్ మొదటి నుంచి నన్ను ప్రోత్సహిస్తున్నారు. వైవా హర్ష పాత్ర ఇందులో కీలకంగా ఉంటుంది. సినిమాని చాలా కొత్తగా ప్రయత్నించాం' అని దర్శకుడు విఐ ఆనంద్ అన్నారు. సమర్పకుడు అనిల్ సుంకర మాట్లాడుతూ, 'టీజర్ సందీప్‌కి బర్త్ డే గిఫ్ట్ మాత్రమే కాదు బ్లాక్ బస్టర్ గిఫ్ట్ కూడా. దర్శకుడు చెప్పిన దానిలో 70 శాతం విజువల్స్ ఉంటే అది బ్లాక్ బస్టర్ అవుతుంది. కానీ ఆనంద్ చెప్పిన దాని కంటే 50 శాతం ఎక్కువ విజువల్‌గా ఉంది. విజువల్ చూసి చాలా ఆశ్చర్యపోయాను. ప్రేక్షకులు కూడా చాలా సర్‌ప్రైజ్ అవుతారు' అని చెప్పారు. నిర్మాత రాజేష్ దండా మాట్లాడుతూ, 'భారీ స్థాయిలో ఆనంద్ స్టైల్‌లో సూపర్ నేచురల్ ఫాంటసీగా ఈ సినిమా వస్తుంది. ఈ టీజర్ చూసి సినిమా రేంజ్ ఏమిటనేది మీరే చెప్పాలి. అనిల్ చాలా మంచి సూచనలు, సలహాలు ఇచ్చారు' అని తెలిపారు.

నవచిత్రం

అదే కస్టడీ ప్రత్యేకత..



'దాదాపు అన్ని సినిమాల్లో విలన్‌ని హీరో అంతం చేయడానికి ప్రయత్నిస్తాడు. కానీ 'కస్టడీ'లో మాత్రం విలన్‌ని హీరో కాపాడటానికి ప్రయత్నిస్తాడు. ఇది చాలా ఆసక్తికరంగా ఉంటుంది' అని కథానాయిక కృతిశెట్టి అన్నారు. నాగ చైతన్య వెంకట్ ప్రభు కాంబోలో తెలుగు-తమిళ ద్విభాషా ప్రాజెక్ట్‌గా వస్తున్న చిత్రం 'కస్టడీ'. కృతి శెట్టి కథానాయిక. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై ఈ ప్రాజెక్ట్‌ని పవన్‌కుమార్ సమర్పిస్తుండగా, శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. ఈనెల 12న సినిమా విడుదల కాబోతున్న నేపథ్యంలో నాయిక కృతిశెట్టి మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

'దాదాపు అన్నీ సినిమాల్లో విలన్‌ని హీరో అంతం చేయడానికి ప్రయత్నిస్తాడు. కానీ ఇందులలో మాత్రం విలన్‌ని హీరో కాపాడటానికి ప్రయత్నిస్తాడు. ఆద్యంతం ఇది ఆసక్తికరంగా ఉంటుంది. ఈ కథలో నా పాత్రకు చాలా ప్రాధన్యత ఉంది. కథ సీరియస్ అవుతున్నప్పుడు నా పాత్ర దాన్ని బ్యాలెన్స్ చేస్తుంది. స్క్రీన్‌ప్లేతో నా పాత్ర ప్రయాణిస్తూ ఉండటమే కాకుండా నటనకు ఆస్కారం వుండే పాత్ర. నా పాత్ర నిడివి కూడా ఎక్కువే. సాధారణంగా సినిమాల కోసం డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తాం, కానీ ఈ సినిమా కోసం జిమ్నాస్టిక్స్ ప్రాక్టీస్ చేశాను. ఇది యాక్షన్‌ఎంటర్‌టైనర్. ఈ సినిమా తర్వాత మార్వెల్స్ స్టూడియో నుంచి నాకు కాల్ వస్తుందని వెంకట్ ప్రభుతో చెప్పాను (నవ్వుతూ). నా పాత్రలో మంచి ఎమోషన్ ఉంటుంది. ఇందులో ఉన్న అండర్ వాటర్ సీక్వెన్స్ అద్భుతంగా ఉంటుంది. దీన్ని చాలా ఎంజాయ్ చేస్తూ చేశాం. దాదాపు 15 రోజులు ఆ సీక్వెన్స్ చేశాం. ఒక ఐదు రోజుల పాటు కంటిన్యూగా వాటర్ లోనే ఉన్నాం. దీని కోసం రెండు రోజులు శిక్షణ తీసుకున్నాం. ఊపిరి తీసుకోకుండా రెండు నిముషాలు పాటు ఉంటేనే ఒక షాట్ సాధ్యపడుతుంది. ఒక దశలో నాకు భయం వేసింది. నాగ చైతన్య నా ఫేవరట్ నటుడే కాదు వ్యక్తి కూడా. తను చాలా నిజాయితీగా ఉంటారు. ఈ కథలో పాత్రలు చాలా కంఫర్ట్ బుల్‌గా ఉండాలి. నేను ఆఫ్ స్క్రీన్‌లో చైతో కంఫర్ట్ బుల్‌గా ఉంటాను. కాబట్టి ఆన్‌స్క్రీన్ కూడా చక్కగా వర్క్ అవుట్ అయ్యింది. దర్శకుడు వెంకట్ ప్రభు చాలా ఫ్రెండ్లీ. నాకు దర్శకత్వం చేయాలనే ఉంది. అయితే అది ఇప్పుడే కాదు. నేను ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తాను. దీనికి సంబంధించి ఇంకా చాలా విషయాలు నేర్చుకోవాలి. అలాగే ఏ భాషలోనైనా నటించటానికి రెడీగా ఉన్నాను. అయితే కథ మాత్రం తప్పనిసరిగా నచ్చాలి. ప్రస్తుతం శర్వానంద్‌తో ఓ సినిమా చేస్తున్నా. అలాగే ఓ మలయాళం సినిమాతోపాటు ఇంకొన్ని ప్రాజెక్ట్స్ గురించి మేకర్స్ త్వరలోనే అనౌన్స్ చేస్తారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886